

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 24-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 160 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: తదియ పూర్తి, నక్షత్రం: చిత్ర సా.4:17 తదుపరి స్వాతి, వర్జ్యం: రా.10:33-12:20, దుర్ముహూర్తం: ఉ.11:43-12:31, అమృతఘడియలు: ఉ.9:11-10:57, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:07, సూర్యాస్తమయం: 6:06 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


71వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో మోహన్‌లాల్, షారుఖ్ ఖాన్, రాణీ ముఖర్జీ, విక్రాంత్

ఘనంగా జాతీయ సినీ అవార్డుల
ప్రదానోత్సవం

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం

దాదాసాహెబ్ ఫాల్కే అందుకున్న మోహన్‌లాల్

ఉత్తమ నటుడి అవార్డును సంయుక్తంగా తీసుకున్న షారుఖ్ ఖాన్, విక్రాంత్ మస్సే 11

ఉత్తమ నటి అవార్డు స్వీకరించిన రాణీ ముఖర్జీ

విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న తిరుమల శ్రీవారి ఆలయం


బ్రహ్మాండ నాయకుడికి
బ్రహ్మోత్సవం

వేడుకలకు వైభవంగా అంకురార్పణ 3

నేడు ధ్వజారోహణం, పెద్దశేష వాహన సేవ

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

ప్రగతికి మార్గం పీపీపీలే!



పేదలకు ఆరోగ్య భద్రత మా బాధ్యత

ప్రైవేటుకు ఇవ్వడం లేదు.. పీపీపీ కింద మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నాం

నిర్మించి, నిర్వహించి, 33 ఏళ్ల తర్వాత తిరిగిస్తారు.. వైసీపీలా కట్టాలంటే 23 ఏళ్లు పడుతుంది

మేం రెండేళ్లలోనే పూర్తిచేసి చూపిస్తాం.. పైగా అప్పటికంటే ఎక్కువ సీట్ల లభ్యత

ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు.. ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తాం

90% సిజేరియన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే.. ఇది ప్రమాదకర ధోరణి.. వెంటనే కట్టడిచేయాలి: సీఎం

దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పటి నుంచీ పీపీపీ విధానం ఉంది. ఈ సంస్కరణలకు ముందు మిశ్రమ ఆర్థిక విధానం అమలైంది. అప్పట్లో ప్రభుత్వం పెట్టుబడులు పెడితే, ఫలితాలు కనిపించేవి కాదు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాం. దానివల్ల సంపద భారీగా పెరిగింది. ఆదాయమూ పెరిగింది. ఇప్పుడు మనం సూపర్ జీఎస్టీ, సూపర్ పొదుపు వరకు వచ్చాం. దేశం అంతా ఇలా ఒక దారిలో వెళ్తుంటే, వైసీపీ నేతలు మాత్రం మరో దారిలో ఉన్నారు.

- అసెంబ్లీలో ఆరోగ్య శాఖపై చర్చలో సీఎం చంద్రబాబు


మంగళవారం విజయవాడలో వివిధ బ్యాంకుల ఎండీలు, చైర్మన్లతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

రాజధానిలో కార్యాలయాలు పెట్టండి

రాష్ట్ర ప్రాజెక్టుల్లో భాగస్వాములుకండి 12

బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరిన సీఎం

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుకున్న ప్రగతిని త్వరితగతిన సాధించాలంటే పీపీపీ విధానమే మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో పేదలకు పూర్తి ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. "నేను సీఎంగా ఉండగా గతంలో జేగురుపాడు పవర్ ప్లాంట్‌ను పీపీపీ విధానంలో జీవీకే కంపెనీకి అప్పగించాను. దానిని పూర్తి చేసి తిరిగి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అదీ పీపీపీ మోడల్ పవర్. ఇదే విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించనున్నాం. ఆస్తి ప్రభుత్వానిది.. నిర్వహణ ప్రైవేటుది. బాగా నిర్వహించి, వచ్చిన లాభాలతో అప్పులు చెల్లించి, మిగిలినదానిలో కొంత లాభం వారు తీసుకుంటారు. 33 ఏళ్ల తర్వాత ఆ ఆస్తిని ప్రభుత్వానికి తిరిగిచ్చేస్తారు" అని చంద్రబాబు వివరించారు. మంగళవారం అసెంబ్లీలో ఆరోగ్య శాఖపై జరిగిన లఘుచర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొత్త మెడికల్

మిగతా 13వ పేజీలో...

ఎమ్మెల్యేలు పాజిటివ్ కర్మ చేయాలి

"ఎమ్మెల్యేలు పాజిటివ్ కర్మ చేయాలి. చాలామంది చూడటానికి మంచి శారీరక దారుఢ్యంతో కనిపిస్తారు. కానీ, లోపల చాలా రోగాలు ఉంటాయి. నేను గతంలో డాక్టర్లకు దీనిపై కొన్ని సూచనలు చేసేవాడిని. 'నాకు చికిత్స చేయడమేకాదు.. వైద్యులుగా మీ ఆరోగ్యం కూడా బాగు చేసుకోండి' అని చెప్పేవాడిని. శారీరక వ్యాయామం బాగా తగ్గిపోయింది. ప్రతి ఎమ్మెల్యే హెల్దీగా, హ్యాపీగా ఉండాలి. ఇక్కడనుంచి ఇంటికి వెళ్లగానే ఆనందంగా నిద్రపోండి. బాడీ చార్జ్ కావాలంటే నిద్ర కావాలి. నావరకు నేను.. గతంలో వలే

మిగతా 13వ పేజీలో...

విశాఖకు యాక్సెంచర్!

accenture

ఏపీకి రానున్న మరో దిగ్గజ టెక్ సంస్థ

పది ఎకరాల కోసం దరఖాస్తు

12 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ

ఐటీ హబ్‌గా మారుతున్న వైజాగ్

ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ సిద్ధం

ప్రభుత్వ పాలసీతో కంపెనీల క్యూ

అనుబంధ కంపెనీలూ వస్తాయంటున్న ఐటీ నిపుణులు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నానికి మరో దిగ్గజ కంపెనీ రానుంది. టెక్ కన్సల్టెన్సీ సంస్థ 'యాక్సెంచర్' ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తోంది. ఎకరా 99 పైసలు చొప్పున పది ఎకరాల భూమి లీజుకు కేటాయిస్తే విశాఖపట్నం వస్తామని, 12 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఆ సంస్థ ప్రతిపాదించినట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ మంగళవారం తన కథనంలో వెల్లడించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి

మిగతా 14వ పేజీలో...

రాష్ట్రంపై 2 ఏరోస్పేస్ సంస్థల ఆసక్తి 12

చిన్న విమానాల తయారీ యూనిట్ స్థాపనకు మనో ఎయిర్‌క్రాఫ్ట్ సంసిద్ధత

విమానాల కంట్రోల్ సిస్టమ్స్, హార్డ్‌వేర్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు డలాఫ్ట్ సిద్ధం

వైసీపీ పాలనలో ఆర్థిక ఉగ్రవాదం

కంపెనీలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారు.. పీపీఏలను ఏకపక్షంగా రద్దు చేశారు

రాష్ట్ర పరువు కూడా పోగొట్టారు.. వెనకబడ్డ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం 13

పెట్టుబడుల కోసం అహర్నిశలు కష్టపడుతున్నాం.. భారీ పరిశ్రమలు వస్తున్నాయ్

10.4 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాం: మంత్రి లోకేశ్

జీఎస్టీ తగ్గించలేదా..
డయల్ 1915

లేదా 88000 01915కి వాట్సాప్ చెయ్యండి

ఫిర్యాదులకు కేంద్రం ప్రత్యేక నంబర్లు

ధరలు తగ్గించి అమ్ముతున్నారా? లేదా? 2

ఈ-కామర్స్ సంస్థలపై కేంద్రం ఆరా

1 నుంచి ఆధార్ ఫీజుల పెంపు

నేరాల్లో నాకు సహకరించింది వీరే! 14

పోలీసు అధికారులు, ప్రముఖుల పేర్లు బయటపెట్టిన కి'లేడీ' అరుణ?

నేటి మధ్యాహ్నంతో ముగియనున్న కస్టడీ

అమరావతిపై వ్యతిరేక పోస్టులు..
జీఎస్టీ అధికారిపై సస్పెన్షన్ వేటు 14

సుభాష్ వివరణను తిరస్కరించిన ప్రభుత్వం

వ్యక్తిగతంగా రాసుకునే ఫేస్‌బుక్ వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించడం ఏమిటని ఆయన ప్రశ్న

విమర్శలతో ప్రజాస్వామ్యం బలపడుతుందని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని వాదన

నిర్మాణాత్మక విమర్శలకు, కువిమర్శలకు మధ్య తేడా ఉంటుందని ప్రభుత్వం స్పష్టీకరణ



హెచ్-1బీ లాటరీ..
ఇక కొత్తగా!

అత్యధిక వేతనాలు ఉన్నవారికి అధిక ప్రాధాన్యం 2

జీతం ఆధారంగా నాలుగు శ్రేణులుగా వర్గీకరణ

ఎక్కువ జీతం ఉన్నవారికి సెలెక్షన్ పూల్‌లో 4 ఎంట్రీలు

మధ్యస్థం 3.. తక్కువ జీతం 2.. కొత్తవారికి ఒక ఎంట్రీ

స్వర్ణం.. సరికొత్త గరిష్ఠం!



10 గ్రాముల ధర రూ.1,18,900

ఒక్కరోజులోనే రూ.2,700 పెరుగుదల

అదే బాటలో వెండి.. రూ.3,220 పెరిగి కిలో రూ.1.39 లక్షలకు చేరిన వైనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: బంగారం ధర భగ్గుమంటోంది. పండగల కాలంలో పసిడి కొండెక్కుతోంది. రోజురోజుకూ సామాన్యులు అందుకోలేని స్థాయికి ఎగబాకుతోంది. మంగళవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఏకంగా రూ.2,700 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,18,900కి చేరింది. 99.5% స్వచ్ఛత కలిగిన స్వర్ణం ధర కూడా రూ.2,650 పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.1,18,300కి ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.3,220 పెరిగి రూ.1,39,600 ధర పలికింది. అంతర్జాతీయ

మిగతా 2వ పేజీలో...

ప్రతిపక్ష నేత హోదా ఇప్పించండి!

స్పీకర్ రూలింగ్ చట్టవిరుద్ధమని ప్రకటించండి

మరోసారి హైకోర్టును ఆశ్రయించిన వైఎస్ జగన్



అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో తనను ప్రతిపక్ష నేతగా గుర్తించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలంటూ పులివెందుల ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తనను ప్రతిపక్షనేతగా గుర్తించేందుకు నిరాకరిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని.. దానిని రద్దు చేయాలని కూడా కోరారు. ఈ రూలింగ్ ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్

మిగతా 12వ పేజీలో...

వైసీపీ ఎమ్మెల్యేలపై ఎథిక్స్ కమిటీ దృష్టి

సభకు రాకుండా సంతకాలు పెట్టడం.. జీతభత్యాలు తీసుకోవడంపై చర్చ.. తదుపరి సమావేశంలో తుది నిర్ణయం 12



మండలిలో మంటలు

విశాఖ ఉక్కు, ఫీజు బకాయిలపై వాడీవేడి చర్చ

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు.. వందసార్లు చెప్పినా అర్థం కాదా?

ప్లాంటును కాపాడుకోడానికి 14 వేల కోట్లు తెచ్చాం.. వైసీపీపై లోకేశ్ ధ్వజం

ప్రైవేటీకరణ జరగాలని వైసీపీయే కోరుకుంటున్నట్లుగా ఉందని ఆగ్రహం

తమ సభ్యురాలిని అవమానించారని బొత్స ఆరోపణ.. లోకేశ్ మండిపాటు

నా తల్లిని అవమానించినప్పుడు సభలోనే ఉండి మీరేం చేశారు?

ఆమె ఎంత కుమిలిపోయిందో నాకు తెలుసు.. మహిళలను తిడితే ఆనందపడే వ్యక్తులం కాదు.. మా నేత అలాంటి సంస్కారం నేర్పలేదు

ఎమ్మెల్సీని 'కల్యాణిగారు' అనే అన్నాను.. రికార్డులు పరిశీలించండి: మంత్రి

ఫీజు బకాయిలపై చర్చకు సిద్ధమా అంటూ వైసీపీకి సవాల్

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశంపై మంగళవారం శాసనమండలి అట్టుడికింది. ప్రైవేటీకరణ జరగదని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదని.. కూటమి వచ్చాక ప్రైవేటీకరణను నిలిపివేశామని.. స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి రూ.14 వేల కోట్లు తీసుకొచ్చామని చెప్పారు. 'విశాఖ స్టీల్

మిగతా 12వ పేజీలో...

64.75 టీఎంసీలివ్వాలి

పోలవరం-బనకచర్ల అనుసంధానిస్తే కృష్ణా వాటాలో ఆ మేరకు కేటాయించాలి

ఇప్పటికే పట్టిసీమ నుంచి 80 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం కృష్ణాలోకి ఎత్తిపోస్తోంది

కొత్త పేచీ లేవనెత్తిన కర్ణాటక సర్కారు 14

కేంద్ర జలశక్తి అదనపు కార్యదర్శికి లేఖ

కృష్ణా బేసిన్ కాదు, వాటా ఇవ్వక్కర్లేదు: ఏపీ


14

నల్లమలలో 87 పెద్దపులులు

ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించాం

ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వెల్లడి

33 కోట్లు కొట్టాలి.. గోవాలో సెటిలవ్వాలి!

పది చోరీల్లోనే రూ.3 కోట్లు దోపిడీ

నెలకో లగ్జరీ కారు.. 2 లక్షల అద్దెతో విల్లా

కోటీశ్వరుడి బిల్డప్.. చేసేది దొంగతనాలు

ఐదు రాష్ట్రాల్లో 90కి పైగా కేసులు 14

ఇదీ బత్తుల ప్రభాకరరావు నేర చరిత్ర

నేరం ఎలా చేయాలో స్క్రిప్టు రాసుకొని.. సీసీ కెమెరాలకు దొరక్కుండా జాగ్రత్త

కోర్టు నుంచి తీసుకెళ్తుండగా పరారీ

స్వర్ణం.. సరికొత్త గరిష్ఠం!

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరింత పెరగడంతో పాటు హెచ్-1బీ వీసా ఫీజు పెంపు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్‌పీఐ) ఉపసంహరణ ఫలితంగా రూపాయి ఆల్‌టైం కనిష్ఠానికి పతనమవడం కూడా ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. గత ఏడాది డిసెంబరు 31న రూ.78,950 పలికిన తులం బంగారం ధర.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.39,950 (50.60%) మేర పెరిగింది. అదేసమయంలో రూ.89,700గా ఉన్న కిలో వెండి ధర.. ఈ ఏడాది ఇప్పటికే 49,900 (55.63%) మేర పెరిగిపోయింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం రూ.1,750 పెరిగి రూ.1,14,330కి చేరింది. కేజీ వెండి రూ.1,000 పెరిగి రూ.1,49,000కి చేరింది. విజయవాడ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ.1,17,900, కేజీ వెండి రూ.1,39,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి ధర సరికొత్త పతాక స్థాయికి చేరింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 0.95 శాతం పెరుగుదలతో 3,811 డాలర్లకు చేరుకుంది.



సిల్వర్ 44.57 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరో రెండు సార్లు తగ్గించవచ్చన్న అంచనాలు ఇందుకు కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఫెడ్ రేట్లు మరింత తగ్గితే అమెరికా డాలర్, బాండ్లపై ప్రతిఫలాలు తగ్గుతాయన్న ముందు జాగ్రత్తతో మదుపరులు తమ పెట్టుబడులను విలువైన లోహాల్లోకి మళ్లిస్తున్నారు. ఫలితంగా బంగారం, వెండి ధరలు రోజుకో కొత్త శిఖరాన్ని అధిరోహిస్తున్నాయి.

జీఎస్టీ తగ్గించలేదా.. డయల్ 1915

లేదా 88000 01915కి వాట్సాప్ చెయ్యండి.. కేంద్రం ప్రత్యేక నెంబర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో తగ్గిన ధరల మేరకే వినియోగదారులకు వస్తు సేవలు లభిస్తున్నాయా? లేదా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు 1915 అనే టోల్ ఫ్రీ నెంబర్, 88000 01915 వాట్సాప్ నెంబర్లను మంగళవారం అందుబాటులోకి తెచ్చింది. తగ్గిన ధరల మేరకు వ్యాపారులు వస్తువులను విక్రయించకుంటే వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి లేదా నిర్దేశిత వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేసి తమ ఫిర్యాదులు చేయవచ్చని సూచించింది. ఈ మేరకు 'సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) ఓ ప్రకటన చేసింది. అలాగే, తమ ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ మెకానిజమ్(ఐఎన్‌జీఆర్‌ఎం) పోర్టల్ ద్వారా కూడా వినియోగదారులు తమ ఫిర్యాదులు చేయవచ్చునని పేర్కొంది. మరోపక్క, ఈ-కామర్స్ సంస్థలు తగ్గిన ధరల మేరకే వినియోగదారులకు సరుకులను అందిస్తున్నాయా? లేదా? అన్నదానిపై కూడా కేంద్రం దృష్టి పెట్టింది. ఇక, ప్రజలు అధికంగా వినియోగించే 54 రకాల ఉత్పత్తుల ధరల్లో వచ్చిన మార్పులపై ప్రతి నెలా సీబీఐసీకి నివేదిక సమర్పించాలని జీఎస్టీ అధికారులను ఈ నెల9వ తేదీనే కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు తొలి నివేదికను సెప్టెంబరు 30వ తేదీలోపు సమర్పించాల్సి ఉంది. ఈ 54 రకాల ఉత్పత్తుల్లో వెన్న, షాంపూ, టూత్‌పేస్ట్, ఐస్‌క్రీమ్, ఏసీ, టీవీ, గ్లూకోమీటర్, సిమెంట్ ఉన్నాయి.

లోకం తీరు



1 నుంచి ఆధార్ ఫీజుల పెంపు

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి ఆధార్ సేవల రుసుములు పెరగనున్నాయి. ఆధార్‌లో తప్పుల సవరణ లేదా వివరాల అప్‌డేట్ కోసం ఇంతవరకు రూ.50 వసూలు చేస్తుండగా రూ.75కు పెంచుతున్నట్లు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) తెలిపింది. 7-15 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు, 17 సంవత్సరాల వయసు దాటిన వారికి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ రుసుమును రూ.100 నుంచి రూ.125కు పెంచారు. యూఐడీఏఐ పోర్టల్ ద్వారా నేరుగా పొందే సేవల రుసుమును రూ.50 నుంచి రూ.75 పెంచారు. పోయిన ఆధార్ స్థానంలో కొత్తది కావాలంటే దరఖాస్తు ఫీజు రూ.40 చెల్లించాల్సి ఉంటుంది.

భారత్‌తో సంబంధాలు మాకు అత్యంత కీలకం!

» అమెరికా విదేశాంగ మంత్రి రుబియో వ్యాఖ్యలు

న్యూయార్క్, సెప్టెంబరు 23: భారత దిగుమతులపై విధించిన భారీ సుంకాలు, హెచ్-1బీ వీసా రుసుము పెంపు వంటి నిర్ణయాల నేపథ్యంలో అమెరికాతో భారత్ ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఇలాంటి సమయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. భారత్ తమకు అత్యంత ముఖ్య దేశమని, ఆ దేశంతో సంబంధాలు తమకు అత్యంత కీలకమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి(ఐరాస) 80వ సర్వప్రతినిధుల సదస్సుకు భారత్ తరఫున హాజరైన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఆయన చర్చలు జరిపారు. అనంతరం.. రుబియో తన అభిప్రాయాలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. వాణిజ్యం, రక్షణ, విద్యుత్తు సహా అన్ని కీలక రంగాల్లో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. "మా చర్చలు దేశాలకు శ్రేయస్సును చేకూరుస్తాయి." అని పేర్కొన్నారు. ఇక, ఈ విషయంపై జైశంకర్ స్పందిస్తూ.. "రుబియోతో భేటీ కావడం ఆనందంగా ఉంది." అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

బస్సుల్లోనే ఆగిన ఊపిరి

» వేర్వేరు బస్సుల్లో గుండెపోటుతో కండక్టర్, మహిళ మృతి

పెందుర్తి (విశాఖపట్నం జిల్లా), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ఇద్దరు వ్యక్తులు ఒకేరోజు గుండెపోటుతో కుప్పకూలిపోయారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ పి.ఈశ్వరరావు (51) మంగళవారం మధ్యాహ్నం విశాఖ నుంచి కొట్టాం వెళ్తుండగా, బస్సు సరిపల్లి చేరుకునేసరికి గుండెనొప్పితో కుప్పకూలి పోయారు. డ్రైవర్ వెంటనే అదే బస్సులో పెందుర్తి సీహెచ్‌సీకి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. అలాగే, శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం తుహసింగికి చెందిన ఇసై పగడాలమ్మ (53) ఇటీవల చినముషిడివాడలో ఉంటున్న కుమారుడి ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మంగళవారం చినముషిడివాడ బస్టాప్ వద్ద బస్సు ఎక్కిన కొద్దిసేపటికే గుండెపోటుతో కన్నుమూశారు.

'హనుమాన్'పై అమెరికన్ నేత విద్వేష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం సుగర్ ల్యాండ్ పట్టణంలో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహంపై రిపబ్లికన్ పార్టీ నేత అలెగ్జాండర్ డంకన్ తీవ్ర వివాదాస్పద, మత విద్వేష వ్యాఖ్యలు చేశాడు. 'నకిలీ హిందూ దేవుడికి సంబంధించిన నకిలీ విగ్రహాన్ని ఇక్కడ టెక్సాస్‌లో మనం ఎందుకు అనుమతిస్తున్నాం? మనది క్రిస్టియన్ దేశం' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో నోరుపారేసుకున్నాడు. అలెగ్జాండర్ డంకన్ పోస్టుపై హిందూ సమాజం నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డంకన్ వ్యాఖ్యలను ది హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఖండించింది. ఈ విషయంపై టెక్సాస్ రిపబ్లికన్ పార్టీకి ఫిర్యాదు చేసింది. కాగా, టెక్సాస్ రాష్ట్రం సుగర్ ల్యాండ్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో 90 అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ కాంస్య విగ్రహాన్ని గతేడాది ఏర్పాటు చేశారు.

కోల్‌కతాలో వరుణుడి బీభత్సం

» విద్యుదాఘాతంతో పది మంది మృతి

కోల్‌కతా, సెప్టెంబరు 23: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు నగరవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించిపోగా.. వేర్వేరు ప్రాంతాల్లో 10 మంది మృత్యువాత పడ్డారు. వీరంతా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. కోల్‌కతాలో 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 25.14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1986లో కోల్‌కతాలో 25.95 సెం.మీల వర్షపాతం నమోదవ్వగా.. ఆ తర్వాత ఇన్నేళ్లకు మంగళవారం ఆ స్థాయి వర్షం కురిసింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 30 సెం.మీలకు పైగా వర్షం కురిసిందని ఐఎండీ పేర్కొంది. భారీ వర్షం ప్రజా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ స్థాయి వర్షాన్ని మునుపెన్నడూ చూడలేదని సీఎం మమత అన్నారు. మరణాలకు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రైవేటు సంస్థ సీఈఎస్‌సీదే బాధ్యతని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు మంగళవారం ప్రకటించారు.

నిరభ్యంతర పత్రాలు రాక అయోధ్య మసీదు ప్లాన్ తిరస్కరణ

అయోధ్య, సెప్టెంబరు 23: అయోధ్యకు సమీపంలోని ధన్నీపూర్ గ్రామంలో నిర్మించతలపెట్టిన మసీదు ప్లాన్‌ను అయోధ్య అభివృద్ధి సంస్థ (ఏడీఏ) తిరస్కరించింది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఇంకా నిరభ్యంతర పత్రాలు(ఎన్‌ఓసీలు) అందకపోవడమే ఇందుకు కారణమని తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద జర్నలిస్టు ఓం ప్రకాశ్ సింగ్ సమర్పించిన దరఖాస్తుకు సమాధానంగా ఈ నెల 16న ఈ విషయాన్ని వెల్లడించింది. రామజన్మభూమి కేసు తీర్పులో భాగంగా నూతన మసీదు నిర్మాణం నిమిత్తం సెంట్రల్ సున్నీ వక్ఫ్ బోర్డుకు అయిదెకరాల స్థలం కేటాయించాలని 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు అయోధ్యకు 25 కి.మీ. దూరంలోని ధన్నీపూర్‌లో ఆ స్థలాన్ని అప్పగిస్తూ 2020 ఆగస్టు 3న జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణానికి సంబంధించి 2021 జూన్ 23న మసీదు ట్రస్టు అయోధ్య అభివృద్ధి అథారిటీకి దరఖాస్తు సమర్పించింది.

ఇన్ఫోసిస్ సుధామూర్తికి సైబర్ నేరగాళ్ల ఫోన్

» వ్యక్తిగత సమాచార సేకరణకు ప్రయత్నం

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి నా వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో బెదిరింపునకు దిగాడు' అని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముఖ్యులు, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి బెంగళూరు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 5న ఉదయం సుమారు 9.40 గంటల ప్రాంతంలో ఆమెకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. టెలికామ్ డిపార్ట్‌మెంట్ నుంచి చేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. మొబైల్ నంబరు ఆధార్‌కు లింక్ చేసుకోవాలని చెప్పాడు. ఆ క్రమంలో వ్యక్తిగత సమాచారం తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. 'మీ నంబరు నుంచి అశ్లీల వీడియోలు పోస్ట్ అయ్యాయి. మీ నంబరు మరో రెండు గంటల్లో నిలిచిపోతుంది' అంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెచ్-1బీ లాటరీ... ఇక కొత్తగా!

వాషింగ్టన్, సెప్టెంబరు 23: లక్ష డాలర్ల వన్‌టైమ్ ఫీజుతో ఇప్పటికే హెచ్-1బీ వీసాలపై కత్తి ఝుళిపించిన ట్రంప్ సర్కారు.. ఆ వీసాలు జారీ చేయడానికి ఇన్నాళ్లుగా వాడుతున్న లాటరీ విధానంలో మార్పులు తెచ్చేందుకు సిద్ధమైంది! అత్యుత్తమ ప్రతిభ కలిగి.. అధిక వేతనాలు అందుకునే వారికి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చేలాగా ఈ కొత్త ఎంపిక ప్రక్రియను రూపొందించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనకు 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' నుంచి అనుమతి పొంది.. ఫెడరల్ రిజిస్టర్‌లో మంగళవారం ప్రచురించింది. ఇప్పటిదాకా హెచ్-1బీ వీసాల జారీకి అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) అనుసరిస్తున్న లాటరీ విధానంలో.. ఆ వీసాపై రావాలనుకునే ఉద్యోగులందరూ సమానమే. ప్రతిభ ఆధారంగాగానీ.. జీతం ఆధారంగాగానీ ఎవరికీ ఎలాంటి ప్రాధాన్యమూ ఇవ్వరు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ తీసుకుని కంప్యూటరైజ్డ్ విధానంలో లాటరీ వేసేవారు. ఎంపికైనవారు అమెరికాకు వచ్చేవారు. కానీ.. కొత్త విధానంలో 'వెయిటెడ్ సెలక్షన్' పద్ధతిని అనుసరిస్తారు. అంటే.. ఎక్కువ నైపుణ్యం ఉండి, ఎక్కువ జీతం అందుకునే వారికి ఎక్కువ ప్రాధాన్యం.. ఎంపిక ప్రక్రియలో ఎక్కువ అవకాశాలు ఇస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా.. హెచ్-1బీ వీసాల కోసం వచ్చే దరఖాస్తులను.. ఎక్కువ జీతం (లెవెల్ 4), మధ్యస్థ జీతం (లెవెల్ 3), తక్కువ జీతం (లెవెల్ 2), ఎంట్రీ లెవెల్ (ఒకటో లెవెల్) అని నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు. వీరిలో ఎక్కువ నైపుణ్యం, ఎక్కువ జీతం ఉండే లెవెల్ 4 వారికి సెలెక్షన్‌పూల్‌లో నాలుగు ఎంట్రీలు ఇస్తారు. మధ్యస్థ జీతం ఉన్నవారికి 3 ఎంట్రీలు, తక్కువ జీతం ఉన్నవారికి 2 ఎంట్రీలు, ప్రవేశస్థాయివారికి ఒక ఎంట్రీ ఇస్తారు. ఒక ఎంట్రీని ఒక టికెట్‌గా పరిగణిస్తే.. ఒక టికెట్ ఉన్నవారు ఎంపికయ్యే అవకాశం



20% ఉంటుంది. అదే నాలుగు టికెట్లు ఉన్నవారు ఎంపికయ్యే చాన్స్ 80% దాకా ఉంటుంది. అంటే.. ఎక్కువ నైపుణ్యం ఉన్నవారే అమెరికాలో అడుగు పెట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నమాట. అలాంటివారి వల్ల తమ దేశానికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నది ట్రంప్ సర్కారు ఉద్దేశం. అలాగని ఎక్కువ జీతం/ఎక్కువ ప్రతిభ ఉన్నవారినే కాకుండా.. అన్ని స్థాయులవారికీ అవకాశాలు కల్పించేలాగా ఈ విధానాన్ని రూపొందించినట్టు ట్రంప్ యంత్రాంగం చెబుతోంది. ఈ కొత్త విధానం వల్ల.. హెచ్-1బీ వీసా వచ్చే అవకాశాన్ని మెరుగుపరిచేందుకు కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలు పెంచుతాయని.. ఇలా పెరిగే మొత్తం 502 మిలియన్ డాలర్ల దాకా (దాదాపు రూ.4,400 కోట్లు) ఉంటుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అంచనా వేస్తోంది. అయితే.. లెవెల్ 1 ఉద్యోగాలకు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే చిన్న కంపెనీలపై ఈ విధానం వల్ల ఎక్కువగా భారం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్నవే అయినప్పటికీ.. ఎక్కువ జీతాలిచ్చే ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు మాత్రం ఈ విధానం ఎక్కువగా ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. ట్రంప్ సర్కారు ప్రతిపాదిస్తున్న ఈ కొత్త విధానం.. అడ్వాన్స్‌డ్ డిగ్రీలు కలిగి ఉండి, అత్యధిక వేతనాలు అందుకునే భారతీయ సీనియర్ టెకీలకు ప్రయోజనకరమని, కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి మాత్రం దీనివల్ల నష్టమేనని వారు వివరిస్తున్నారు. కాగా.. ట్రంప్ సర్కారు రూపొందించిన ఈ విధానం ప్రస్తుతానికి ప్రతిపాదన దశలోనే ఉంది. దీనిపై ప్రజాభిప్రాయాన్ని కోరారు. ప్రజలు, పరిశ్రమ వర్గాలు.. ఇలా అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను తీసుకున్నాకే కొత్త విధానానికి సంబంధించిన మార్గదర్శకాలు, నియమ, నిబంధనలను ఖరారు చేస్తారు.

హెచ్1బీ ఫీజు పెంపు ప్రభావం నామమాత్రమే: నాస్కామ్ చీఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: హెచ్-1బీ వీసాల ఫీజు గణనీయంగా పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం ప్రభావం మన దేశంపై నామమాత్రంగానే ఉంటుందని నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ పేర్కొన్నారు. భారతీయ కంపెనీలు గత కొన్నేళ్లుగా ఆ వీసాలపై ఆధారపడడాన్ని తగ్గించుకుంటూ వస్తున్నాయని.. ఈ పెంపు వల్ల అమెరికాకు చెందిన టెక్ దిగ్గజ సంస్థలపైనే ఎక్కువగా భారం పడుతుందని ఆయన విశ్లేషించారు. 'వైర్' వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంశంపై వివరంగా మాట్లాడారు. టెక్నాలజీలో అమెరికా అగ్రస్థానాన్ని, దీర్ఘకాలిక ఆర్థిక శక్తిని కొనసాగించాలంటే అమెరికన్ కంపెనీలన్నీ హెచ్-1బీ వీసాలపై అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఫలితంగా వాటిపై ప్రభావం కొన్ని రెట్లు అధికంగా ఉంటుందని నంబియార్ అన్నారు. గత పదేళ్ల కాలంలో భారత్‌లో 1,760 గ్లోబల్ క్యాబబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటయ్యాయని, హెచ్-1బీ వీసా ఫీజు పెంపు నేపథ్యంలో.. పలు కంపెనీలు మనదేశంలో జీసీసీలను మరింతగా విస్తరించే అవకాశం ఉందన్నారు.

హెచ్1బీ ఫీజు గోల వేళ.. రెండు అమెరికా కంపెనీలకు భారతీయ సీఈవోలు!

» టీ-మొబైల్ సీఈవోగా శ్రీని గోపాలన్

» మోల్సన్ కూర్స్ అధ్యక్షుడిగా రాహుల్



శ్రీని గోపాలన్



రాహుల్ గోయెల్

వాషింగ్టన్, సెప్టెంబరు 23: హెచ్1బీ వీసా ఫీజు భారీగా పెంపు, ఇతర చర్యలతో భారత నిపుణులకు, విద్యార్థులకు ట్రంప్ యంత్రాంగం పొగపెడుతున్న సమయంలో.. రెండు అమెరికా కంపెనీలు తమ సీఈవోలుగా ఇద్దరు భారతీయులను నియమించుకున్నాయి. అమెరికాలో అతిపెద్ద టెలికాం సంస్థ 'టీ-మొబైల్' తమ సీఈవోగా శ్రీని గోపాలన్‌ను నియమించింది. ప్రస్తుత సీఈవో మైక్ సీవెర్ట్ స్థానంలో నవంబర్ 1 నుంచి గోపాలన్ బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించింది. అహ్మదాబాద్ ఐఐఎంలో చదువుకున్న గోపాలన్.. హిందూస్థాన్ యూనిలివర్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా కెరీర్ ప్రారంభించారు. ప్రస్తుతం టీ-మొబైల్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో)గా ఉన్నారు. ఆయన పనితీరు, ప్రతిభ ఆధారంగా సీఈవో పదవికి ఎంపిక చేసినట్టు టీ-మొబైల్ పేర్కొంది. ఇక అమెరికాలో ప్రముఖ బీర్లు, ఇతర పానీయాల సంస్థ మోల్సన్ కూర్స్ సంస్థ సీఈవోగా 49 ఏళ్ల రాహుల్ గోయల్ నియమితులయ్యారు. మైసూర్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన.. తర్వాత అమెరికాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివారు. అక్కడే మోల్సన్ కూర్స్ సంస్థలో చేరారు. 24 ఏళ్లుగా అదే సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారు.

రుణాల వసూలు సమస్యలు సివిల్ వివాదాలే

» వాటిని క్రిమినల్ కేసులుగా మార్చొద్దు

» కోర్టులు రికవరీ ఏజెంట్లు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడం సివిల్ వివాదం కిందికి వస్తుందని, వాటిని క్రిమినల్ కేసులుగా మార్చకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రుణాలు వసూలు చేసి ఇవ్వడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కాదని వ్యాఖ్యానించింది. అరెస్టులు చేయిస్తామని బెదిరించి, అందుకు అనుగుణంగా కేసులు పెట్టించి రుణాలు వసూలు చేసుకోవడం ఇటీవల కాలంలో అధికమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇరు పక్షాలు కూడా సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా మార్చుకుంటున్నాయని తెలిపింది. అప్పు వసూలు వివాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిపై కిడ్నాప్ కేసు నమోదు చేయడంపై ధర్మాసనం విచారణ జరిపింది. ఇలాంటి సందర్భాల్లోనే పోలీసులు విచక్షణ జ్ఞానాన్ని ఉపయోగించాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. సివిల్ వివాదాన్ని క్రిమినల్ నేరంగా మార్చితే అది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసినట్టు అవుతుందని తెలిపారు. ఇలాంటి సమస్యలపై సలహాలు ఇవ్వడానికి ప్రతి జిల్లాలో రిటైర్డు జడ్జీలను సలహాదారులుగా నియమించుకుంటే మంచిదని, దీనిపై 2వారాల్లో సమాధానమివ్వాలని ఆదేశించారు.

పరువునష్టం చట్టాన్ని నేరరహితంగా మార్చాలి

ఆ సమయం ఆసన్నమైంది: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: పరువు నష్టం చట్టాన్ని నేరరహితంగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. క్రిమినల్ పరువు నష్టం కేసులో తమకు జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని కోరుతూ 'ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం' సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తన పరువుకు భంగం కలిగించేలా కథనాలు ప్రచురించిన 'ది వైర్' న్యూస్ పోర్టల్, దాని రాజకీయ వ్యవహారాల ఎడిటర్ అజోయ్ ఆశీర్వాద్ మహాప్రశస్థపై, జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ అమితా సింగ్ క్రిమినల్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం సుప్రీం ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదిస్తూ.. ఇదే అంశానికి సంబంధించి సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీ సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లు కూడా అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. దీంతో తాజా పిటిషన్‌ను కూడా పెండింగ్ పిటిషన్లకు జత చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

అగ్రనాయకత్వం అంతం లక్ష్యంగా..

అమర్‌నాథ్ యాత్రకోసం కశ్మీర్ పంపిన బలగాల్లో 80% దండకారణ్యానికి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: మధ్యభారతంలో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా విరుచుకుపడుతున్న కేంద్ర బలగాలు నిర్ణయాత్మక దాడులకు సిద్ధమవుతున్నాయి. నక్సల్స్ కదలికలు ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్రలకు మరిన్ని బలగాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూకశ్మీర్‌లో నియమించిన కేంద్ర పోలీస్ సాయుధ బలగాల్లో (సీఏపీఎఫ్) ఇంకా అక్కడే ఉండిపోయిన వారిలో 80% మేర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ విషయాన్ని సీఏపీఎఫ్‌లోని సీనియర్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మావోయిస్టు నాయకత్వాన్ని భౌతికంగా బలహీనపరచడం...ఇప్పటికీ వారి చేతుల్లోని ప్రాంతాలను ఒక్కొక్కటిగా స్వాధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా అదనపు బలగాలను కేటాయిస్తున్నట్టు తెలిపాయి. రాబోయే కొన్ని వారాల్లో అవి ఎర్ర బీభత్స ప్రాంతాలకు (రెడ్‌జోన్) చేరుకుంటాయని తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల రహిత భారత్‌ను నిర్మిస్తామని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకుగాను కేంద్ర కమిటీ సభ్యులపై గురిపెట్టి కేంద్ర బలగాలు దాడులు సాగిస్తున్నాయి. తాజాగా ఒకే ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా), కడారి సత్యనారాయణరెడ్డి (కోసా) మృతిచెందారు. ఈ ఏడాదిలో దాదాపు ఎనిమిదిమంది సీసీ సభ్యులను ఎన్‌కౌంటర్ చేశారు. ఒక సీసీ మెంబరు లొంగిపోయారు. నాయకుల్లో అధిక భాగం ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాల్లో తలదాచుకున్నట్టు కేంద్ర హోంశాఖ వద్ద సమాచారం ఉంది. ఈక్రమంలో ఈ మూడు రాష్ట్రాలపైనే దృష్టి పెట్టి.. అదనపు బలగాలను అక్కడకు అధికంగా తరలించాలని నిర్ణయించింది.



కాల్పులవిరమణ.. ఓ ఎత్తుగడ

మావోయిస్టులు చేస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర బలగాలు తిరస్కరించాయి. బలగాల దృష్టిని మళ్లించడం కోసం ఒక ఎత్తుగడగా ఈ ప్రతిపాదన చేస్తున్నారని పెదవి విరిశాయి. ఇటువంటి ప్రతిపాదనలతో మావోయిస్టులు ముందుకురావడం కొత్తకాదని, వాటికి పెద్దగా సాధికారికత కూడా లేదని కేంద్ర హోంశాఖలోని సీనియర్ అధికార వర్గాలు తెలిపాయి. సీనియర్ నాయకులు చనిపోతుండటంతో ఇప్పటికే ఆత్మరక్షణలో పడిపోయిన మావోయిస్టులు ఇలాంటి ఎత్తుగడలు పన్నుతున్నారని ఈ వర్గాలు తెలిపాయి. దండకారణ్య కమిటీ, కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన నాయకుల పని కూడా పడతామని స్పష్టం చేశాయి.

ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్, చైనా నుంచే నిధులు

» ఐక్యరాజ్యసమితిలో ట్రంప్



న్యూయార్క్, సెప్టెంబరు 23: ఉక్రెయిన్‌పై చేస్తున్న యుద్ధానికి రష్యాకు అవసరమైన నిధులు భారత్, చైనా దేశాల నుంచే అధికంగా వస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్, చైనా చమురు కొనుగోలు చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో భాగంగా ట్రంప్ మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలే ఉక్రెయిన్ యుద్ధానికి ప్రధాన పెట్టుబడిదారులంటూ ధ్వజమెత్తారు. నాటో సభ్య దేశాలు కూడా రష్యా నుంచి చమురు, ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లను తగ్గించుకోకపోవడం క్షమించకూడని విషయమన్నారు. నాటో దేశాలు తమపై జరిగే యుద్ధానికి తామే నిధులు ఇస్తున్నాయని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా సిద్ధంగా లేదని, ఈ నేపథ్యంలో రక్తపాతాన్ని ఆపేందుకు మరోసారి భారీ ఎత్తున సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలంటూ కొన్ని యూరోపియన్ దేశాలు చేసిన ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తే హమాస్ ఉగ్రవాదుల ఆకృత్యాలకు గుర్తింపునిచ్చినట్టు అవుతుందని పేర్కొన్నారు.

పాలస్తీనాకు దేశహోదా.. కానుక కాదు, హక్కు

ఇదొక్కటే గాజా యుద్ధానికి ముగింపు.. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో

» పాలస్తీనాకు మద్దతు పలికిన మొనాకో

» 145కు చేరిన మద్దతు దేశాల సంఖ్య

యునైటెడ్ నేషన్స్ సెప్టెంబరు 23: "పాలస్తీనాకు దేశహోదా అనేది హక్కు.. కానుక కాదు!. ప్రస్తుత పీడకలకు ఇదొక్కటే పరిష్కారం. గాజా యుద్ధానికి కూడా ఇదొక్కటే ముగింపు." అని ఐక్యరాజ్యసమితి(ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ స్పష్టం చేశారు. అమెరికాలోని న్యూయార్క్‌లో మంగళవారం ప్రారంభమైన ఐరాస 80వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాజాలో పరిస్థితి అత్యంత భీకరంగా, భయంకరంగా ఉందని తెలిపారు. ఇజ్రాయెల్-పాలస్తీనాల మధ్య వివాదానికి పాలస్తీనాకు దేశ హోదా కల్పించడమే పరిష్కారమని పేర్కొన్నారు. అయితే, హమాస్ మారణహోమాన్ని, పాలస్తీనా ప్రజల సామూహిక హననాలను ఎవరూ ఎట్టిపరిస్థితిలోనూ సమర్థించబోరని గుటెర్రెస్ నొక్కి చెప్పారు. మరోవైపు.. ఆక్రమిత వెస్ట్ బ్యాంకులో విస్తరించడాన్ని, నిర్మాణాలు చేపట్టడాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షురాలు అన్నాలేనా బేర్‌బాక్ ఖండించారు. వెస్ట్‌బ్యాంకులో విస్తరణలు, కూల్చివేతలు వంటివి రాజకీయ పరిష్కారాన్ని



మరింత క్లిష్టతరం చేస్తాయని తెలిపారు. ఇక, ఇజ్రాయెల్ ఆర్థిక శాఖ మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఇటీవల మాట్లాడుతూ.. పాలస్తీనా దేశం అనే మాటేలేదని, ఇప్పటి వరకు నినాదాలకే దీనిని పరిమితం చేశామని, ఇక నుంచి చర్యలకు దిగుతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే, పాలస్తీనాకు దేశ హోదా కల్పించాలని కోరుతున్న దేశాల్లో మొనాకో కూడా చేరింది. దీంతో పాలస్తీనాకు మద్దతిస్తున్న దేశాల సంఖ్య 145కు చేరింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జోర్డాన్ నది పశ్చిమాన ఏ దేశ ఏర్పాటును, గుర్తింపును తాము ఒప్పుకొనేది లేదని స్పష్టం చేశారు.

ఆయుధాలను అప్పగించండి

» హమాస్‌కు మహమ్మద్ అబ్బాస్ పిలుపు

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ పాలస్తీనాను గుర్తించే దేశాల సంఖ్య మరింత పెరుగుతోందని పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో గాజా పాలనలో హమాస్ పాత్ర అవసరం లేదని, ఆయుధాలను స్వాధీనం చేయాలని పిలుపునిచ్చారు. హమాస్ సహా ఇతర ఉగ్రవాద సంస్థలు తమ ఆయుధాలను పాలస్తీనా అధికారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐరాస సమావేశంలో మాట్లాడారు. ఆయుధాలు లేని ఏకీకృత దేశాన్నే తాము కోరుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా ఒకే చట్టం, ఒకే చట్టబద్ధమైన భద్రతా దళాలను కోరుకుంటున్నట్టు చెప్పారు. "ఈ యుద్ధం ముగిసిన తర్వాత అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "మూడు మాసాల్లో మధ్యంతర ముసాయిదా రాజ్యాంగాన్ని రూపొందిస్తాం. అధికారాలను దేశానికి బదలాయించే ప్రక్రియ చేపడతాం." అని తెలిపారు.





అష్టలక్ష్మి చంద్ర వంక కంఠిని టీటీడీ చైర్మన్‌కు అందిస్తున్న కొండా విశ్వేశ్వరరెడ్డి కుటుంబం

శ్రీవారికి అష్టలక్ష్మి చంద్రవంక కంఠి

విరాళంగా అందజేసిన ఎంపీ కొండా కుటుంబం

తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం రూ.60 లక్షల విలువైన 535 గ్రాముల బంగారు అష్టలక్ష్మి చంద్రవంక కంఠి విరాళంగా అందింది. తెలంగాణ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు కొండా రామచంద్రా రెడ్డి, డాక్టర్ మీరా రెడ్డి, గౌతమి రెడ్డితో కలిసి రంగనాయక మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దీనిని అందజేశారు.

బ్రహ్మాండ నాయకుడికి బ్రహ్మోత్సవం



శ్రీవారి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన విష్వక్సేనుడు

వేడుకలకు వైభవంగా అంకురార్పణ

- నేడు ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

తిరుమల/తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు టీటీడీ శ్రీకారం చుట్టింది. ఈ వేడుకల్లో తొలి ఘట్టమైన అంకురార్పణ మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. బుధవారం ధ్వజారోహణతో పూర్తిస్థాయిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అంకురార్పణలో భాగంగా స్వామివారి సర్వసేనాధిపతి విష్వక్సేనుడు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

బుధవారం సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాల వాహన సేవలు ఆరంభం అవుతాయి. ఆలయంలోని ధ్వజస్తంభానికి గరుడ ధ్వజపటాన్ని అధిష్ఠింపజేసి నలుదిక్కుల నుంచి సకల దేవతలను ఆహ్వానిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుచ్చిలో ఉత్సవర్లతో పాటు అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగించి ఆలయానికి వేంచేపు చేస్తారు. సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 9 గంటలకు పెద్దశేష వాహనంతో మొదలై అక్టోబరు 2న రాత్రి అశ్వ వాహనం వరకు మాడవీధుల్లో వాహనసేవలు కనులపండువగా జరుగనున్నాయి.

నేడు తిరుమలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా..

ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ బుధవారం తొలిసారి అధికారిక హోదాలో తిరుమలకు రానున్నారు. ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన 8.30 గంటలకు తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం మరోసారి స్వామిని దర్శించుకుని, కొండపై పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక, సీఎం చంద్రబాబు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి బుధవారం సాయంత్రం 5.35 గంటలకు తిరుపతి చేరుకుంటారు. రోడ్డు మార్గాన రాత్రి 8గంటలకు శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి మంత్రి లోకేశ్ హెలికాప్టర్‌లో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు తిరుపతి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని, రాత్రికి శ్రీవారిని దర్శించుకుంటారు.

అలనాటి వైభవం...



తిరుమల వేంకటేశ్వరుడికి నిత్య కల్యాణం... పచ్చ తోరణం! బ్రహ్మోత్సవాలంటే మరింత వైభవం, వైభోగం! కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను దశాబ్దాలుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మాది దేవతలు పాల్గొనే ఈ వేడుకకు భక్తులకూ ఆహ్వానం పలకడం ఆనవాయితీగా వస్తోంది. ఇది... 1957నాటి బ్రహ్మోత్సవ పత్రిక! ఇందులో అతి ముఖ్యమైన గరుడ సేవ, రథోత్సవ తేదీలను... భక్తులకు కల్పించిన సదుపాయాలను హిందీ, తమిళ, కన్నడ, తెలుగు భాషల్లో వివరించారు. ఆసక్తికరమైన ఈ పత్రిక చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో తిరుగుతోంది.

చంద్రబాబు రికార్డు : తిరుమల శ్రీవారికి అత్యధికసార్లు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎంగా చంద్రబాబు టీటీడీలో రికార్డుకెక్కారు. 1995 నుంచి 2024 బ్రహ్మోత్సవాల వరకూ మొత్తం 13 సార్లు ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం మరోసారి సీఎం పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. దీంతో 14సార్లు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎంగా చరిత్ర సృష్టించనున్నారు.



బ్రహ్మచారిణిగా భ్రమరాంబిక

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం భ్రమరాంబికా అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మయూర వాహనంపై మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి క్షేత్రవీధుల్లో విహరించారు. అశేష భక్తజనం నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్–సౌదీ కొత్త దోస్తీ

పాకిస్థాన్ మీదకు భారత్ యుద్ధానికి వస్తే, పాకిస్థాన్ పక్షాన సౌదీ అరేబియా కూడా ఇకమీదట పోరాడుతుంది కనుక, గతంలో మాదిరిగా కాక, రాబోయే రోజుల్లో భారత్ జాగ్రత్తగా మెలగాల్సిందేనని పాక్ రక్షణమంత్రి వ్యాఖ్యల పరమార్థం. ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదన్న నియమం ఏమీ లేదని కూడా ఆయన గుర్తుచేశారు. సౌదీ దగ్గర అణ్వాయుధాలున్నాయో లేదో అనవసరం కానీ, పాకిస్థాన్ వద్ద కచ్చితంగా ఉన్నాయి కనుక, సౌదీ మీదకు ఇరాన్, ఇజ్రాయెల్ సహా ఎవరు దాడికి దిగినా అణ్వస్త్రాలను ఎదుర్కోవాల్సిందేనని అర్థం. ఎందుకూ కొరగాని ఈ తరహా ఒప్పందాలు చాలా దేశాల మధ్య జరుగుతూంటాయి కనుక భారత్ దీనిని ఏ మాత్రం ఖాతరుచేయనక్కరలేదని రక్షణరంగ నిపుణుల అభిప్రాయం. ఈ ఒప్పందం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాదు, కాబోదని కూడా పాకిస్థాన్ హెచ్చరిస్తున్నందున మరిన్ని దేశాలు వచ్చిచేరి ఇస్లామిక్ నాటో ఆవిర్భవించవచ్చునని కొందరు అతిగా లెక్కలేస్తున్నారు కూడా.

పహల్గాం ఉగ్రదాడికి భారత్ దీటుగా సమాధానం ఇవ్వడంతో పాకిస్థాన్‌లో వొణుకుపుట్టి ఈ ఒప్పందం చేసుకుందని నరేంద్రమోదీ అభిమానులు అంటున్నారు. ఆ ఘర్షణలో చైనా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పాకిస్థాన్‌కు సర్వసహాయాలూ అందించిన తరువాత, అమెరికా కూడా పాకిస్థాన్ వైపే ఉంటున్న ఈ కాలంలో సౌదీ సాయం దానికి ఎందుకు అన్న ప్రశ్న ఉండనే ఉంది. ఏతావాతా, పాక్ ఆర్మీతో మరో దఫా మనం తలపడాల్సివస్తే సౌదీని కూడా లెక్కబెట్టుకొని మరీ రంగంలోకి దిగాలన్నమాట. ఒకరిని కొడితే మరొకరిని కొట్టినట్టేనని ఈ రక్షణ ఒప్పందం అంటోంది మరి. ఈ మిత్రదేశాల మధ్య ఇప్పటివరకూ అనధికారికంగా అమలులో ఉన్న అవగాహన ఈ ఒప్పందంతో అధికారికమైంది. రెండు దేశాల మధ్య ఉన్న సైనికబంధానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1960లలో మక్కామదీనాను కాపలాకాయడం నుంచి సౌదీ రాజకుటుంబానికి రక్షణ కల్పించడం వరకూ పాక్ సైనికబలగాలు ప్రశస్తమైన పాత్ర పోషించాయి. అలాగే, సౌదీ సొమ్ము పాకిస్థాన్‌లోకి నిరవధికంగా ప్రవహించి అది తన అణ్వస్త్రకార్యక్రమాన్ని సజావుగా సాగించడానికి కూడా ఉపకరించిందంటారు.

ట్రంప్ దయవల్ల పాకిస్థాన్‌తో ఇప్పుడు చాలా దేశాలు స్నేహాన్ని పెంచుకుంటున్న తరుణంలో, సౌదీతో ఈ అధికారిక ఒప్పందం దానికి రక్షణకంటే, పశ్చిమాసియా భౌగోళిక రాజకీయ వేదికమీద మరింత విలువ, గౌరవం పెంచుతుందని విశ్లేషకుల అభిప్రాయం. ఒక ప్రాంతీయశక్తిగా కాక, అరబ్ ప్రపంచానికి గుండెకాయవంటి ఒక దేశానికి రక్షణకల్పిస్తున్న దేశంగా పాక్ అవతరించినట్టయిందని అంటున్నారు. ముస్లిం ప్రపంచాన్ని కాపాడుతున్నది తామేనని పాక్ ప్రజలకు ఆత్మసంతృప్తి కలిగించడంతోపాటు, ప్రస్తుత పాలకుల పట్ల వారిలో ఉన్న చులకన భావాన్ని తగ్గించేందుకు కూడా ఈ ఒప్పందం ఉపకరించవచ్చు.

అమెరికాను, మరీ ముఖ్యంగా ట్రంప్ ఏలుబడిలో అది ఉన్నంతకాలం, దానిని తన రక్షణకవచంగా నమ్ముకొని కూచుంటే మునిగిపోతామన్న భయం సౌదీకి కలగడంలో ఆశ్చర్యమేమీలేదు. ట్రంప్ అండతో ఇజ్రాయెల్ సరిహద్దులు దాటుతోంది, శ్రుతిమించిపోతోంది. ఖతార్‌లోకి కూడా చొరబడి దెబ్బతీసేంత దుస్సాహసానికి కూడా తెగబడింది. పైగా, ట్రంప్ దానిని తేలికగా తీసిపారేయడం గల్ఫ్ దేశాలకు భద్రత భయం కలిగించింది. ఈ పరిస్థితుల్లో ఒక అణ్వస్త్రదేశంతో అధికారిక రక్షణ ఒప్పందం సౌదీకి భరోసానివ్వడంతోపాటు, శత్రువులను హద్దుల్లో ఉంచడానికి ఉపకరిస్తుంది. నిజంగానే సౌదీకి విపత్తు ఏర్పడితే, పాకిస్థాన్ తన భద్రతను కూడా పణంగా పెట్టి సౌదీ పక్షాన కదనరంగంలోకి దూకుతుందా, అణ్వాయుధాలు వాడుతుందా అన్న ప్రశ్నలకు నిర్దిష్టమైన సమాధానాలు ఉండవు. కానీ, ఒకరికోసం ఒకరు నిలబడి, ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని ఈ ఒప్పందం చెబుతోంది కనుక, సౌదీ శత్రుదేశాలతో, మరీ ముఖ్యంగా ఇరాన్‌తో, ఇంకా అవసరమైతే ఇజ్రాయెల్‌తోనూ అది ఘర్షణకు దిగవలసి ఉంటుంది. ఖతార్ మీద ఇటీవలి ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో, సౌదీ ఈ ఒప్పందం ద్వారా అరబ్ దేశాలకు కొత్తదారి చూపించింది. ఇక, భారతదేశంతో పాకిస్థాన్ ఏ స్థాయిలో ఘర్షణపడినా, భారీ ఆర్థిక సాయంతో ఆదుకోవడం, దౌత్యపరంగా భారత్ మీద ఒత్తిడిపెంచడం వినా ప్రత్యక్షంగా పాకిస్థాన్ పక్షాన, భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధరంగంలోకి సౌదీ దిగే అవకాశాలు లేవు. కనుకనే, సౌదీతో తనకున్న దశాబ్దాల మైత్రి గురించి ఓ నాలుగు మంచిమాటలు వల్లించడం వినా ఈ ఒప్పందం గురించి భారత్ లోతుగా వ్యాఖ్యానించలేదు, ఆందోళన పడుతున్నట్టు కనబడలేదు.

మతం ఉచ్చులోకి జారుతున్న ఆదివాసీలు!

'ఆదివాసులు హిందువులే' అనే కంటే, వారు హిందూ మతాన్ని 'అనుసరించే వాళ్ళు' మాత్రమే అంటే బాగుంటుంది. 'ఆంధ్రజ్యోతి'లో 24 జూలై 2025న 'ఆదివాసుల మతం ఏమిటి?' అని ప్రొ. భంగ్యా భూక్య, 12 ఆగస్టు 2025న 'ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే' అని కాయం నవేంద్ర రాసిన వ్యాసాలు చదివాక ఈ విశ్లేషణ చేయాలనిపించింది.

హిందూ ఆచారాలు, అనేక దేవుళ్ళ పుట్టుక చరిత్ర వెనుక ఆదివాసీల చారిత్రక నేపథ్యం దాగున్నదని మరచిపోతున్నారు మేధావులు. పురాణేతిహాసాల్లో, వేదాలలో భక్త కన్నప్ప, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, శబరి, పోకల దమ్మక్క, హిడింబి, తాటకి, శూర్పణక, హోలిక, రావణుడు, నరకుడు, కుపార్ లింగో... వీరు గిరిజన ఆదివాసీలే కదా. ఆదివాసుల సంస్కృతీ సంప్రదాయ ఆచారాలే క్రమంగా హిందూ మతాచారాలుగా మారాయి. కాబట్టి ఈ మూలవాసులది పురాతన 'ఆదివాసీ మతం' అనటం సమంజసం.

ఆదివాసులు ఆదిమ కాలం నుంచి స్వీయ ఆచార సంస్కృతులు కలిగిన వారు. వారికి తెలిసిందల్లా నమ్మకంతో ముడిపడిన భక్తి మాత్రమే. ఆధ్యాత్మిక చింతనలు, పునర్జన్మలు, ముక్తి మార్గాలు వారికి తెలియవు. వారి ఇలవేల్పులైన నాగోబా, జంగుబాయి, పెర్స పేన్, మేడారం సమ్మక్క–సారక్క, గుంజేడు ముసలమ్మ, కొమ్మలమ్మ, సడలమ్మ, గట్టమ్మ, దూలరాజు, మారయ్య వంటి దైవాలను గౌరవించుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. వారికి వ్రతాలు, నోములు, పూజలు, మంత్రాలు, హోమాలు తదితరాలతో సంబంధం లేదు. వారి పూర్వాచారాలే వారసత్వంగా అమలవుతున్నవి. అనారోగ్యం పాలైతే తెలిసిన మూలికా వైద్యం చేసుకుంటారు. మనోధైర్యం కోసం వారాంతపు దేవర్ల దగ్గరకు వెళ్లి పూనకం దేవర్లు చెప్పే ధైర్యపు మాటలు వింటారు. పంటలు బాగా పండాలని దేవర్లకు మొక్కుకుంటారు. కృతజ్ఞతతో వారికి ధాన్యం, ఇప్పసారా, మాంసాహారం వంటి వాటిని ప్రసాదంగా సమర్పించుకుంటారు. ఒక రకంగా గిరిజనుల భక్తి భావనలో కేవలం నమ్మకం, కృతజ్ఞతలు తప్ప ప్రతిఫలాపేక్ష ఏ మాత్రం ఉండదు. ఇది ఒకనాటి గిరిజనుల భక్తి భావనల తీరు.



ఆధునిక కాలంలో ఆదివాసుల భక్తి విధానాలలోనూ కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయుడు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. గిరిజనేతరులతో కలిసి భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. కానీ తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని ఇప్పటికైనా గ్రహించాలి.

నేటి ఆధునిక కాలంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ఆదివాసుల భక్తి విధానాలలోనూ కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయుడు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. మాల ధారణలు, దీక్షలు మొదలుపెట్టారు. గిరిజనేతరులతో కూడా కలిసి విడివిడిగా భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే, ఇటీవల గిరిజన గ్రామాల్లో విరివిగా గణేష్ మండపాలు వెలిశాయి. గ్రామస్తులంతా చందాలు వేసుకుని పూర్తి ఆధునిక పద్ధతుల్లో గణేష్ పూజలు నిర్వహిస్తున్నారు. అయితే, నిమజ్జనం, శోభాయాత్రల్లో మాత్రం తమదైన డోలు వాయిద్యం, గిరిజన నృత్యాలతో సాంప్రదాయంగా ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో సంక్రాంతి నాడు శ్రీరామ భజన చేస్తూ గిరిజన గ్రామాల్లో పల్లకీ సేవలు నిర్వహిస్తున్నారు. సమీప ప్రాంతాల్లో జరిగే శివరాత్రి నాటి శివకళ్యాణం, శ్రీరామ నవమి నాటి సీతారామ కళ్యాణం, నృసింహ జయంతికి నరసింహ కళ్యాణం జరుపుకుంటున్నారు. భద్రాచలంలోని రామాలయంలో శబరి స్మృతి యాత్ర వంటి వివిధ తీర్థాలకు గిరిజనులు అధిక సంఖ్యలో వెళుతున్నారు. ఈ మధ్యన భగవద్గీత త్రైత కమిటీ ద్వారా కృష్ణుని పల్లకి సేవ, జయంతి పూజలు చేశారు. వీటి వెనుక మనువాదం మిళితం అయి ఉన్నదని ఆదివాసులు గమనించడం లేదు. కానీ తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని ఇప్పటికైనా గ్రహించాలి.

మరోవైపు గిరిజనుల్లో కొందరు అనారోగ్యాల నుంచి స్వస్థత పొందే క్రమంలో చర్చిలకు వెళుతున్నారు. పాస్టర్ల ఆర్థిక పురోభివృద్ధి ప్రత్యక్షంగా చూసిన కొంత మంది గిరిజన యువకులు పాస్టర్లుగా కూడా మారుతున్నారు. దీనితో ప్రతి గిరిజన గ్రామంలో చర్చిలు వెలుస్తున్నాయి. మరోపక్క తమ జాతి పండుగలకు దూరమవుతున్నారు. వారిదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన కొత్తల పండుగ, విత్తనాల పండుగ, వివిధ తెగల, గోత్రాలకు నిర్దేశించిన ఇలవేల్పు పండుగలను మర్చిపోతున్నారు. గ్రామ పండుగలైన ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తదితర పండుగలకు, జాతర్లకు కూడా దూరమవుతున్నారు.

ఇలాంటి సంక్షోభ సమయంలో అక్షరాస్యులు, ఉద్యోగులైన గిరిజన యువత ఏర్పాటు చేసుకున్న తుడుందెబ్బ, సంక్షేమ పరిషత్, ఆదివాసీ సేన తదితర గిరిజన సంఘాలు ఆధునిక భక్తిభావాలపట్ల వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. తమదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన దేవర్లను, ఇలవేల్పులను, ఆదివాసీ వీరులను మాత్రమే పూజించుకునే ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చైతన్యం దిశగా గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలి. నేటి గిరిజన యువతలోని అక్షరాస్యత కేవలం ఉద్యోగాల కోసం, ఆర్థిక వృద్ధి కోసం మాత్రమే కాదు. తమదైన సంస్కృతులను, సాంప్రదాయాలను, తమ అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలి.

▪ **గుమ్మడి లక్ష్మీనారాయణ**
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపకులు

జీఎస్టీ తగ్గింపు తెచ్చే లబ్ధి ఎంత?



▪ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజల చేతుల్లో దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టినట్లే. ఇక దేశంలో వినియోగదారుల కొనుగోళ్లు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి..' అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత వారం మీడియాకు వెల్లడించారు. 'ఈ నవరాత్రి నుంచి దేశంలో నూతన ఆర్థిక అధ్యాయం ప్రారంభమవుతోంది. ఇప్పటికే జీఎస్టీ తగ్గింపునకు, మీకు కల్పించిన ఆదాయపన్ను రాయితీలను కలిపితే 2.5 లక్షల కోట్లు మీరు ఆదా చేసినట్లే. ఇక ఆదా ఉత్సవాలు జరుపుకోండి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ వర్తకులు, కొనుగోలుదారులతో భేటీ అవుతున్నారు. 'జీఎస్టీ తగ్గింపు ఒక వరం' అంటూ బీజేపీ నేతలంతా వాట్సాప్ స్టేటస్‌లో మోదీ ఫొటో పెట్టుకుని ప్రచారం చేస్తున్నారు.

నిజానికి జీఎస్టీ తగ్గించడం అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఉమ్మడి నిర్ణయం. ఈ విషయాన్ని బీజేపీ అగ్రనేతలు మాత్రమే ప్రచారం చేసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమే. అయితే దేశంలోనూ విదేశాల్లోనూ అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న దృష్ట్యా బిహార్ ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ ఈ ప్రచారాన్ని చేసుకోవడాన్ని తప్పు పట్టలేము. బీజేపీ మాత్రమే కాదు, కాంగ్రెస్ కూడా జీఎస్టీ తగ్గింపును తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది తామెప్పటి నుంచో జీఎస్టీని గబ్బర్ సింగ్ టాక్స్‌గా అభివర్ణిస్తున్నామని, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామని, జీఎస్టీ తగ్గించడం తమ వల్లేనని ఆ పార్టీ చెప్పుకుంటోంది. చిదంబరం వంటి కాంగ్రెస్ ఆర్థికవేత్తలు మాత్రమే కాదు, జీఎస్టీ మండలి సమావేశంలో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. అంటే ప్రస్తుత తగ్గింపు అభిలషణీయమేనని ఒప్పుకోవాలి. ఎవరు తీసుకున్నా, ఎందుకు తీసుకున్నా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు పెరగడం అనేది మంచిదే కదా!

నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి తాము ఆదా చేసిన 2.5 లక్షల కోట్లను ఖర్చు పెట్టి వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తారని ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి ఆశిస్తున్నారు. ఈ మొత్తం ముందు జీఎస్టీ తగ్గింపువల్ల ప్రభుత్వానికి జరిగే రూ. 48వేల కోట్ల నష్టమెంత? అని నిర్మలా సీతారామన్ అంటున్నారు.

భారతదేశంలో ఆర్థికాభివృద్ధి గత పదేళ్ల నుంచి ప్రధానంగా స్వదేశీ వినియోగం ద్వారానే లభించిందని, జీడీపీలో 60 శాతం పైగా వినియోగం వల్లే వచ్చిందని మన ప్రభుత్వం చెప్పుకుంటోంది. 2027 నాటికి మూడవ అతి పెద్ద వినియోగ మార్కెట్ భారత్‌లో ఏర్పడుతుందని ప్రైస్ వాటర్ కూపర్స్ నివేదిక పేర్కొంది. అయితే కోవిడ్ తర్వాత భారతదేశంలో వినియోగం మళ్లీ ఊపందుకున్నప్పటికీ గత రెండుమూడేళ్లుగా పరిస్థితులు మారడం ప్రారంభమైన విషయాన్ని ఆర్థికవేత్తలు గమనించారు. అంతిమ ప్రైవేట్ వినియోగ వ్యయం బాగా తగ్గిపోతోందని, ఆహారం, దుస్తులు, చెప్పులు, రవాణా, ఇళ్ల వంటి వాటి విషయంలో ఖర్చు తగ్గిందని వారు గ్రహించారు. ముఖ్యంగా వినియోగ వస్తువులపై ఖర్చు తగ్గిపోవడం, అత్యవసరం కాని కొనుగోళ్లపై జనం దృష్టి మళ్లించడం, రుతుపవన పరిస్థితుల వల్ల గ్రామీణ డిమాండ్ దెబ్బతినడం, పంట ఉత్పత్తులు పడిపోవడం జరిగింది. అంతేగాక ఉపాధి కల్పన లేకపోవడం వల్ల పట్టణ డిమాండ్ కూడా బలహీనపడడం వల్ల జీడీపీ అభివృద్ధితో నిమిత్తం లేకుండా ఆర్థిక వ్యవస్థ మందకొడిగా మారడం ఆర్థికవేత్తల దృష్టి దాటిపోలేదు. తక్కువ ఆదాయ వర్గాల కొనుగోలు శక్తి తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం మూలంగా ఖర్చు ప్రాధాన్యతలు మారిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రైవేట్ ఖర్చు తగ్గిపోవడం అనేది పన్ను వసూళ్లపై కూడా ప్రభావం చూపుతుంది. డిమాండ్ తగ్గిపోవడం వల్ల ప్రైవేట్ పెట్టుబడులు కూడా తగ్గిపోతాయి. దాని వల్ల ప్రభుత్వంపై భారం పెరుగుతుంది.

దేశంలో ఎగుమతుల కన్నా దిగుమతులు పెరగడం వల్ల వర్తక లోటు కూడా పెరుగుతోంది. 2024 సంవత్సరపు అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం దేశంలో బలహీనమైన ఉపాధి కల్పనా వాతావరణం ఉన్నది. ధరల పెరుగుదలతో పోలిస్తే ఆదాయాల పెరుగుదల చాలా నిదానంగా ఉంది. అభివృద్ధిని వేగవంతం చేసే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోతున్నాయి. వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల వ్యాపారం (ఎఫ్‌ఎంసీజీ) అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నది. ప్రధానంగా గత మూడేళ్లలో వాటి ధరలు 30 శాతం మేరకు పెరగడంతో వినియోగదారులు జాగ్రత్తపడాల్సి వచ్చింది. ఇవి మాత్రమే కాదు కార్ల కొనుగోళ్లు కూడా గత జూన్ వరకు బాగా పడిపోయినట్లు నివేదికలు వచ్చాయి. ఐటీ కంపెనీలు అతి పెద్ద ప్రైవేట్ రంగ సంస్థలైనప్పటికీ అవి కల్పించే ఉపాధి శాతం తక్కువ, ఇచ్చే జీతాలు కూడా తక్కువే. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను అవి పూరించడం లేదు. ఏఐ వల్ల మున్ముందు అవి తగ్గే అవకాశాలే కాని పెరిగే అవకాశాలు లేవు. నైపుణ్యం ఉన్న యువత దేశంలోనే ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఏ చిన్న దేశం వెళ్లినా అక్కడ భారతీయులే కనపడుతున్నారు. ప్రైవేట్ పెట్టుబడులే కాదు, ప్రభుత్వ ఉత్పాదక వ్యయం కూడా పెద్దగా పెరగడం లేదు. రూ. 150 కోట్లకు మించి పెట్టుబడులతో ఏర్పరచే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సరైన సమయంలో అమలు కాకుండా ఖర్చులు పెరిగిపోయి అనుకున్నదానికంటే అదనంగా కొన్ని లక్షల కోట్ల మేరకు చేరుకున్నాయి.

> **జీఎస్టీని రెండు ప్రధాన రేట్లకు తగ్గించడం అనేది చెప్పుకోదగిన నిర్ణయమే. అయితే ఇది చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదని విమర్శలు వస్తున్నాయి. నిజానికి చాలా వస్తువుల ధరలు గత మూడేళ్లుగా ఎంతో పెరిగిపోయాయి. అందువల్ల ఇప్పుడు ఆ పెరిగిన రేట్లు తగ్గించడం ప్రాయశ్చిత్తం చేసుకోవడమే కాని వరాలు ప్రకటించడం కాదని ఆక్షేపిస్తున్నవారూ లేకపోలేదు.**



దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక దుష్పరిణామాలు ఉన్నాయి. సంపద, పరిశ్రమలు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, ఒకే రాష్ట్రానికి తరలివెళ్లేలా చేయడం వంటివి ఇందులో ఒకటి. అదే విధంగా కేంద్రంతో సహా వివిధ రాష్ట్రాల అప్పులు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. జీడీపీతో పోలిస్తే అప్పుల శాతం 30 నుంచి 50 శాతం ఉన్న రాష్ట్రాలు ఉన్నాయి. ప్రభుత్వాల నిరుత్పాదక వ్యయం కూడా తీవ్రంగా పెరిగిపోతోంది.

గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ 'ఉద్యమ్' పోర్టల్‌లో నమోదు చేసుకున్న 75 వేలకు పైగా ఎంఎస్‌ఎంఈ సంస్థలు మూతపడ్డాయి. ఎంతమంది ఉద్యోగం కోల్పోయారో చెప్పలేం. కానీ 2024 జులైలో ఎంఎస్‌ఎంఈ మంత్రి జితన్ రాం మాఝీ లోక్‌సభలో చెప్పిన జవాబు ప్రకారం 2020 జూలై నుంచి 2024 జూలై వరకు 49,342 సంస్థలు మూతపడి 3.18 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. ప్రతి ఏడాదీ 70 నుంచి 80 లక్షల మంది లేబర్ మార్కెట్‌కు చేరుకుంటున్నారు. జనాభా పెరగడం మనకు వరం అనేవారు ఉన్నారు. కానీ వారికి ఉపాధి కల్పించేందుకు పెరుగుతున్నంత వేగంగా తీసుకుంటున్న చర్యలేవీ? ఉత్పాదక రంగంలో వారికి కేవలం 1.7 శాతం మేరకు ఉపాధి లభిస్తోంది.

ఈ నేపథ్యంలో జీఎస్టీని రెండు ప్రధాన రేట్లకు తగ్గించడం అనేది చెప్పుకోదగిన నిర్ణయమైనప్పటికీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదని విమర్శలు వస్తున్నాయి. నిజానికి చాలా వస్తువుల ధరలు గత మూడేళ్లుగా ఎంతో పెరిగిపోవడం వల్ల ఇప్పుడు వాటిని తగ్గించడం ప్రాయశ్చిత్తం చేసుకోవడమే కానీ వరాలు ప్రకటించడం కాదని విమర్శించేవారు లేకపోలేదు. ఇన్నాళ్లూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా ప్రభుత్వం మౌనంగా ఉండి మాటిమాటికీ జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తూ, ఆరు రేట్లను అమలు చేస్తూనే ఎందుకు ఉండిపోయిందనేదే తెలియడం లేదు. జీడీపీ పెరుగుదలపై ట్రంప్ విధించిన టారిఫ్‌ల వ్యతిరేక ప్రభావాన్ని తట్టుకునేందుకు కూడా ఈ రేట్ల తగ్గింపు దోహదం చేస్తుందని ప్రభుత్వం ఆశిస్తున్నట్లు కనపడుతోంది.

ఐతే ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా పుంజుకునేందుకు సంస్కరణలు చేపట్టడం, ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించడం కూడా అవసరం. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గనంతకాలం సరుకుల, ప్రయాణికుల రవాణా వ్యయం తగ్గే అవకాశాలు లేవు. సెస్‌ల ద్వారా, అదనపు ఎక్సైజ్ సుంకాల ద్వారా సేకరించే 85 శాతాన్ని కేంద్రం పంచుకునేందుకు ఇష్టపడదు. ప్రైవేట్ పెట్టుబడులు పెరిగినప్పటికీ 6.5 శాతం అభివృద్ధి రేటు నుంచి 8 శాతం పెరిగేందుకు అవి ఇప్పట్లో దోహదం చేసే అవకాశాలు లేవు. అందువల్ల డిమాండ్ పెంచడం తప్ప ప్రభుత్వానికి మరో గత్యంతరం లేదు.

కాగా జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావం ఆ రేట్ల తగ్గింపు వినియోగదారుల వరకు చేరడాన్ని బట్టి ఉంటుందని క్రిసిల్ ఒక నివేదికలో పేర్కొంది. పెద్ద కంపెనీలే ఈ లాభాల్ని హస్తగతం చేసుకుంటాయా, లేక వినియోగదారుడితో పంచుకుంటాయా అన్నది వేచి చూడాల్సి ఉన్నది. జీఎస్టీ రేట్ల తగ్గింపును పర్యవేక్షించే నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీకి పెద్ద అధికారాలు లేవని విమర్శలు ఉన్నాయి. ఇక రేట్ల తగ్గింపు మూలంగా జీఎస్టీ ఆదాయంలో 15 నుంచి 20 శాతం తగ్గిపోతుందని, దాదాపు రూ. 2లక్షల కోట్ల మేరకు రెవెన్యూ నష్టం వస్తుందని రాష్ట్రాలు అంటున్నాయి. ఈ మొత్తాన్ని కేంద్రం ఎలా పూరిస్తుందో అగమ్యగోచరంగా ఉన్నది. ఏమైనా అనేక ఆర్థిక ఒత్తిళ్ల, అంతర్జాతీయ పరిణామాల వల్ల ఏర్పడిన ఆర్థిక అస్థిరత వల్ల ప్రధానమంత్రికి మళ్లీ ఆత్మనిర్భర్ భారత్ గుర్తుకు వచ్చింది. 2014లో అట్టహాసంగా ఆయన మేక్ ఇన్ ఇండియా గురించి ప్రకటించినప్పటికీ ఉత్పాదక రంగం వాటా జీడీపీలో 16.7 శాతం నుంచి 13 శాతానికి తగ్గిపోయిందన్న విషయం ఆయనకు తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజల కంటే ప్రతిపక్ష హోదా ముఖ్యమా?

పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత దేవుని పేరు మీద ప్రమాణం చేశారు. శాసనం ద్వారా స్థాపించబడిన భారత రాజ్యాంగంపై నిజమైన విశ్వాసం చూపుతాననీ, భారత సార్వభౌమత్వాన్నీ సమగ్రతనూ కాపాడతాననీ, తాను చేపట్టబోయే విధిని నమ్మకంగా నిర్వర్తిస్తాననీ గంభీరంగా ప్రమాణం చేశారు. ఆ పిమ్మట అసెంబ్లీకి హాజరు కాకుండా ఆ ప్రమాణాన్ని ఉల్లంఘించారు. కాబట్టి ఆయన శాసనసభ్యులుగా కొనసాగడానికి అర్హులు కాదు. వారిపై అనర్హత వేటు వెయ్యవచ్చు. అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి తాను గవర్నర్ ప్రసంగానికి హాజరు అయ్యానంటారు జగన్. కానీ గవర్నర్ ప్రసంగం సెషన్ కాదు. గవర్నర్ ప్రసంగానికి హాజరైనంత మాత్రాన ఆ నాయకుడిని సభకు హాజరైనట్టుగా లెక్కించలేం. అసెంబ్లీ నిబంధనల ప్రకారం రాజ్యాంగంలోని 101క్లాజ్ 4 ప్రకారం వరుసగా 60 రోజులు ఏ కారణం లేకుండా సభకు రాకపోతే సభ్యుల సభ్యత్వం రద్దు అవుతుంది.

అట్లాగే, పిల్లలు 'బిస్కెట్ ఇస్తేనే స్కూలుకి వెళ్తాను' అన్నట్టు, జగన్ తాను మాట్లాడినంతసేపు మైక్ ఇస్తే అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఆ అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉన్నది. ప్రజలకు నవ్వు తెప్పించే ఇలాంటి ప్రకటనలు జగన్ మానుకోవాలి. గత ఐదేళ్ల గట్టిగా మైక్ అడిగినందుకు తెలుగుదేశం ఎమ్మెల్యేలను ఎన్నిసార్లు అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారో ఒకసారి ఆయన గుర్తు తెచ్చుకోవాలి. ఐదేళ్ల పాటు సభను ఎంత అప్రజాస్వామికంగా నిర్వహించారో దేశమంతా చూసింది. ప్రజాస్వామ్యంలో చట్టసభలు ప్రజావాణిని వినిపించాలని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ హితవచనం. చట్టసభల సభ్యులు శాసన నిర్మాతలు. జనజీవితాలను ప్రభావితం చేసే చట్టాలను రూపొందిస్తారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు కలిసికట్టుగా ప్రజా ప్రయోజనాలను నెరవేర్చాల్సింది పోయి, తాము అసలు అసెంబ్లీకి వెళ్లేది లేదని పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి తెగేసి చెప్పి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు.

చట్టసభ మొత్తం సభ్యుల సంఖ్యలో పది శాతం సీట్లు కలిగిన విపక్ష పార్టీకే ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వాలన్న నిబంధన ఉన్నది. లోక్‌సభ తొలి స్పీకర్ జి.వి. మవులాంకర్ విధించిన ఆ నిబంధన ఏడున్నర దశాబ్దాలుగా యావద్దేశమూ అమలు చేస్తున్నది. అందుకే 1969 వరకు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటూ ఎవరూ లేరు. తర్వాత కూడా 5వ, 7వ, 8వ లోక్‌సభలలోనూ ప్రతిపక్ష హోదా దక్కలేదు. ఆ తర్వాత 2014–2024 మధ్యలోనూ అదే పరిస్థితి. లోక్‌సభలో పదిశాతం సీట్లు లేకపోయినా తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న కాంగ్రెస్ పార్టీ వినతిని 2014లో నాటి స్పీకర్ తిరస్కరించారు. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌కు గుర్తింపు ఎందుకు ఇవ్వకూడదో చెబుతూ అప్పటి అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా ముకుల్ రోహత్గీ లోక్‌సభకు తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ప్రతిపక్షహోదా ఇవ్వాల్సింది ప్రజలు. వాళ్లు ఇవ్వని దాని కోసం జగన్ మూర్ఖంగా మంకుపట్టుపట్టడం అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనం.

'ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న 23 మంది సభ్యుల్లో "అయిదుగురిని లాగేస్తే 18 మంది అవుతారు, అప్పుడు ప్రతిపక్ష హోదా కూడా ఊడుతుంది," అంటూ 2019 జూన్ 13న ముఖ్యమంత్రిగా మీరు మూర్తీభవించిన అహంకారంతో నిండు శాసనసభలో వీరంగం వేసింది గుర్తు లేదా జగన్‌రెడ్డీ? ప్రజలు మీపై తిరగబడి, సంఖ్యాబలం అంతా ఊడ్చి పారేసి, 11 నెంబరు మిగిల్చాక, ఇప్పుడు ప్రతిపక్ష హోదా కావాలంటూ స్పీకర్‌కు లేఖ రాయడానికీ, దాని కోసమే హైకోర్టు దాకా వెళ్లడానికీ సిగ్గుగా అనిపించలేదా? పోనీ కనీసం ఆ కేసు పరిష్కారమయ్యే దాకా అయినా అసెంబ్లీకి వచ్చే ఓపిక లేదా? చివరికి తా చెడ్డ కోతి వనమెల్లా చెరచిందన్నట్టు మీ ఎమ్మెల్యేలను కూడా సభకు రాకుండా అడ్డుపడుతున్నారే! ఇది అప్రజాస్వామిక, నిరంకుశ పెత్తందారీ పోకడలకు పరాకాష్ఠ కాదా?'

2019 ఎన్నికల్లో ప్రజలు తనకు 23 సీట్లు మాత్రమే ఇచ్చినా చంద్రబాబు కుంగిపోకుండా, చిన్నతనంగా భావించకుండా బాధ్యతగా శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అడుగడుగునా అవమానించినా భరించారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అయివుండి కూడా ప్రతిపక్ష స్థానంలో కూర్చోవడానికి నామోషీ పడలేదు. అది ప్రజలు తన మీద ఉంచిన బాధ్యతగా గుర్తించి వ్యవహరించారు. ఐదేళ్లపాటు నిరంకుశ చక్రవర్తిలా వ్యవహరించిన జగన్‌రెడ్డికి ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవడం నామోషీగా ఉన్నట్టుంది. ఇలాంటి వ్యక్తులకు ప్రజాస్వామ్య రాజకీయాల్లో పాల్గొనే అర్హత ఉన్నదా?

> **ప్రతిపక్షహోదా ఇవ్వాల్సింది ప్రజలు. వాళ్లు ఇవ్వని దాని కోసం జగన్ మూర్ఖంగా మంకుపట్టుపట్టడం అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనం. నిజంగా ప్రజా సమస్యల పట్ల బాధ్యత ఉంటే ప్రతిపక్ష హోదాతో సంబంధం లేకుండానే సమావేశాలకు హాజరై ప్రజల పక్షాన నిలబడి పోరాడేవారు. నలభై శాతం ఓట్లు తమకు వచ్చాయని చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ ఓట్లు వేసిన తమ తరఫున ఎందుకు మాట్లాడరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**



నిజంగా ప్రజా సమస్యల పట్ల బాధ్యత ఉంటే ప్రతిపక్ష హోదాతో సంబంధం లేకుండానే సమావేశాలకు హాజరై ప్రజల పక్షాన నిలబడి పోరాడేవారు. శాసనసభ్యుడిగా తమ బాధ్యతలు నిర్వర్తించకుండా 'అసలైన జనోద్ధారకుడిని నేనే' అంటే నమ్మడానికి ప్రజలు ఇప్పుడు సిద్ధంగా లేరు. నలభై శాతం ఓట్లు తమకు వచ్చాయని చెప్పుకొనే జగన్‌రెడ్డి ఆ ఓట్లు వేసిన తమ తరఫున ఎందుకు మాట్లాడరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష హోదా కోసం చేసే రాద్ధాంతం అంతా జగన్ హోదా కోసమే తప్ప ప్రజల కోసం కాదనీ, నిజంగా ప్రజాపక్షం అయితే వారి తరఫున ప్రశ్నించే అవకాశమున్నా అసెంబ్లీకి వెళ్లకుండా ఎందుకు ఉంటారనీ ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా ఎమ్మెల్యేలుగా జీతం ఇతర అలెవెన్సులు ఎలా పొందుతారని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులకు ప్రజల పట్ల బాధ్యత ఉంటే అసెంబ్లీకి వెళ్ళండి ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించండి.

▪ **యనమల రామకృష్ణుడు**
మాజీ స్పీకర్

బుద్ధిజీవులపై బుద్ధిలేని చర్య!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, హెచ్–1బీ వీసా ఫీజును ఎకాఎకీ ఆరు రెట్లు (లక్ష డాలర్లకు) పెంచి, దాన్ని వెంటనే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించడం భారత్‌లో ప్రకంపనలు రేపుతోంది. భారత్‌లో అలజడి ఎందుకంటే ఆ తరహా వీసాదారుల్లో డెబ్బై శాతం మంది మనదేశం వారే. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. అమెరికాను తమ ఉద్యోగక్షేత్రంగా ఆశించే విదేశీయువత ఆశలపై ఇది నీళ్ల జల్లడమే. ప్రపంచీకరణ యుగంలో నాడు మేధో వలసల్ని ప్రోత్సహించడం, ఆకర్షించడం ద్వారా పలు దేశాల బుద్ధిజీవుల వల్ల అమెరికా ప్రగతి సాధించింది. నేడు విదేశీ ఉద్యోగుల వల్ల తమ యువతకు, ప్రగతికి నష్టం వాటిల్లుతోందని శాపనార్థాలు పెడుతూ, సామాజిక వైముఖ్యాన్ని పెంచుతోంది. ఇది ప్రమాదకర చర్య. ఇతర దేశాలపై ఆధారపడకుండా మనదేశం మన యువశక్తిని సంపూర్ణంగా వాడుకునేటట్లు తయారుకావాలి. ఆ దిశగా నూతన విధానాలననుసరిస్తూ దేశీయ పరిస్థితులను చక్కదిద్దాలి. యువశక్తి మెండుగా ఉన్న మన దేశానికి రానున్న పాతికేళ్లు ఎంతో కీలకం. విద్యావిధానం, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పనలపై పాలకులు దృష్టిపెడితే ప్రపంచ దేశాల అస్థిరపు విధానాల ప్రభావం మనపై తగ్గుతుంది.

– **డా. డీవీజీ శంకరరావు**
మాజీ ఎంపీ

30 వసంతాల చైతన్య మహిళా సంఘం

1991 మద్యనిషేధ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో పాల్గొన్న భావసారూప్యత గల సంఘాలు ఏకమై, 1995 సెప్టెంబర్ 24, 25న ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్యగా ఏర్పడి తదనంతరం చైతన్య మహిళా సంఘంగా మారింది. సంపూర్ణ మద్యనిషేధం, సంక్షేమ పథకాల అమలుకై పోరాటాలు చేసింది. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళనలు చేసింది. మహిళా చట్టాలలో మార్పుల కోసం పోరాడింది. మహిళలపై హింసకు కారణమైన సంస్కృతికి వ్యతిరేకంగా అవగాహన తరగతులు, సమావేశాలు నిర్వహిస్తూ, మహిళామార్గం పత్రిక ద్వారా చైతన్యం పెంచుతోంది. కష్టాలకు కారణమైన వాటిని తెలుసుకుని ఉద్యమిస్తే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుంది. ఈ నేపథ్యంలో చైతన్య మహిళా సంఘం ఆవిర్భావదినం సందర్భంగా కడప జిల్లా, రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో నేడు సదస్సు జరగనున్నది. మూడు సెషన్లలో జరిగే ఈ సభలో ప్రసంగాలు, పుస్తకావిష్కరణలు, సందేశాలు ఉంటాయి.

– **జ్యోతి,** రాష్ట్ర కన్వీనర్, చైతన్య మహిళా సంఘం



● గాయత్రీదేవిగా అమ్మవారు

వేదమయి..

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



రెండోరోజు ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి రాక ● నిమిషానికి 60 మందికి దర్శనం





అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న అర్చకులు



దుర్గమ్మ నగరోత్సవం





కోలాట ప్రదర్శనలతో ముందుకు సాగుతున్న అమ్మవారి నగరోత్సవం



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులతో కలిసి వెళ్తున్న కలెక్టర్ లక్ష్మీశ దంపతులు

ఉదయం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఇంద్రకీలాద్రి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మంగళవారం గాయత్రీదేవి అలంకారం కావడంతో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. వేదమాత, పంచముఖిగా వర్థిల్లుతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. నగరోత్సవం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అంతటా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి.



నృత్య అభినయం ప్రదర్శిస్తున్న చిన్నారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇంద్రకీలాద్రి): శ్రీగాయత్రీదేవి అలంకారంలో కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి రద్దీ కొనసాగింది. మహిళా మంత్రులు వంగలపూడి అనిత, సవిత, గుమ్మడి సంధ్యారాణి తోపాటు మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి తదితరులు ఎరుపు రంగు దుస్తులు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని ఉదయం వేళ దర్శనం చేసుకోవటానికి 1.20 గంటల సమయం పట్టింది. అదే మధ్యాహ్నం సమయంలో 1.10 గంటలు, సాయంత్రం 1.31 గంటల సమయం పట్టింది. అనధికార దర్శనాలను నియంత్రించగలిగితే గంటలోపే అమ్మవారి దర్శనం భక్తులకు లభిస్తుంది. అమ్మవారిని మిగతా 6లో..

పరవశం

పున్నమిఘాట్ పులకరించింది. సాంస్కృతిక శోభ వెల్లివిరిసింది. దాండియా నృత్యాలు, అభిజిత్ నాయర్ వయోలిన్, సినీ గాయని వాగ్దేవి సుస్వరాలు వెరసి నగర ప్రజలను ఆనంద డోలికలలో తేలియాడించాయి. విజయవాడ ఉత్సవ్ సంబరాలు రెండో రోజు మంగళవారం అంబరాన్నంటాయి.

అంబరాన్నంటిన విజయవాడ ఉత్సవ్ సంబరాలు

- ఆధ్యాత్మిక వినోదాన్ని పంచిన సినీ గాయని వాగ్దేవి
- యువతలో జోష్ నింపిన దాండియా, అభిజిత్ నాయర్ వయోలిన్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- వీక్షించిన గవర్నర్ అబ్దుల్ నజీర్



అభిజిత్ నాయర్

సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వెనిగళ్ల రాము, వర్ల కుమార్‌రాజా, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర ఉన్నతాధికారులు



డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పున్నమిఘాట్‌లో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై వీక్షించారు. తొలుత మిగతా 6లో..

ఆగని వన్యప్రాణుల వేట

కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో కొనసాగుతున్న మరణాలు

- మంగళవారం వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన మరో దుప్పి
- అడవి అంతా ఉచ్చులు బిగించిన వేటగాళ్లు
- ఏమీలేదంటున్న అధికారుల తీరుపై వ్యక్తమవుతున్న విమర్శలు

6

రేలారేలారే.. 8

నో ఫ్లయింగ్ జోన్‌గా గన్నవరం-పున్నమిఘాట్

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పర్యటన నేపథ్యంలో అధికారుల నిర్ణయం

విజయవాడ/ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గన్నవరం నుంచి పున్నమిఘాట్ వరకు ఉన్న మార్గాన్ని పోలీసులు నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. మంగళవారం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాధాకృష్ణన్ గన్నవరం నుంచి రోడ్డు మార్గాన ఇంద్రకీలాద్రికి, పున్నమిఘాట్‌కు చేరుకుంటారు. ఆయన పర్యటన సాగే ప్రాంతాల్లో ఎలాంటి డ్రోన్లు ఎగరవేతపై నిషేధం విధించారు. పర్యటన ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు.

నేడు దుర్గగుడిలో వీఐపీ దర్శన స్లాట్ రద్దు

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దుర్గగుడిలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీఐపీ దర్శన స్లాట్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపరాష్ట్రపతి సాయంత్రం 4.30 గంటల సమయంలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని, వీఐపీలు సహకరించవలసిందిగా కలెక్టర్ కోరారు.

పనులకు బ్రేక్!

జల్ జీవన్ మిషన్ పనులు పూర్తిగా ఆపేసిన కాంట్రాక్టర్లు


- ఉమ్మడి కృష్ణాజిల్లాలో చిన్న కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయి రూ.35 కోట్లు
- ఇటీవలే నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ
- బడ్జెట్ రిలీజ్ ఆర్డర్, పే అండ్ అకౌంట్స్ క్లియరెన్స్ పూర్తి
- అయినా ఆర్థిక శాఖ నుంచి విడుదల కాని నగదు
- 26న డిప్యూటీ సీఎం ఆఫీసు ముందు ధర్నాకు కాంట్రాక్టర్ల సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను కాంట్రాక్టర్లు నిలుపుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా.. ఆర్థిక శాఖ నుంచి నగదు విడుదల చేయక పోవటాన్ని నిరసిస్తూ మిగతా 6లో..

వేళాపాళాలేని ప్రొటోకాల్, వీఐపీ దర్శనాలపై సీఎం ఆగ్రహం

- సీఎంవోలో చర్చకు రావటంతో సీరియస్ అయిన చంద్రబాబు
- దుర్గగుడి ఈవోకు ఫోన్ చేసిన సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర
- నిర్దేశిత సమయాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- నేటి నుంచి పక్కాగా అమలు చేసేందుకు దుర్గగుడి అధికారులు సిద్ధం

6



కొండంత భక్తి..





రెండోరోజు ఆదాయం రూ.25.48లక్షలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి దసరా మహోత్సవాలలో రెండవరోజు సాయంత్రం వరకు దేవస్థానానికి వివిధ రూపాల్లో మొత్తం రూ.25,48,725లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్ల ద్వారా రూ.8,99,400లు, రూ.100ల ద్వారా రూ.3,16,200లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.1,86,930లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.9,66,700లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.69వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్ల ద్వారా రూ.30వేలు, పరోక్ష ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన (టిక్కెట్ రూ.3వేలు) టిక్కెట్ల ద్వారా రూ.9వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.20,464లు, పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,585లు, తలనీలాల సమర్పణకు (టిక్కెట్ రూ.40) టిక్కెట్ల ద్వారా రూ.36,480లు, ఇతరత్రా ఆదాయం రూ.8,966లు మొత్తం కలిపి రూ.25,48,725లు లభించినట్లు ఈవో వివరించారు. సాయంత్రం వరకు భక్తులు 60,641 మంది అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో ప్రకటనలో తెలిపారు.


అమ్మవారిని దర్శించుకున్న మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

దుర్గమ్మ సేవలో ప్రజా ప్రతినిధులు..

చిట్టినగర్ : ఒకరు హోంమంత్రి. మరొకరు బీసీ సంక్షేమ మంత్రి. ఇంకొకరు ఎమ్మెల్యే. ఇంద్రకీలాద్రిపై మంగళవారం మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు అమ్మవారిని దర్శించుకోవడానికి ఏక రూపు దుస్తులతో వచ్చారు. హోంమంత్రి అనిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గాయత్రీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. వారితోపాటు కొవ్వూరు ఎమ్మెల్యే వేంరెడ్డి ప్రశాంతి రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, సింగనమల ఎమ్మెల్యే బండారి శ్రావణి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే జి.మాధవి, తెలంగాణ రాష్ట్రం, మెదక్ ఎంపీ రఘునందన్ రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలంతా అమ్మవారికి ఇష్టమైన ఎరుపురంగు దుస్తులు ధరించడం విశేషం. మన సంస్కృతి సంప్రదాయాలపై సందేశం ఇచ్చేందుకే డ్రెస్ కోడ్ పాటిస్తున్నామని, రాష్ట్రాన్ని చల్లగా చూడాలని దుర్గమ్మను వేడుకున్నామన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో దుర్గగుడి చైర్మన్



గాయత్రీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మను దుర్గగుడి చైర్మన్‌గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

వేదమయి..

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం నాలుగు గంటల సమయానికి 56,545 మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. 32 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ ఆ తర్వాత భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. తొలిరోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను రికార్డుస్థాయిలో 90 వేల మంది దర్శించుకొన్నారు. కాగా, కనకదుర్గమ్మ బుధవారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోడానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మను ప్రముఖులు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఏఐ టెక్నాలజీ సహాయంతో అధికారులు కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.



ప్రతి కదలికపైనా.. నిఘా!

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి చుట్టూ అధికారులు డేగ కన్నేసి ఉంచారు. గుడివైపు కదిలే ప్రతి అడుగు, ప్రతి వాహనంపై అత్యంత నిఘా పెట్టారు. ఘాట్ల నుంచి భక్తులు దర్శనానికి వెళ్లి వచ్చే వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. టోల్‌గేట్లు, పార్కింగ్ స్థలాలు, వాహనాల వివరాలు, ఇలా క్షణాల్లో సమాచారం.. సేకరిస్తున్నారు. అన్న ప్రసాదం స్వీకరించేది ఎందరు.. లడ్డూ ప్రసాదాల వద్ద ప్రతి అంశాన్ని సెకన్లలో తెలుసుకుంటున్నారు. నగరానికి వచ్చిపోయే రైళ్లు.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల విషయంలో అధికారులు పక్కా ప్రణాళికతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే విషయాలన్నీ సెకన్ల వ్యవధిలో అధికారుల చేతుల్లో లెక్కలు ఉంటున్నాయి. ఈసారి దసరా వేడుకల్లో అధికారులు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఎప్పటికప్పుడు పక్కాగా లెక్కిస్తున్నారు.

మోడల్ కంట్రోల్‌రూం

కీలాద్రికి వచ్చే దారులన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయి. ఫుటేజీలను వీక్షించడానికి వీలుగా స్క్రీన్లను దుర్గాఘాట్‌ను ఆనుకుని ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. వినాయకస్వామి గుడి, బస్టాండ్, సీతమ్మపాదాల ఘాట్ నుంచి వచ్చే అన్నిదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. అదే విధంగా పున్నమిఘాట్ సహా కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే రహదారిలోను సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, భక్తులకు ఇబ్బందులు కలిగినా క్షణాల్లో స్పందించేలా మానటరింగ్ చేస్తున్నారు.

క్షణాల్లో సమాచారం..

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300, ప్రొటోకాల్ టిక్కెట్లు తీసుకుని ఎంతమంది భక్తులు వస్తున్నారు. ఎంతమంది దర్శించుకుంటున్నారు వివరాలు క్షణాల్లో కనిపించే విధంగా అధికారులు స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తుల్లో ఎంతమంది అన్నప్రసాదం తీసుకుంటున్నారు. లడ్డూలు ఎంతమంది తీసుకుంటున్నారనే వివరాలు పక్కాగా లెక్కిస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో నిమిషానికి ఎన్నివాహనాలు పార్కింగ్‌కు వస్తున్నాయి, ఎన్ని వెళుతున్నాయి, ప్రస్తుతం ఎన్ని పార్కింగ్‌లో ఉన్నాయనే వివరాలుసేకరిస్తున్నారు. దీనితో పాటు నో పార్కింగ్ జోన్లలో పెట్టిన వాహనాలను క్షణాల వ్యవధిలో


కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

టోయింగ్ వాహనం వచ్చి తీసుకెళ్లి దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మోడల్ గెస్ట్ హౌస్‌లో రైల్వే సమాచార స్క్రీన్‌ను ఏర్పాటుచేసి సిబ్బంది మైక్‌ల ద్వారా సమాచారమిస్తున్నారు.

సీతమ్మవారి పాదాల వద్ద సిబ్బంది నిర్లక్ష్యం

సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద స్నానాలు చేయడానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఘాట్‌లో నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన జల్లు స్నానాల ట్యాప్‌ల్లో సిబ్బంది రెండు మాత్రమే వదిలారు. మిగతా రెండింటి ద్వారా నీటిని వదలలేదు. వాటిద్వారా నీటిని వదలాలని అడిగినా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రెండుచోట్ల భక్తుల తాకిడి ఎక్కువై స్నానాలు చేయడానికి భక్తులు ఇబ్బంది పడ్డారు.

వాహనదారులకు అడ్డుకట్ట

ఎన్‌హెచ్ 65, బస్టాప్ వైపుగా వచ్చే వాహనదారులను కనకదుర్గ ఫ్లైఓవర్ మీదగా మళ్లించారు. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. ఎంత ప్రయత్నించినా పోలీసులు విడిచిపెట్టకపోవడంతో వెనుదిరిగి ఏలూరు రోడ్డు- వినాయకస్వామి గుడి వైపు వెళ్లే ఫ్లైఓవర్ మీదగా వెళుతున్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు..

భక్తులు వాడిపడేసిన కవర్లు, వాటర్‌బాటిళ్లు, ఇతర వ్యర్థపదార్థాల కోసం వీఎంసీ ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేసింది. కొంత మంది భక్తుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. దీనితో పాటు ఘాట్‌లలో స్నానాలుచేసే కొంతమంది భక్తులు వస్త్రాలు వదిలేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఏరివేస్తూ రోడ్లు, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

ప్రత్యక్ష పూజలకే భక్తుల మొగ్గు

» పరోక్ష పూజలపై విముఖత!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇంద్రకీలాద్రి) : కనకదుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. దసరా ఉత్సవాలలోనూ ఇది కొనసాగుతుంటుంది. ఈ ఉత్సవాలలో సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక పూజల సంఖ్య తగ్గించి.. పరోక్షంగా పూజలు వీక్షించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టినా భక్తులు ప్రత్యక్ష పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. రోజుకు 200 మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటుండగా.. పరోక్షంగా కేవలం 30 మంది వరకే పాల్గొంటున్నారు. దసరా ఉత్సవాలలో మహామండపంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, శ్రీచక్ర నవార్చన, ఖడ్గమాల, చండీహోమం వంటి పూజలు ప్రత్యేకంగా జరుగుతున్నాయి. రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు టిక్కెట్ల ధరలు ఉండే ఈ ప్రత్యేక పూజలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. సామాన్య భక్తుల కోసం కొండ మీద రద్దీ తగ్గించేందుకు ఈ దసరా ఉత్సవాలలో పరిమిత సంఖ్యలో రెండు షిఫ్టుల్లో 200 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులోనే చండీహోమం పూజకు 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. పరోక్ష విధానంలో పూజల్లో పాల్గొనేవారికి లైవ్ లింక్‌ను పంపిస్తారు. దానిని వీక్షిస్తు పూజ ముగిశాక.. అమ్మవారి ప్రసాదాలు, వస్త్రం, రాగి డాలర్ తదితరాలను వారి ఇంటికి పంపిస్తారు. కానీ, పరోక్ష పూజలో ఆశించినంతగా భక్తులు పాల్గొనలేదు. ప్రత్యక్ష పూజలు మాదిరిగా పరోక్ష పూజలను అనుభూతి చెందలేకపోతున్నామన్నది భక్తుల అభిప్రాయంగా ఉంది.

» ప్రత్యేక పూజలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు

అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొనటానికి వచ్చే భక్తులకు కొండపైన ఇబ్బందులు తప్పడంలేదు. ప్రత్యేక పూజకు సమయానికి వారు రావాల్సి ఉంటుంది. ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్న భక్తులు ఓం టర్నింగ్ వద్ద ఇబ్బందులు పడుతున్నారు. వారిని అక్కడ విధుల్లో వున్న పోలీసులు అడ్డుకుంటున్నారు. వీళ్ళంతా క్యూలైన్లలో వెళ్ళేవారు కాదు. మహామండపానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక పూజలలో పాల్గొనే వారు తమ టిక్కెట్లను చూపిస్తే ఘాట్ మార్గం నుంచి లోపలికి వారిని పంపించాలి. పోలీసులు అలా చేయటం లేదు. చాలా మంది కొత్త భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొనటానికి టిక్కెట్లను బుక్ చేసుకుంటారు. వీరికి కనీసం సమాచారం తెలపాల్సింది పోయి వారిని క్యూలైన్లలోకి పంపడంతో సమయానికి వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.


భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు

వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత బస్సు సదుపాయం

ఇంద్రకీలాద్రి : దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్, రైల్వేస్టేషన్, సిటీ బస్సు టెర్మినల్ వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ బస్సుల్లో 15 మందికి మాత్రమే అవకాశముంది. వృద్ధులు, దివ్యాంగులవెంట వచ్చిన వారు కూడా బస్సులో ఎక్కుతున్నారు. దీనిని నియంత్రణ చేయాల్సి ఉంది. మంగళవారం క్షేత్రస్థాయిలో ఈవో శీనానాయక్ ఆయా ప్రాంతాల్లో తనిఖీ చేసి తగు సూచనలు చేశారు.

దివ్యాంగులు, వృద్ధులకు చేయూత



చిట్టినగర్ : దుర్గమ్మ దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ సేవలందిస్తున్నాయి. పదిమంది సభ్యుల బృందాలు వేకువజాము నుంచి రాత్రి వరకు వారికి చేయూతనిస్తూ భక్తుల ప్రశంసలు పొందుతున్నాయి.

పనులకు బ్రేక్!

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా ఆపేశారు. ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం రూ.152 కోట్ల నిధులను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఈ నిధులు చెల్లింపునకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్ఓ) కూడా ఇచ్చింది. దీని తర్వాత పే అండ్ అకౌంట్స్ విభాగం నుంచి కూడా చెల్లింపులకు క్లియరెన్స్ వచ్చింది. ఆర్థికశాఖ నుంచి మాత్రం ఎంతకీ నిధులు విడుదల కావటం లేదు. దీంతో కాంట్రాక్టర్లలో తీవ్ర అసహనం నెలకొంది. ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం నేతల దృష్టికి తమ సమస్యలను తీసుకు వెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో కాంట్రాక్టర్ల సంఘం అగ్రనేతలు ఇటీవల ఆర్థిక శాఖ కార్యదర్శిని కలిశారు. ఆ సందర్భంలో వారికి సంతృప్తికర సమాధానం రాలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు జేజేఎం పనులను నిలుపుదల చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తంగా రూ.35 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. పెద్ద కాంట్రాక్టర్లు, కార్పొరేట్ కాంట్రాక్టర్లకు ఇంతకు ముందే డబ్బులు వచ్చేశాయి. ప్రస్తుం చిన్న కాంట్రాక్టర్లకే బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం జీవో విడుదల చేయగానే.. తమ బిల్లులు వచ్చేస్తున్నాయని సంతోషంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లకు ఆర్థికశాఖ నుంచి ఎంతకీ డబ్బులు విడుదల కాకపోవటం తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇప్పటికే బిల్లులు ఇవ్వటం లేదని జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను చాలా వరకు కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఆర్థికశాఖ తీరు గురించి తెలుసుకున్నాక.. తాజాగా పూర్తిగా పనులు నిలుపుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా భారీ సంఖ్యలో బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయానికి వచ్చిన నివేదిక ప్రకారం రూ.700 కోట్ల మేర బిల్లింగ్ అయినట్టుగా తెలుస్తోంది. ఇందులో ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వం రూ.152 కోట్లను విడుదల చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా చిన్న కాంట్రాక్టర్లు సగం బకాయిలు అయినా వస్తాయని ఆశించారు.

26న ఆందోళనకు కాంట్రాక్టర్ల పిలుపు

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను కాదని ఆర్థిక శాఖ డబ్బులు చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన ఆందోళన చేపట్టాలని కాంట్రాక్టర్లు పిలుపునిచ్చారు. ముందు ఈఎన్‌సీ కార్యాలయం దగ్గర అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత మంగళగిరిలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం దగ్గర ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

సంస్కృతి, కళల పూర్వవైభవానికి కృషి

» మంత్రి కందుల దుర్గేష్

వన్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో జానపద కళలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడ పున్నమిఘాట్ లోని హరిత రిసార్ట్ (బెరం పార్క్)లోని కాన్ఫరెన్స్ హాలులో జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా వంపూరు గంగులయ్యతో మంగళవారం ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కళలు, చారిత్రక, పర్యాటక రంగాల రంగాల ప్రాధాన్యత, చారిత్రక, పర్యాటక విషయాలను తెలియజేసేలా జరిగే కృషిలో కవులు, కళాకారులు, రచయితలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. అంతరించిపోతున్న జానపద కళలకు రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. అతి త్వరలో రాజమండ్రికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వస్తుందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ అధికారులను మంత్రి ప్రశంసించారు. గంగులయ్య ఎంపిక సరైనది, సముచితమైనది అని కొనియాడారు. త్వరలోనే అనుబంధ శాఖల పోస్టుల నియామకం ఉంటుందన్నారు. గంగులయ్య మాట్లాడుతూ, జానపద కళలు, విజ్ఞానం, సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావటం ద్వారా పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, మంత్రి దుర్గేష్ అద్భుతమైన రంగస్థల నటుడని కొనియాడారు. జన హృదయం నుంచి పుట్టిన జానపద కళల అభివృద్ధికి గంగులయ్య కృషిచేస్తారనే నమ్మకం ఉందన్నారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్మన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ, రాష్ట్రంలో సాంస్కృతిక వికాసం మరింతగా పరిడవిల్లేలా కృషి చేస్తామన్నారు.


వంపూరు గంగులయ్యతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

వేళాపాళాలేని ప్రొటోకాల్, వీఐపీ దర్శనాలపై సీఎం ఆగ్రహం!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాలలో ఇంద్రకీలాద్రిపై వీఐపీ దర్శనాలకు నిర్దేశించిన సమయాలను పాటించకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సామాన్యులకు దర్శనం సాఫీగా జరగాలన్న ఉద్దేశ్యంతో తాము వ్యవహరిస్తుంటే.. దీనికి భిన్నంగా వీఐపీలు దర్శనాలకు వెళ్లడంపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. సీఎంవోలో వీఐపీల దర్శనాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. నిర్ణీత వేళలు కాకుండా మిగిలిన సమయాలలో వీఐపీల దర్శనాలను నిలువరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించటంతో సీఎంవో ప్రత్యేక కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర మంగళవారం రాత్రి ఈవో శీనానాయక్‌కు ఫోన్‌చేశారు. వీఐపీ దర్శనాలకు నిర్దేశిత సమయాలు కేటాయించినా, మిగిలిన సమయాలలో ఎందుకు వస్తున్నారని ఈవోను ప్రశ్నించారు. వీఐపీలతో పాటు ప్రొటోకాల్ దర్శనాలకు ఇలా వచ్చే వారిగురించి ఈవోను అడిగి తెలుసుకున్నారు. ఈవో శీనానాయక్ దేవస్థాన అధికారులతో సమావేశమయ్యారు. వీఐపీలు, ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చేవారు వారికిచ్చిన సమయాలలో కాకుండా మిగిలిన సమయాలలో వస్తున్న కారణాలపై చర్చించారు.ముఖ్యమంత్రి కార్యాలయం కూడా గట్టిగా చెప్పిన నేపథ్యంలో బుధవారం నుంచి వారికి నిర్దేశించిన సమయాలలోనే వారిని అనుమతించాలని, మిగిలిన సమయాలలో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఆ వెంటనే ఈవో శీనానాయక్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు ప్రతిరోజూ ఉదయం 7నుంచి 9 వరకు సాయంత్రం 3 నుంచి 5 వరకు మాత్రమే రావాల్సి ఉంటుందని.. మిగిలిన సమయాలలో అనుమతించే ప్రసక్తే లేదన్నారు.

ఆగని వన్యప్రాణుల వేట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొండపల్లి అడవిలో వన్యప్రాణుల వేట ఆగలేదు. వేటగాళ్ల ఉచ్చులకు చిక్కి చనిపోతూనే ఉన్నాయి. మంగళవారం వేటగాళ్ల ఉచ్చుకు ఓ దుప్పి చిక్కింది. మరో దుప్పి కళేబరం వెలుగులోకి వచ్చింది. ఇటీవల వణ్యప్రాణులను వేటడుతున్న ఘటనలపై 'అరణ్య రోదన' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌పై దృష్టి సారించారు. అయినా వన్యప్రాణుల మరణ మృదంగం ఆగటం లేదు. వేటగాళ్లు పెద్ద సంఖ్యలో అరణ్యంలో ఉచ్చులు పన్నటంతో మంగళవారం కూడా స్థానికుల పరిశీలనలో ఉచ్చుకు చిక్కిన దుప్పి కంటపడింది. ఉచ్చులో చిక్కుకుని ఉదరభాగం తీగ రాపిడికి గురై గాయాలపాలైంది. మెడ భాగంలో కూడా గాయాలయ్యాయి. మరో దుప్పి ఉచ్చులో చిక్కి మృతి చెంది కుళ్లిన స్థితిలో ఉంది. ఉచ్చులో పడిన గంటల వ్యవధిలోనే వాటిని బయటకు తరలిస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇరవై నాలుగు గంటలు గడిస్తే మాత్రం అవి వాసన వస్తాయి. అలాంటి వాటిని బయటకు తీసుకు వెళితే ప్రమాదం కాబట్టి వాటిని అక్కడే వదిలేస్తారు. దీంతో కొంతమంది స్థానికంగా వండుకోవటానికి తీసుకువెళతారు. మంగళవారం ఉచ్చులో చిక్కుకున్న దుప్పి, చనిపోయిన మరో దుప్పి సమాచారాన్ని స్థానికులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి పెద్ద సంఖ్యలో జింకలు, దుప్పులు వస్తున్నాయి. కాగా, విజయవాడ అటవీ అధికారి కె.శ్రీనివాసులురెడ్డి మాత్రం అడవిలో వన్యప్రాణుల వేట జరగలేదని మంగళవారం పత్రికలకు వివరణ పంపారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలోని చిత్రాలు ఇక్కడివి కాదని పేర్కొన్నారు. ఆయన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొండపల్లి ఫారెస్టులో యథేచ్ఛగా వేట కొనసాగుతున్నట్టు ఆధారాలు లభిస్తున్నా అధికారులు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. వేటగాళ్లకు అటవీ అధికారులు ఎందుకు సహకరిస్తున్నారనే చర్చ సర్వత్రా జరుగుతోంది.


వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన దుప్పి

దసరా ఏర్పాట్లు అద్భుతం..

» దుర్గమ్మను దర్శించుకున్న మాధవ్



లబ్బీపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రులు అంగరంగవైభవంగా జరుగుతున్నాయని, ఏర్పాట్లు కూడా అద్భుతంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవకమిటీ, అధికారులు చక్కగా వ్యవహరించారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరి జీవితాల్లో అభివృద్ధి జరగాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు.

సీనియర్ అర్చకుడి అత్యుత్సాహం

» శంకర్ శాండిల్యపై ఈవోకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రధాన ఆలయం వద్ద సీనియర్ అర్చకుడు శంకర్ శాండిల్య అత్యుత్సాహం ప్రదర్శించడంపై పలువురు అర్చకులు ఈవో శీనానాయక్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి మహానివేదన సమర్పిస్తున్న సమయంలో సీనియర్ అర్చకుడు శంకర్ శాండిల్య అత్యుత్సాహంతో దేవదాయ మంత్రి, కమిషనర్‌లను వెంటపెట్టుకుని అమ్మవారి ప్రధాన ఆలయంలోకి వెళ్లడంపై అర్చకస్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అర్చకులు ఈవోకు ఫిర్యాదు చేయగా.. ఈవో శంకర్ శాండిల్య తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చకు దారితీసింది.

పరవశం

(5వ పేజీ తరువాయి)

ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని తిలకించారు. గాయత్రీ మాత అలంకరణలో ఉన్న దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను గవర్నర్ సందర్శించారు. సినీ గాయని, చిన్నారి వాగ్దేవి మృదు మధురంగా ఆలపించిన భక్తి గీతాలను ఆసక్తిగా తిలకించారు.

యువతలో జోష్ నింపిన సంగీత, నృత్య ప్రదర్శనలు

మానస తెడ్ల బృందం చేసిన కూచిపూడి నృత్యం అమితంగా ఆకట్టుకుంది. అమ్మవారి శక్తి రూపాలను, శాంతి స్వభావం, ఉగ్ర రూపాన్ని నాట్యరూపంలో ప్రదర్శించారు. రాక్షస సంహారం చేసిన ఆది పరాశక్తి నాట్యం కట్టిపడేసింది. జగన్మోహిని, విఠలక్ష్మి, కనకదుర్గ రూపంతో నాట్యాన్ని ముగించారు. సినీ గాయని, సరిగమ షో విన్నర్ చిన్నారి వాగ్దేవి ఆలపించిన మహా కనక దుర్గా.., శ్రీగౌరి.. శ్రీ గౌరీ వే.., చక్కని తల్లికి చాంగుబళా (అన్నమాచార్య కీర్తన), భాగ్య లక్ష్మి బారమ్మ.. సౌభాగ్య లక్ష్మి బారమ్మ (కన్నడ గేయం) ఆధ్యాత్మిక వినోదాన్ని పంచింది. కేరళ మ్యూజికల్ స్టార్ అభిజిత్ నాయర్ బృందం ప్రదర్శించిన వయోలిన్ మ్యూజిక్ యువతను ఉర్రూతలూగించింది. ప్రధానంగా ఇళయరాజా, ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని రీమిక్స్ చేశారు. చివరిగా బోక్సో బృందం (హైదరాబాద్) ఆడిన దాండియా అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. ఈ బృందం కొద్దిసేపు మాత్రమే వేదికపై దాండియా ఆడింది. ఆ తర్వాత ప్రేక్షకులు మధ్యలోకి ఈ బృందం చేరుకుని అన్ని వర్గాల ప్రజలను దాండియాలో భాగస్వాములను చేసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ జి.లక్ష్మీశ, పలువురు ప్రముఖులు ఈ దాండియాలో చురుగ్గా పాల్గొన్నారు.

క్యూలో బాలికకు అస్వస్థత

● వైద్యశిబిరానికి తరలించిన కానిస్టేబుల్

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తుల్లో ఓ చిన్నారి మంగళవారం మధ్యాహ్నం గాలిగోపురం వద్దకు వచ్చేసరికి అస్వస్థతకు గురైంది. అక్కడే మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్ పాపను హుటాహుటిన జనరల్ సెల్ ఎదురుగా ఉన్న మెడికల్ క్యాంపునకు తీసుకువెళ్లారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందజేసిన అనంతరం పాపను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.


గాయత్రీదేవిగా మద్దిరావమ్మతల్లి


దాసాంజనేయ దేవస్థానంలో గాయత్రీదేవిగా అమ్మవారు


కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో....


ఆటోనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో..


బాలాత్రిపురసుందరీదేవిగా కాళీమాత


గాయత్రీదేవిగా ధనకొండ అమ్మవారు


దేవీభక్త బృందం ఆధ్వర్యంలో..


రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

గాయత్రీదేవిగా అమ్మ దర్శనం

అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు

భారతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో రామభక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ● గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీమద్దిరావమ్మతల్లి దేవస్థానంలో శ్రీ మద్దిరావమ్మ తల్లి భక్తులకు శ్రీ గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మహిళలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీరాజరాజేశ్వరి లలితాపరమేశ్వరికి కుంకుమ పూజ

పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితాపరమేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. దాతలు పుత్తూరి శ్రీనివాసరావు, రుక్మిణి దంపతులచే అమ్మవారికి అభిషేకం, అనంతరం చక్రస్నానం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 300మంది వివాహిత మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, ఉపాధ్యక్షులు రంగలక్ష్మీ, కోశాధికారి యామశివనారాయణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో...

కృష్ణలంక: కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ కుటుంబం, మహిళా ఏఎస్‌ఐ ధనలక్ష్మీ, ఎస్‌ఐలు సతీష్, భానుప్రసాద్, మొగిలి శ్రీను, అశోక్ తదితరులు అమ్మవారి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలాత్రిపురసుందరీదేవిగా కాళీమాత

త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి కలశస్థాపన, అభిషేకం, శ్రీచక్ర పూజ, చండీహోమం, మూలమంత్ర హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి దేవాలయంలో..

ఆటోనగర్: ఆటోనగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అమ్మవారు మంగళవారం గాయత్రీదేవిగా అలంకృతులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి విశేష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు ఆచార్య కస్తూరి రాజ్‌గోపాల్, జగదీష్ గురుకుల్‌లు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా ధనకొండ అమ్మవారు

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండ మీద శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

దేవీభక్త బృందం ఆధ్వర్యంలో..

రామలింగేశ్వరనగర్: పటమట ఎస్ఎస్ఎం స్కూలు ప్రాంతంలోని కౌండిన్యనగర్‌లో దేవీభక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. దాతలు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు నాగమణి దంపతులు, వాకా గంగా ప్రసాద్ పావని దంపతులు, చిట్టిబొమ్మ హరిబాబు మంజు దంపతుల చేతులమీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు లడ్డూ ప్రసాద వితరణ చేశారు.

ఉత్సవ ఏర్పాట్లను డ్రోన్లతో పర్యవేక్షించండి

అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రోన్‌లతో పర్యవేక్షించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం వినాయకుని గుడి, కెనాల్ రోడ్, సీతమ్మవారి పాదాలు తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. భక్తులు చెప్పుల స్టాండ్లు ఉన్నప్పటికీ రోడ్లపైన చెప్పులను వదిలేయటం చూసి సౌకర్యాలను మెరుగుపర్చాలని, అవసరమైన చోట ఉచిత చెప్పుల, సామాన్లు భద్రపరిచే స్టాండ్ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం స్టాక్ పాయింట్ల నుంచి తాగునీటి పాయింట్లకు సరఫరా అయ్యేలా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని వాడుక నీరు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్లో, మోడల్ గెస్ట్ హౌస్‌లో వీఎంసీ సిబ్బందిఇతర శాఖలతో సమన్వయం చేసుకొని అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారుల ఆదేశించారు. ఈ పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


ఫ్లైఓవర్ కింద పరిసరాలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐలూ న్యాయవాదులు

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కరపత్రాల పంపిణీ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం న్యాయవాదులకు అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) నాయవాదులు కరపత్రాలు పంపిణీ చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్ల గ్రాంట్‌ను ఏపీ బార్ కౌన్సిల్‌కు జమచేసి న్యాయవాదుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేనిపక్షంలో న్యాయవాదులు ఉద్యమం బాట పడతారని ఐలూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి సంపర శ్రీనివాసరావు, వి.రాజారత్నం, సీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలూరి సుధాకరరావు, సప్పా రమేష్, బొమ్మసాని రవి, కె.క్రాంతికుమార్, కె.కోటబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

మొగల్రాజపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా వేడుకల్లో మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. సింధూర రంగు వస్త్రం, తామరపూలతో పూజ, నిమ్మకాయ పులిహోర నివేదనతో పూజలు చేశారు. సాయంత్రం లలితాపారాయణం, దశవిధ హారతులు, నీరాజన మంత్రపుష్పం, వేదస్వస్తి సమర్పించారు. మంగళవారం వేదిక అలంకార దాతగా ఆంధ్రహాస్పటల్స్, స్వర్ణాభరణ అలంకరణ దాత ఆంజనేయ జ్యూయలరీ వారు ఉన్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో గాయత్రీనగర్, మొగల్రాజపురంలో ఊరేగించారు.


గాయత్రీదేవిగా అమ్మవారు


హోమంలో పాల్గొన్న దంపతులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 10 టన్నుల కూరగాయల వితరణ

బెంజిసర్కిల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఓనర్స్ అసోసియేషన్ తిరుమల తిరుపతి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు 10 టన్నుల కూరగాయలను విరాళంగా పంపిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా తెలిపారు. మంగళవారం ఉదయం బెంజిసర్కిల్ వద్ద ఉన్న అసోసియేషన్ హాలు నుం,ఇ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలేశునికి గతంలో ముక్కోటి ఏకాదశికి పది టన్నుల కూరగాయలు పంపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శులు కోనేరు జగదీశ్వరరావు, పిట్టల శివరాం ప్రసాద్, ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, ఏపీ లారీ ఓనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.


కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా



ముగిసిన జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు

ప్రభుత్వాసుపత్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల డాక్టర్ డాక్టర్ ఏవై రావు అడ్‌వెర్స్ డ్రగ్ రియాక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. అనిత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని

భారతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడికి విచ్చేసే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూడాలని, తక్షణమే వైద్యసహాయం అందించాలని జిల్లా వైద్యఆర్యోగ శాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని ఆదేశించారు.. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 10 పడకల ఆసుపత్రి, కొండపై ఓం టర్నింగ్ ఏరియాలోని మూడు పడకల ఆసుపత్రిని మంగళవారం డీఎంహెచ్‌వో సుహాసిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారిని దర్శించడానికి దూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే 108 సహాయంతో తక్షణమే వైద్యసహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని

మహిళానేతల హెలికాప్టర్ రైడ్

భారతీనగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన హెలికాప్టర్ రైడ్ విశేష ఆకర్షణగా మారింది. మంగళవారం టీడీపీ మహిళా నేతలు జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, సాంస్కృతిక సంఘం చైర్మన్ బోడపాటి తేజస్విని, కేశినేని జానకి, బొండా సుజాత, కేశినేని శ్రీదేవి, కొమ్మారెడ్డి, తదితరులు హెలికాప్టర్ రైడ్‌లో పాల్గొన్నారు. వీరంతా బోర్డింగ్ పాస్‌లు తీసుకొని రైడ్‌లో పాల్గొని నగర సోయగాలను వీక్షించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. నగరప్రజలతోపాటు రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులకు ఈ వేడుకలు ఆనందాన్ని పంచుతున్నాయని అన్నారు.


హెలికాప్టర్ రైడ్‌కు వెళ్తున్న జానకీ, సుజాత, అనురాధ తదితరులు

కృష్ణానదిలో ఈతకు వెళ్లి బాలుడు గల్లంతు

వన్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఈతకు వెళ్లిన చొప్పవరపు సాయి సందీప్ (15) గల్లంతైన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక మార్వాడీ గుడి సమీపంలో చొప్పవరపు ప్రసాద్ భార్య, కుమార్తె, కుమారుడితో ఉంటున్నాడు. ప్రసాద్ ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని కుమారుడు సాయి సందీప్ జమ్మిచెట్టు సెంటర్‌లోని గోల్డెన్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సాయి సందీప్ మంగళవారం ఉదయం కృష్ణానదిలో ఈతకు వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. ప్రమాదవశాత్తు సాయి సందీప్ నదిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా స్థానికులు బాలుడి తల్లిదండ్రులకు సమాచారం తెలియజేశారు. తల్లిదండ్రులు, బంధువులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాలుడి కోసం గాలించినప్పటికీ దొరకలేదు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు సూర్యదేవర నాగేశ్వరరావుకు సాయి సందీప్ మనవడని తెలిసింది.


సాయి సందీప్ (ఫైల్ ఫొటో)

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

లబ్బీపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛోత్సవం-స్వచ్ఛత హి సేవలో భాగంగా ఈట్ స్ట్రీట్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలు, పర్యావరణ హితమైన వస్తువులను ఎందుకు వాడాలి, తదితర అంశాలపై ఈట్‌స్ట్రీట్‌కు వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు.


ఘన వ్యర్థాల నిర్వహణలో పురపాలక సంస్థ కీలకం

● రీజనల్ డైరెక్టర్ చలపతిరాజ్

భారతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఘనవ్యర్థాల నిర్వహణలో పురపాలక సంస్థ ఎంతో కీలకమైనది, వీటి గురించి పూర్తిగా తెలుసుకుని పని చేస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చునని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ రీజనల్ డైరెక్టర్ చలపతిరాజ్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తాడిగడప, ఉయ్యూరు, కొండపల్లి పురపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, మేస్త్రీలకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమం మహానాడు రోడ్లోని పార్క్ ఎన్ హోటల్‌లో జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చలపతిరాజ్ మాట్లాడుతూ స్వచ్ఛ ఉయ్యూరు, స్వచ్ఛ తాడిగడప, స్వచ్ఛ కొండపల్లిగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణలో తడి, పొడి చెత్త వేరు చేయడంతో పాటు హానికరమైన ప్లాస్టిక్ వేస్ట్ నిర్వహణను తెలిపారు. బల్క్ వేస్ట్ జనరేటర్స్ ప్రాసెసింగ్, ప్రాసెసింగ్ టెక్నాలజీ విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ అధికారులు శివనారాయణ, డి. ఫణికుమార్, ప్రసన్న లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





రేలా రేలా రే...

- మంత్ర ముగ్ధుల్ని చేసిన మోహినీ భస్మాసుర యక్షగాన ప్రదర్శన
- ఉర్రూతలూగించిన జానపదాలు
- కనువిందుగా కూచిపూడి నృత్యాల ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన ప్రజలు

పవిత్ర సంగమాన్ని హోరెత్తించిన కళల విజయనర్తనం





ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పవిత్రసంగమంలో విజయనర్తనం హోరెత్తిస్తోంది. ఉత్సవాల రెండో రోజున యక్షగానాలు, జానపద నృత్యాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో పవిత్రసంగమం దద్దరిల్లింది. పవిత్ర సంగమం వేదికన చాన్నాళ్ల తర్వాత సంగీత ప్రదర్శనలు జరుగుతుండటంతో పొరుగున ఉన్న రాజధాని అమరావతి ప్రాంతాల ప్రజలతో పాటు, స్థానికంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పవిత్ర సంగమంలో గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ సంగీత ప్రదర్శనలను వీక్షించారు. కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయనర్తనం' ప్రేక్షకుల్ని ఆద్యంతం ఆనంద పరవశుల్ని చేసింది. బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవి బాలక్రిష్ణ బృందం ప్రదర్శించిన "మోహినీ భస్మాసుర" యక్షగానం ఆహూతలను మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్ల వర్షం కురిపించుకున్న ఈ ప్రదర్శన సాంస్కృతిక వాతావరణాన్ని మరింత పెంచింది.

జనరంజకంగా జానపదాల ప్రదర్శన

గుడివాడకు చెందిన యాదవల్లి వీరయ్య బృందం ఆలపించిన జానపద గానం శ్రోతలను ఉర్రూతలూగించింది. ఒకవైపు జానపదంతో ఇంకోవైపు హాస్యవల్లరితో ప్రేక్షకులకు కళావిందు చేశారు. రే లారె రేలా అడివితల్లికి దండాలు వంటి జానపదాలతో పాటు అమ్మవారి భక్తి గీతాలతో చిందులేస్తూ జానపద బృందం దుమ్ము లేపారు. నాట్యాచార్య చదలవాడ ఆనంద్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు రంజింపజేశాయి. 32 మంది విద్యార్థుల బృందంగా నర్తించి అలరించారు. 4 గంటల పాటు సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకుల్ని అలరించాయి. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి సంబంధించిన అన్ని రకాల కళలను కళాకారులను ప్రోత్సహిస్తూ విజయనర్తనం నిర్వహిస్తున్నామన్నారు. కమిషనర్ రమ్య కీర్తన కళాకారులకు జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందించారు.

విజయవాడలో కనువిందుగా కళావేదికలు

విజయవాడ ఉత్సవాల్లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా జరిగిన కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచెత్తాయి. అనుష నాయుడు బృందం ఐగిరి నందిని, నారాయణతే నమో నమో, అన్నమాచార్య సంకీర్తనలకు నర్తించారు. అనంతరం తుషార పూర్ణవల్లి విద్యార్థుల గాత్ర బృందం శ్రోతలను పరవశింపజేసింది. అనంతపురం నుంచి వచ్చిన సీ రాము బృందం ఉరుములు కళారూపం ఆకర్షణీయంగా సాగింది. కాకినాడకు చెందిన తోటా బాలకృష్ణ తోలు బొమ్మలాట ప్రదర్శనలో సుందరకాండ కథను వినిపించారు. విజయ్ కుమార్ కర్రసాము/కత్తిసాము నృత్యం ఆకట్టుకుంది. భూకైలాష్ ఉషోదయ నాటకమండలి, చెరుకూరు బృందం ప్రదర్శించిన ఈ ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల వేదికగా రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. నగరానికి చెందిన నాట్యాచార్యుడు కే వాసుదేవరావు బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను ఆకర్షించింది.

యాదవల్లి చిన్నారుల బృందం ఆలపించిన భక్తి కీర్తనలు అలరించాయి. శైలశ్రీ బృందం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలు, రాజరాజేశ్వరి అష్టకం, నవదుర్గలు, కామాక్షి స్తుతి, జయజయవైష్ణవి మైమరిపించాయి. చిన్నా, అబ్బులు బృందం సుందర కాండ కథను 8 మంది బృందంతో తోలుబొమ్మలాట ఆడించి అలరించారు. విజయ్‌కుమార్ బృందం కర్రసాము ప్రదర్శించగా, నగరానికి చెందిన ఎమ్మెస్ చౌదరి దర్శకత్వంలో ప్రపంచతంత్రం పేగు రాసిన శాసనం నాటిక ఆకట్టుకుంది.

విజయవాడ ఉత్సవ్‌లో
నేటి ప్రదర్శనలు

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 3వ రోజ బుధవారం విజయవాడ ఉత్సవ్ వేదికల్లో నిర్వాహకులు పలు కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమాలు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

పున్నమిఘాట్‌లో

సింగర్ గీతామాధురి లైవ్ మ్యూజిక్, శ్రీలేఖ బృందం శాస్త్రీయ ప్రదర్శన, దీప్తి బృందం మహాభారత ప్రదర్శన, గీత భక్తి ప్రదర్శన, కామాక్షి బృందం వయోలిన్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

ఘంటశాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

నగరానికి చెందిన జి.నీలవేణి శిష్య బృందం కథక్(సోలో), చిత్రా రామలక్ష్మీ వీణ వాయిద్యం, బి.సౌమ్య భరతనాట్యం, అనంతపురానికి చెందిన సి.రాములు ఉరుములు, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శనలు ఉన్నాయి.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

నగరానికి చెందిన డాక్టర్ అపర్ణ శిష్య బృందంతో కూచిపూడి నాట్యం, పామర్రు ప్రగతి ఇన్స్టిట్యూట్ వారు బృందావన చెక్క భజన, తెనాలికి చెందిన నాగమణితో హరికథ కార్యక్రమం, కాకినాడకు చెందిన తోట పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట, విముక్తి/పీపీలకం సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారు.

విజయవాడ ఎక్స్‌పో మరింత ఆలస్యం

- మరో రెండ్రోజులు పట్టే అవకాశం



గుడారం నిర్మాణం వద్ద పనులు చేస్తున్న కూలీలు

ఇబ్రహీంపట్నం: విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో విజయవాడ ఎక్స్‌పో పేరుతో నిర్వహించే ఎగ్జిబిషన్ ప్రారంభానికి మరో రెండ్రోజులు పట్టేలా ఉంది. ఈనెల 22న దసరా శరన్నవరాత్రుల ప్రారంభం రోజునే విజయవాడ ఎక్స్‌పో ప్రారంభం కావాల్సి ఉంది. అయితే భారీ వర్షాలతో మైదానం చిత్తడిగా మారడంతో ఏర్పాట్లు ముందుకు సాగలేదు. దీంతో పెద్ద ఎత్తున జీఎస్‌పీ తెప్పించి మైదానం మొత్తం చల్లించి పవర్ రోలర్‌తో చదును చేయిస్తున్నా అక్కడక్కడా మైదానంలో నీళ్లు నిలుస్తూనే ఉన్నాయి. వాటిని సెప్టిక్‌ట్యాంక్‌లతో తోడిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి రెండు గుడారాలు వేయగలిగారు. ఇక జెయింట్ వీల్స్ ఏర్పాట్లు పూర్తి కాలేదు. ఎక్కడ ఆట వస్తువులు అక్కడే ఉన్నాయి. వర్షం ఇలానే పడితే మాత్రం విజయవాడ ఎక్స్‌పో మరింత ఆలస్యం కావడం ఖాయం. పుష్కర కాలం తర్వాత గొల్లపూడిలోని దేవాలయ భూమిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విజయవాడ ఔన్నత్యాన్ని దేశం నలుమూలకు, ప్రపంచానికి తెలిసేలా చేయాలనుకుంది. ఇది గిట్టని కొందరు వ్యక్తులు దాన్ని రాజకీయం చేసి దొంగ సంతకాలతో కోర్టును ఆశ్రయించారు. దీంతో కొద్ది రోజులు పనులు ఆగిపోయాయి. సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చేసరికి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. ఏర్పాట్లు పూర్తయ్యి ఎక్స్‌పో ప్రారంభమయితే భక్తుల వాహనాలను పార్కింగ్ చేయడం పెద్ద సవాల్. ఎగ్జిబిషన్‌కు అర కిలో మీటర్ దూరంలోని ఓ ప్రైవేటు స్కూల్ మైదానంలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీ వాహనాలు నేరుగా ఎగ్జిబిషన్ మైదానంలో లోనికి వచ్చి బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బాలారిష్టాలన్నీ పూర్తి చేసుకొని ఎక్స్‌పో ప్రారంభమయ్యేందుకు మరి కొద్దిరోజులు ఆగాల్సిందే. ఎక్స్‌పో ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని నగర ప్రజలతో పాటు అనేక ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎగ్జిబిషన్ ప్రాంతానికి వచ్చి పనులు జరుగుతుండటం చూసి నిరాశగా వెనుతిరిగి వెళుతున్నారు.

ఉత్సవ్‌కు.. నేడు ఉప రాష్ట్రపతి రాక!

- పున్నమిలో నిర్వాహక కమిటీ ఏర్పాట్ల పరిశీలన
- పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు సైతం హాజరు
- 28న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, 29న కేంద్ర మంత్రి రామ్మోహన్ రాక
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎంపీ



ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా అధికారులు, పోలీసులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ ఉత్సవ్ విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. ఈ ఉత్సవంలో తదుపరి ఘట్టాలు ఎంతో ఆసక్తిగా, ఉత్సాహంగా ఉంటాయన్నారు. బుధవారం పున్నమిలో జరిగే కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీకే రాధాకృష్ణన్‌తో పాటు ఉత్సవాలకు పలువురు గవర్నర్లు, కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. ఈనెల 28న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, 29న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొంటారన్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ శివనాథ్ పలువురు నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల తర్వాత నగర వాసులు విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలను ఆస్వాదించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి..

ఇంద్రకీలాద్రి: విజయవాడలో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా బుధవారం నగరానికి విచ్చేస్తున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దుర్గగుడిలో కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. ప్రత్యేక సెక్యూరిటీ లైజన్ అధికారులు దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో కలిసి కొండపై తనిఖీలు నిర్వహించారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపరాష్ట్రపతికి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లతో పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన దర్శనానికి రానున్నారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అధికారులతో కలిసి కొండపై ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు.



తగ్గిన ధరతో వినియోగదారుడికి కారును అందజేస్తున్న మారుతీ సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి తదితరులు

జీఎస్టీ తగ్గడంతో అందుబాటులోకి మారుతీ కార్లు

- రాష్ట్రంలో వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తాం
- మారుతీ సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి వెల్లడి

కానూరు, ఆంధ్రజ్యోతి: జీఎస్టీ తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తమ కలలు సాకారం చేసుకునేందుకు మారుతి కార్లు అందుబాటులో ఉన్నాయని మారుతి సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి వెల్లడించారు. విజయవాడ కానూరులోని మారుతి సుజుకి డీలర్ సంతోష్ మారుతి షోరూమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త జీఎస్టీ 2.0 అమలుతో ఎంపిక చేసుకున్న కార్లపై కంపెనీ నుంచి సుమారుగా రూ. 1.29 లక్షల వరకు ధర తగ్గుతుందన్నారు. దేశంలో ఈ ఫర్ మీ విజన్‌తో కొత్త ఈవీ కార్ల శకం ప్రారంభమౌతోందని, రాష్ట్రంలో మారుతి సేల్స్ బాగున్నాయని, ఈవీ కార్లకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీలో తమ వ్యాపారాన్ని విస్తరిస్తామని, సేల్స్‌తోపాటు సర్వీస్‌కు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్లలో సేఫ్టీని మరింతగా పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మారుతీ సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుయోషి టకేషిత, సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ సురేష్ ఆకెళ్ల, శిరాషి టకహిరో పాల్గొన్నారు. ముగ్గురు కస్టమర్‌లకు తగ్గిన రేట్లతో కార్లను అతిథులు అందజేశారు. షోరూంలోని సర్టిఫైడ్ ప్రొఫెషనల్స్‌ను సత్కరించారు.

కాన్పు కోసం వచ్చి నిండు గర్భిణీ మృతి

జగ్గయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీతారాంపురంలో ఒక హాస్పిటల్‌కు నొప్పులతో వచ్చిన నిండు గర్భిణీ (25) సోమవారం మృతిచెందటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముక్త్యాల రోడ్డు ప్రాంతానికి చెందిన వివాహితకు సోమవారం ఇంటివద్ద నొప్పులు రావటంతో హాస్పిటల్‌కు తీసుకురాగా తీవ్ర టెన్షన్ గురై ఫిట్స్ వచ్చాయని, భర్త ముందే కౌన్సెలింగ్ ఇచ్చి కాన్పుకు ఏర్పాట్లు చేస్తుండగా మృతి చెందిందని ఆసుపత్రి వర్గాలు చెబుతుండా సరైన చికిత్స చేయకపోవటం వల్ల తల్లితో పాటు శిశువు కడుపులోనే చనిపోయిందని ఆందోళనకు దిగారు. ఎస్సై రాజు అక్కడికి వచ్చి ఇరు వర్గాలతో మాట్లాడారు. పరిహారానికి అంగీకరించటంతో వివాదం సద్దుమణిగింది.

వివాహిత పీక కోసిన లారీ క్లీనర్

విద్యాధరపురం: బాలభాస్కర్ నగర్‌కు చెందిన లారీక్లీనర్ అప్పారావు ఓ మహిళ (30)తో సహజీవనం చేస్తూ ఆమెతో గొడవపడి పీక కోసిన సంఘటన మంగళవారం రాత్రి ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో కలకలం రేపింది. బాధితురాలు గాయంతో పెద్దకేకలు వేసుకుంటూ రోడ్డులో పరుగులు తీసింది. భవానీపురం పోలీసులు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలించగా, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్సై తెలిపారు.

ఫైనాన్షియర్ వేధింపులకు ఆటోడ్రైవర్ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆటో ఫైనాన్షియర్ వేధింపుల కారణంగా మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమాను కోరడంతో పాటు తన మృతికి కారణమైన ఫైనాన్షియర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐని కోరుతూ సూసైడ్ నోట్‌ను రాశాడు. పసుపులేటి సుబ్బారావు (22) భార్యను, కొడుకును సోమవారం అత్తగారింటికి పంపించాడు. మంగళవారం ఉదయం ఫోన్లు ఎత్తకపోవడంతో స్నేహితులు తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా సుబ్బారావు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సూసైడ్ నోట్‌ను గమనించారు.

అందులో తన ఆత్మహత్యకు కారణం ఆటో ఫైనాన్స్ ఇచ్చిన సత్యనారాయణ అనే వ్యక్తి కారణమని, ఎమ్మెల్యే బొండా ఉమా తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నాడు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన ప్రదర్శన

సత్యనారాయణపురం: బావాజీపేట ఆటోఫైనాన్సర్ వేధింపులతో సుబ్బారావు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న టీఎన్‌టీయూసీ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్నా ఆధ్వర్యంలో బావాజీపేట ఫైనాన్స్ ఆఫీసు వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లు నిరసన ప్రదర్శన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. లెనిన్ సెంటర్ ఆటోయూనియన్ డ్రైవర్లతో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జెన్కో మొండి వైఖరి వీడాలి

- ఐదో రోజుకు చేరిన ఉచిత బూడిద రిలే నిరసన దీక్షలు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దీక్షాదారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థకు యాష్ పాండ్‌లోని బూడిదను అమ్ముకొని జెన్కో సంస్థ తమ పొట్ట కొట్టిందని తక్షణం టెండర్‌ను రద్దు చేసి ఉచితంగా బూడిద లోడింగ్ చేస్తామని హామీ ఇవ్వాలని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు సమీపంలో డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరసన దీక్షలు మంగళవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా యాష్ పాండ్ బూడిద అమ్ముకుంటే వచ్చే లాభం ఎంతో ఆ మొత్తం తానే చెల్లిస్తానని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చెప్పినా జెన్కో మొండి వైఖరిని వీడకపోవడం ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణం బూకటపు టెండర్‌ను రద్దు చేసి స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్యంపై మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే వసంత

డాక్టర్ ఎన్టీటీపీఎస్ వల్ల వెలువడుతున్న బూడిద కాలుష్యంపై దాని వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై బూడిదను కాంట్రాక్టుకు అప్పగించడం వల్ల స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు కలిగే నష్టంపై ఏపీ అసెంబ్లీలో మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అని ఎన్టీటీపీఎస్ కాలుష్య పోరాట సమితి అధ్యక్షుడు, జనసేన నేత చెరుకుమల్లి సురేష్ అన్నారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎన్టీటీపీఎస్ కాలుష్య కోరల్లో ఈప్రాంత ప్రజలు చిక్కుకొని విలవిల్లాడుతుంటే పట్టించుకున్న నాథుడు లేడన్నారు. ఇప్పుడు ప్రజల పక్షాన ఎమ్మెల్యే తన వాదనను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి ఎన్టీటీపీఎస్ వల్ల కలిగే అనర్థాలను తీసుకెళ్లారన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై స్పందించినందుకు సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ
అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ డిమాండ్

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బచావత్ ట్రిబ్యూనల్ తీర్పును ఉల్లంఘించి కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలు కృష్ణా నదిపై అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర జలశక్తి మంత్రికి, కేంద్ర జల సంఘానికి తక్షణం పంపాలని ఆలోచనాపరుల వేదిక నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మీరు ప్రాజెక్టులు నిర్మించుకోండి, మా ప్రాజెక్టులు మేము నిర్మించుకుంటామనే విధంగా ఉండే సీఎం చంద్రబాబు వైఖరితో రాష్ట్రానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ. 5వేల కోట్లు అవసరం కాగా, మొదటి దశ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన రూ.1500 కోట్లు ప్రభుత్వం వద్ద లేవన్నారు. అక్కినేని భవానీప్రసాద్, టి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీస్టాల్ ముసుగులో భారీ దోపిడీ


జగ్గయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీస్టాల్ ముసుగులో భారీ దోపిడికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను తెలంగాణ పోలీసులు జగ్గయ్య పేట వైఎస్సార్ సర్కిల్‌లో మంగళవారం అరెస్టు చేయటం కలకలం సృష్టించింది. రెండు రోజులుగా జగ్గయ్యపేటలో మకాం వేసిన మిర్యాలగూడ పోలీసులు విశ్వసనీయ సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దుర్గాపురం రోడ్డులోని ఇంట్లో గొయ్యి తీసి దాచిన నగదు బ్యాగ్‌ను, వాహనాన్ని, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 5న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో వైష్ణవి గ్రాండ్ రెస్టారెంట్‌లో రూ.80 లక్షల నగదు దోపిడీ జరిగింది. ఆ దోపిడీలో సూత్రధారులుగా ఉన్న రాజస్థాన్ రాష్ట్రం జూలూరు జిల్లా కోర్కా గ్రామానికి చెందిన మహ్మద్‌రహీంఖాన్, పోవ్రావు గ్రామానికి చెందిన ఇక్బాల్‌ఖాన్, జగ్గయ్యపేటకు చెందిన లాలు ఖాన్‌ను జగ్గయ్యపేటలో పక్కా ప్లాన్ వేసి పట్టుకున్నారు. దోచుకున్న మొత్తాన్ని ఖర్చులకు కొంత పంచుకుని, రూ66.50 లక్షలను బ్యాగులో ఉంచి ఇంట్లో భూమి లోపల గుంత తీసి దాచిపెట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వల పని పట్టుకున్నారు.

శ్లాబుల నుంచి కారుతున్న నీరు

సత్యనారాయణపురం: కనకదుర్గానగర్ మహామండపం ఎదురుగా అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో మూడు ప్రాంతాల్లో శ్లాబ్‌ల నుంచి నీరు కారుతుంది. దీంతో భక్తులు అన్న ప్రసాదం తీసుకోనేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ప్రాంగణం బురదగా మారడంతో పారిశుధ్య సిబ్బంది నీటిని పక్కకు తోడాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరతున్నారు. అలాగే నిత్యం వేలాది మంది అమ్మవారి దర్శనానంతరం అన్నప్రసాదం తీసుకుంటారు. తర్వాత చేతులు కడుక్కోవాలంటే పెద్ద ప్రహసనంగా మారింది. చేతులు కడుక్కునేందుకు పంపులు చివరన ఏర్పాటు చేశారు. అవికూడా కేవలం 10 నుంచి 12 మాత్రమే. మరోవైపున కూడా పంపులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.అన్నప్రసాదం అనంతరం భక్తులు తాగేందుకు మిగిలిన ప్రాంతాల్లో దేవస్థానం అఫ్ లీటర్ వాటర్ బాటిళ్లు ఇస్తున్నారు. ఇక్కడ మాత్రం కేవలం వాటర్ ప్యాకెట్‌లు మాత్రమే ఇస్తున్నారు. అన్నప్రసాద ప్రాంగణంలో వాటర్ ప్యాకెట్ల బస్తాలే చాలా వరకూ ఆక్రమిస్తున్నాయి.

25న బహిరంగ సభను జయప్రదం చేయండి: యూటీఎఫ్

పాయకాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న గుంటూరులో జరగనున్న రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తవుతున్నా సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎన్టీటీపీఎస్ కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న రామినేని రాజశేఖర్

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో దీర్ఘకాలికంగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా వారి సమస్యలను, డిమాండ్లను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ) అన్నారు. మంగళవారం ఆయన రిలే దీక్షలో ఉన్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంలో అంతర్భాగమైన టీఎన్‌టీయుసీ అసోసియేషన్ ద్వారా తలపెట్టిన ఈ నిరసన దీక్షతో కార్మికులకు మేలు తప్పక జరుగుతుందన్నారు. యూనియన్ నేతలు పర్వతనేని సాంబశివరావు, ఆలపాటి శివనాగేశ్వరరావు, వెలగపూడి శివరామకృష్ణ, దర్శనపు స్వతంత్ర కుమార్, మందడపు దుర్గారావు, బీజేపీ నేత టీ మాధురి, భవాని, బొర్రా ప్రవీణ్ పాల్గొన్నారు.

అక్షర సైనికురాలు



కశ్మీర్ లోయల్లో... ఎముకలు కొరికే చలిలో గస్తీ కాస్తూనే ఉపాధ్యాయురాలు కావాలనే తన లక్ష్యం కోసం గురి తప్పని సాధన కొనసాగించింది. తాజా డీఎస్సీలో మంచి ర్యాంకుతో ఎస్‌జీటీ టీచర్‌గా ఎంపికైంది. తుపాకీ పట్టిన చేత్తోనే బలపం పట్టి భావి పౌరుల్ని తయారు చేయడానికి సిద్ధమవుతోంది. చిత్తూరు జిల్లా గొడుగుమానుపల్లె గ్రామానికి చెందిన రోజా తన ప్రయాణం గురించి 'నవ్య'తో పంచుకుంది.



"చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే లక్ష్యంతో చదువుకున్నా. ఇంటర్, 'డైట్' శిక్షణ పెనుమూరులో, డిగ్రీ చిత్తూరులో పూర్తి చేశాను. మేము ముగ్గురం ఆడపిల్లలం. నేను చిన్నదాన్ని. మా తల్లిదండ్రులు సుబ్బలక్ష్మి, జగన్నాథరెడ్డి ఆడపిల్లలనే వివక్ష లేకుండా మమ్మల్ని చూడకుండా అన్ని విధాలా ప్రోత్సహించారు. మా తమ్ముడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పెద్ద అక్క అంగన్వాడీ వర్కర్. చిన్నక్క 2018లో టీచర్ ఉద్యోగం సాధించింది. నేను 2018 డీఎస్సీలో అక్కతో పాటు ఎంపిక అవ్వాల్సి ఉండగా, తృటిలో తప్పింది. 2018 డీఎస్సీ తర్వాత చాలా ఏళ్ల మళ్లీ నోటిఫికేషన్ పడలేదు. దీంతో 2022లో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి, ఎంపికయ్యాను. దేశం నలుమూలల నుంచి సుమారు 600 మంది అమ్మాయిలం పంజాబ్‌లో 11 నెలల పాటు శిక్షణ తీసుకున్నాం. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లో పని చేశాను. ప్రస్తుతం జమ్మూలోని 15 బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాను.

12 గంటలు డ్యూటీ చేస్తూనే చదువుకున్నా...

జమ్మూలోని మా బెటాలియన్‌లో మొత్తం 1,200 మంది సైనికులు ఉండగా, 80 మంది అమ్మాయిలం. పగలు ఆరు గంటలు, రాత్రి ఆరు గంటలు డ్యూటీ చేయాలి. ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో... పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. 2022కు ముందు అవనిగడ్డలో మూడు నెలల పాటు టీచర్ ఉద్యోగానికి శిక్షణ తీసుకున్నాను. ఆ పుస్తకాలు తీసుకెళ్లి, సరిహద్దుల్లో చదువుకున్నాను. రోజూ పన్నెండు గంటల పాటు ఉద్యోగం చేస్తూ చదువుకోవడం బాగా ఇబ్బంది అనిపించేది. అయినా నా ఆశయం కోసం అన్ని విధాలా సిద్ధమయ్యాను. 'టెట్'లో 150కు 138 మార్కులు, తుది పరీక్ష అయిన డీఎస్సీ ఫలితాల్లో వందకు 83.16 మార్కులు వచ్చాయి. ఈసారి చిత్తూరు జిల్లాలో ఓసీలకు 79 మార్కులకు కటాఫ్ విధించారు. నేను ఉత్తమ ర్యాంకుతో ఎస్‌జీటీ టీచర్‌గా ఎంపికయ్యాను. ఈ విషయంలో నా ఇద్దరు అక్కలు నాకు అందించిన సహకారం మరువలేనిది. సరిహద్దుల్లో దేశం కోసం కాపలా కాస్తున్న నేను... తరగతి గదిలో అక్షర సైనికుల్ని తయారు చేయడానికి ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టబోతున్నాను. ఏడేళ్ల కిందట ఉపాధ్యాయ పోస్టు గురి తప్పినా, ఇప్పుడు నా శ్రమ ఫలించడం ఎంతో సంతోషంగా ఉంది."

● కరీముల్లా షేక్
చిత్తూరు.

ఉక్కు మహిళ

ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్... ప్రపంచంలో అత్యంత కఠినమైన క్రీడాంశాల్లో ఒకటైన దీనిలో పాల్గొనడం, పూర్తి చేయడం ఎందరో అథ్లెట్ల కల. దాన్ని రెండుసార్లు విజయవంతంగా పూర్తిచేసి... మన దేశంలో పిన్నవయస్కురాలైన మహిళా 'ఐరన్‌మ్యాన్'గా చరిత్రకెక్కింది 19 ఏళ్ల రీనీ నోరోన్హా. వచ్చేనెలలో జరిగే 'వరల్డ్ ఛాంపియన్‌షిప్'కు అర్హత సాధించిన రీనీ... సవాళ్లను అధిగమించడంలోనే అసలైన ఆనందం ఉందంటోంది.

"ట్రయథ్లాన్‌లో పాల్గొంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు. జిమ్నాస్టిక్స్ అంటే నాకు ఆసక్తి. అయిదేళ్ళ వయసు నుంచి అదే నా లోకం. ప్రొఫెషనల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్‌గా మారిన తరువాత... కొత్తగా ఏదైనా ప్రయత్నించాలనే ఆలోచనతో రన్నింగ్ అభ్యాసం చేశాను. క్రమంగా ట్రయథ్లాన్ పట్ల ఆసక్తి పెరిగింది. సైక్లింగ్, స్విమ్మింగ్ కూడా మొదలుపెట్టాను. అప్పుడే శంకర్ అనే కోచ్ పరిచయమయ్యారు. ఆయన 'ఐరన్‌మ్యాన్' పోటీల గురించి చెబుతూ... వాటిలో పాల్గొనాలంటూ నన్ను ప్రోత్సహించారు. గోవాలో జరిగిన 'ఐరన్‌మ్యాన్ కిడ్స్' ఈవెంట్‌లో పాల్గొని మా గ్రూప్‌లో మొదటి స్థానంలో నిలిచాను. అది నాలో ఉత్సాహం నింపింది. దాంతో 'ఒలింపిక్-డిస్టెన్స్ ట్రయథ్లాన్'లో నా సత్తా చాటాలని నిర్ణయించుకున్నాను.



నిగ్గు తేల్చే పరీక్ష

'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్' అనేది చాలామందికి అంతగా పరిచయం లేని అంశం. ఇది కేవలం ఒక రేస్ కాదు. సవాళ్ళు ఎదురైనప్పుడు కలిగే మనం ఎంత వరకూ తట్టుకోగలమో నిగ్గు తేల్చే ఒక పరీక్ష. 3.8 కిలోమీటర్ల ఓపెన్ వాటర్ స్విమ్మింగ్, 180 కిలోమీటర్ల బైక్ రైడ్, 42.2 కిలోమీటర్ల మారథాన్ రన్... ఈ మూడింటి సమ్మేళనం ఈ పోటీ. నిర్ణీత సమయంలో అమన్నీ పూర్తి చేయాలి. అందుకు కేవలం శరీర దారుఢ్యం చాలదు, అపారమైన మానసిక బలం కూడా అవసరం. అదృష్టవశాత్తూ... ఎన్నో ఏళ్ళ నా జిమ్నాస్టిక్స్ నేపథ్యం ద్వారా... క్రమశిక్షణ, చురుకుదనం, నిలకడగా రాణించడం అలవాటయ్యాయి. దీర్ఘకాలిక లక్ష్యాల కోసం నిబద్ధతతో ఎలా పని చేయాలో, లోపాలను ఎలా సరిదిద్దుకోవాలో నేర్చుకున్నాను. ట్రయథ్లాన్ వైపు మళ్ళినప్పుడు ఇవన్నీ ఉపయోగపడ్డాయి. ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌కు సన్నద్ధత కోసం మొత్తం మూడు విభాగాల్లో శిక్షణ కోసం వారానికి ఇరవై గంటలకు పైగా కేటాయించాను. పోషకాహారం, సరైన నిద్ర, ఫిజియోథెరపీ... ఇవన్నీ నా శరీరం దృఢంగా ఉండడానికి దోహదం చేశాయి. ఇక మానసిక ఒత్తిడిని అధిగమించడం కోసం మొదట్లో చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకున్నాను. వాటిని అధిగమించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంచుకున్నాను. ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేశాను. అన్నిటికన్నా ప్రధానంగా... నా కుటుంబం, కోచ్, టీమ్ సభ్యులు అండగా నిలిచి ప్రోత్సహించారు.

వారికోసం ఎన్జీవో ప్రారంభిస్తా...

న్యూజిలాండ్‌లో 2023లో తొలిసారిగా 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్'లో పాల్గొన్నాను. అప్పుడు నా వయసు 18 ఏళ్ళ 49 రోజులు. మొత్తం మూడు అంశాలనూ పదిహేడు గంటలలోగా పూర్తి చేయాలి. నేను సుమారు పదహారున్నర గంటలలో ముగించాను. అది పూర్తి చేసిన అతి పిన్నవయస్కురాలైన భారతీయురాలిగా నిలిచాను. కానీ ఏదో వెలితి. 'ఇంకా వేగంగా పూర్తి చేయగలను కదా!' అనిపించింది. మరింత కఠినంగా సాధన సాగించాను. ఈ ఏడాది జులైలో జర్మనీలో జరిగిన 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్'లో కేవలం పద్నాలుగు గంటల్లోనే మూడు ఈవెంట్లనూ పూర్తి చెయ్యగలిగాను. అంటే మునుపటికన్నా సుమారు రెండున్నర గంటల ముందుగానే. అందరూ నన్ను చూసి 'ఐరన్‌మ్యాన్' అని అరుస్తూ ఉంటే నా సంతోషానికి హద్దుల్లేవు. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, వాటిని సాధించడానికి కృషి చేయడానికి ఈ విజయం నాకు మరింత ప్రేరణ ఇచ్చింది. ప్రస్తుతం నేను చెన్నై ఐఐటీలో డేటా సైన్స్ అప్లికేషన్స్‌లో డిగ్రీ చదువుతున్నాను. అలాగే లండన్‌లోని కార్లటన్ కాలేజీ నుంచి స్పోర్ట్స్ సైన్స్ డిప్లమా కూడా చేస్తున్నాను. చదువును, ట్రయథ్లాన్ శిక్షణను బ్యాలెన్స్ చేసుకోవడం కష్టమే. దీనికి నా కుటుంబం ఎంతో సహకరిస్తోంది.

ప్రతి ఖండంలోనూ 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్' పూర్తి చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది అక్టోబర్‌లో అమెరికాలో జరిగే 'ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్'కు అర్హత సాధించాను. దానికి ప్రస్తుతం సిద్ధమవుతున్నాను. వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల క్రీడలకు దూరమవుతున్న యువ అథ్లెట్లకు, ముఖ్యంగా బాలికలకు సాయపడడం కోసం ఒక ఎన్జీవో ప్రారంభించాలనేది నా ఆశయం."

ఫ్యాషన్

నవరత్నాల్లో వజ్రాలదే పైచేయి అనుకుంటాం. కానీ ఇది ఒకప్పటి మాట. నేడు ప్రముఖులందరూ పచ్చలకే పెద్ద పీట వేస్తున్నారు. నీతా అంబానీ మొదలు ప్రముఖ బాలీవుడ్ తారలెంతోమంది పసందైన పచ్చల నెక్లెస్‌ల మీదే మనసు పడిపోతున్నారు. వాటి మీద ఓ లుక్కేద్దాం!

పసందైన పచ్చలు



అనంత్ అంబానీ, రాధా మర్చంట్‌ల ప్రి వెడ్డింగ్ వేడుకలకు హాజరైన నీతా అంబానీ, విలాసవంతమైన పచ్చల నెక్లెస్ ధరించారు. వీటికి జోడీగా వజ్రాల ఇయర్ రింగ్స్, వజ్రాలు, పచ్చలతో తయారైన గాజులు ధరించారామె. పచ్చలు, వజ్రాలు పొదిగిన ఆ నెక్లెస్ అక్షరాలా 500 కోట్ల విలువ ఉంటుందని ఒక అంచనా! ఈ సందర్భంలోనే కాదు, పలు సందర్భాల్లో నీతా అంబానీ పచ్చల నగలకే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రియాంకా చోప్రా, ఇషా అంబానీలు కూడా పలు సందర్భాల్లో పచ్చల్లో మెరిసిపోయారు.



జాతిరాళ్లను జోడించి...

పాతకాలపు ఆభరణాల శైలిని ఇష్టపడేవారి కోసం, పచ్చల విక్టోరియన్ పెండెంట్స్ కూడా ఇప్పుడు తయారవుతున్నాయి. అలాగే స్టేట్‌మెంట్ జ్యువెలరీని ఇష్టపడేవారి కోసం పన్నా స్టోన్ ఆభరణాలు రూపొందుతున్నాయి. వీటిలో భాగంగా అతి పెద్ద పచ్చతో తయారయ్యే ఉంగరాలు లేదా బ్రేస్‌లెట్స్ రూపొందుతున్నాయి. అలాగే తాజాగా పచ్చలకు గోమేధికాలు, పగడాలు మొదలైన ఇతర జాతిరాళ్లను జత చేసి ఆభరణాలను రూపొందిస్తున్నారు. వినూత్నంగా కనిపించాలనుకునేవాళ్లు ఇలాంటి నగలను ఎంచుకోవచ్చు.

భిన్నమైన సెట్టింగ్స్‌తో...

భిన్నమైన శైలుల్లో తయారయ్యే ఆభరణాల్లో పచ్చల వినియోగం బాగా పెరిగింది. ఆధునికత ఉట్టిపడే బేజెల్ సెట్టింగ్స్‌లో, సంప్రదాయం ఉట్టిపడే ప్రాంగ్ సెట్టింగ్‌లో పచ్చల ఆభరణాలు రూపొందుతున్నాయి. హుందాతనాన్ని, ఆధునికత కలగలసిన సంప్రదాయాన్నీ నగలకు జోడించాలనుకుంటే వాటిలో పచ్చలు పొదిగి ఉండేలా చూసుకోవాలి.

వీరికి మట్టితో పనిలేదు

వినూత్నం

మొక్కల మీద మక్కువ కలిగిన ఇద్దరు మహిళలు, పందిరి సేద్యంతో ఆకుకూరలను విస్తారంగా పండిస్తూ అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నారు. హైడ్రోపోనిక్ పద్ధతిలో ఇసుక, కంకర, నీళ్లను ఉపయోగిస్తూ గ్రీన్‌కోపియా ఫామ్స్‌ను స్థాపించే స్థాయికి ఎదిగిన, కేరళకు చెందిన అశ్వంతి, జిషాల ఆసక్తికరమైన ప్రస్థానం గురించి తెలుసుకుందాం!

స్నేహితులైన అశ్వంతి, జిష. ఎర్నాకులంలో సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్‌ను నడిపిస్తున్నారు. విజయవంతంగా సాగుతున్న కోచింగ్ సెంటర్, కొవిడ్ సమయంలో మూతపడడంతో వాళ్లిద్దరూ ఆన్‌లైన్ తరగతులకే పరిమితం కావలసి వచ్చింది. ఆ తరగతులు సంతృప్తిని ఇవ్వలేకపోవడంతో, కొత్తగా ఏదైనా వ్యాపారంలోకి ప్రవేశించాలని వాళ్లిద్దరూ భావించారు. "కొత్త ప్రాజెక్ట్ అనగానే మాకు వ్యవసాయమే గుర్తొచ్చింది. నిజానికి వ్యవసాయం సులభతరమైన ఆదాయ మార్గం కాదు. కానీ దానికి ఆధునిక కోణాన్ని జోడించి, సాంకేతికతను ఆవిష్కరించి, దానికి తగ్గట్టు నడుచుకోగలిగితే కచ్చితంగా విజయం సాధించవచ్చు. ఈ ఆలోచనతో మేమిద్దరం వ్యవసాయాన్ని ఎంచుకున్నాం" అంటూ చెప్పుకొస్తున్నారు బీటెక్ చదివిన అశ్వంతి, సోషల్ వర్క్‌లో మాస్టర్స్ చేసిన జిష. ఆ క్రమంలో మట్టితో పని లేకుండా కేవలం కంకర, ఇసుక, నీళ్లను ఉపయోగించి సాగు చేసే హైడ్రోపోనిక్ వ్యవసాయ విధానాన్ని ఎంచుకున్నారు. మొక్కల పెంపకం కోసం ఒక చిన్న స్థలాన్ని లీజుకు తీసుకుని, గ్రీన్‌కోపియా ఫామ్స్‌ను స్థాపించి, దాన్లో లెట్యూస్, కేల్, సెలరీ లాంటి మూలికా మొక్కలు, మైక్రోగ్రీన్స్... ఇలా ఏకంగా 15 రకాల ఆకుకూర మొక్కలను సాగు చేయడం మొదలుపెట్టారు.

పురుగుమందులు వాడని పంటలు

చేస్తున్నది తొలి వ్యాపారం. కాబట్టి ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించుకున్న అశ్వంతి, జిషలు మొక్కల కోసం ఎంచుకునే విత్తనాల పట్ల కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించారు. అధునాతన హైడ్రోపోనిక్ పరిశోధనకు కేంద్రమైన ఇజ్రాయెల్ నుంచి విత్తనాలు సేకరించారు. ఆ విత్తనాలు మొలకెత్తే సమయం కూడా భిన్నంగా ఉంటుంది. లెట్యూస్ విత్తనాలు రెండు రోజులకే మొలకెత్తితే, సెలరీ విత్తనాలు మొలకెత్తడానికి రెండు వారాల సమయం పడుతుంది. మొలకెత్తిన తర్వాత, వాటి వేర్లను బలపరచడం కోసం పోషకాలను అందించారు. విదేశీ పంటల మార్కెట్ విలువ ఎంతో ఎక్కువగా ఉంటుంది. పంటలన్నీ నాలుగు నుంచి ఆరు వారాల్లోగా చేతికందుతాయి. ఆ తర్వాత, ప్రతి వారం వాటిని కోసుకుని, విక్రయించుకోవచ్చు. పైగా ఒక్కొక్క బెడ్ నుంచి 15 కిలోల పంట చేతికందుతూ ఉండడంతో ఆ స్నేహితులిద్దరి



ఆనందానికి అవధులే లేకుండా పోయాయి. "ఊటీ, మున్నార్, బెంగుళూరుల నుంచి లెట్యూస్ కొచ్చికి చేరుకుంటూ ఉంటుంది. కిలో వంద రూపాయల ధర పలికే ఈ లెట్యూస్‌ల పెంపకంలో పురుగుమందులను భారీగా ఉపయోగిస్తారు. అయినా హోటళ్లు, రెస్టారెంట్లకు వాటిని కొనడం తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. నిజానికి బహిరంగ ప్రదేశాల్లో చీడపీడలు లేకుండా ఈ మొక్కలను పెంచడం చాలా కష్టం. అయినా మేం ఆ బెడద లేకుండా ఎన్నో జాగ్రత్తలు పాటించి, పురుగుమందులు ఉపయోగించని లెట్యూస్‌ను పెంచగలిగాం. దాంతో మా లెట్యూస్‌కు గిరాకీ పెరిగింది. నేరుగా కొనుక్కునేవాళ్లు మా లెట్యూస్‌ను కిలోకు 450 రూపాయలు చెల్లిస్తున్నారు. రెస్టారెంట్లు కిలోకు 390 రూపాయలు చెల్లిస్తున్నాయి. అలాగే రకరకాల లెట్యూస్‌లకు, మూలికలు, మైక్రోగ్రీన్స్‌ను జోడించిన రెడీ టు ఈట్ సలాడ్స్ మా ఫామ్స్‌లో విపరీతంగా అమ్ముడవుతూ ఉంటాయి. పురుగుమందుల వాడకానికి మేం దూరంగా ఉండడమే, మా ఉత్పత్తులకు గిరాకీ పెరగడానికి ప్రధాన కారణం" అంటూ తమ ఉత్పత్తుల విజయ రహస్యాన్ని వివరించారు అశ్వంతి, జిష.

నీటి ద్వారా పోషకాలను అందిస్తూ...

హైడ్రోపోనిక్ ఫార్మింగ్ ప్రత్యేకత, ప్రయోజనాల గురించి వివరిస్తూ... "సంప్రదాయ సేద్యంతో రైతులు ఒకే ప్రదేశానికి పరిమితమైపోతూ ఉంటారు. వాతావరణ మార్పులు, రుతువులు, తెగుళ్లు.. ఇలా పంట దిగుబడి పలు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకే ఒక్క పొరపాటు రైతు శ్రమనంతటినీ తుడిచిపెట్టేస్తుంది. కానీ హైడ్రోపోనిక్స్‌కు ఈ బెడద ఉండదు. మొక్కలు మట్టికి బదులుగా నీటిలో పెరుగుతాయి. దాంతో మొక్కలకు పోషకాలు నేరుగా అందుతాయి. అవే నీటికి మేం పదే పదే పోషకాలు జోడించి వాడుకుంటూ ఉంటాం. కాబట్టి మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎదుగుతాయి" అంటూ వివరించిన ఈ స్నేహితురాళ్లు హైడ్రోపోనిక్ ఫామింగ్‌ను సుస్థిరమైన, ప్రయోజనకరమైన వ్యవసాయంగా విస్తరించడాన్నే లక్ష్యంగా పెట్టుకున్నారు.

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం
శ్రీ అన్నపూర్ణాదేవి

ఆశ్వయుజ శుద్ధ తదియ, బుధవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజున శ్రీ అన్నపూర్ణాదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. శ్రీ అన్నపూర్ణాదేవి అన్నాన్ని ప్రసాదించే మాతృమూర్తి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం సర్వజీవనాధారం. అన్నం లేనిదే జీవులకు మనుగడలేదు. అన్నపూర్ణాదేవి సాక్షాత్తూ శివ స్వరూపిణి, ఈశ్వరుడికి భిక్షపెట్టిన దేవత. ఈ తల్లిని ధ్యానిస్తే ధన, ధాన్య వృద్ధి, మధుర భాషణం, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయని పెద్దలు చెబుతారు. అన్నపూర్ణాదేవి ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుందంటారు. ఆమెను కుంకుమతో పూజించాలి. జ్ఞానభిక్ష పెట్టాలని, వైరాగ్యం కలగజేయాలని కోరుకోవాలి. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించిన వారికి మేధాశక్తి కలుగుతుందని భక్తుల నమ్మిక.

నైవేద్యం :
కట్టె పొంగలి, పరమాన్నం
అలంకరించే చీర రంగు :
ఎరుపు
అర్చించే పూల రంగు:
తెలుపు
పారాయణ చెయ్యాల్సినవి:
అన్నపూర్ణాష్టకం, స్తోత్రాలు

పిల్లలకు ఇవి తినిపిస్తే..

పెరిగే పిల్లలకు పోషకాహారం తినిపించడం అత్యవసరం. శారీరక, మానసిక ఎదుగుదలతోపాటు పిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంచే ఆహారం గురించి తెలుసుకుందాం...

- పాలకూర, తోటకూర, బచ్చలి కూరల్లో మెదడు కణాలను వృద్ధి చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫోలేట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆకుకూరలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- బ్లూ బెర్రీ, స్ట్రాబెర్రీ, క్రాన్ బెర్రీ, యాపిల్ పండ్లను తినిపిస్తే పిల్లల్లో మెదడు పనితీరు వేగవంతమవుతుంది. చదివిన అంశాలన్నింటినీ పిల్లలు చక్కగా గుర్తుపెట్టుకోగలుగుతారు.
- బాదం, వాల్‌నట్స్, పిస్తా, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజలను తినిపిస్తే వాటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటి ఆవశ్యక పోషకాలు జ్ఞాపకశక్తి పెరగడానికి దోహదం చేస్తాయి. రోజుకు ఒక కోడిగుడ్డు తినిపించినా ఫలితం ఉంటుంది.
- రాజ్మా, పల్లీలు, శనగల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, జింక్ ఎక్కువగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చడం వల్ల పిల్లలకు గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- మాకెరెల్, సాల్మోన్, ట్యూనా, సార్డైన్స్ లాంటి చేపలను తినిపిస్తే పిల్లల మెదడు చురుకుగా మారుతుంది. విషయాలను త్వరగా గ్రహించి ఎక్కువ కాలం గుర్తుండేలా చేస్తుంది.
- పాలు, పెరుగు, యోగర్ట్, చీజ్ లాంటి పాల ఉత్పత్తుల్లో 'బి' విటమిన్ రకాలు ఎన్నో ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. దీంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి బలపడుతుంది. పిల్లలకు తరచూ డార్క్ చాక్లెట్ తినిపించినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.





కొడితే.. ఫైనల్‌కే!

నేడు బంగ్లాతో భారత్ మ్యాచ్

రాత్రి 8 గం. నుంచి
సోనీ నెట్‌వర్క్‌లో

ఆసియాకప్

దుబాయ్: ఆసియాకప్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియా ఇక ఫైనల్‌పై దృష్టి సారించింది. సూపర్-4లో భాగంగా బుధవారం తమ రెండో మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాక్‌ను చిత్తు చేసిన సూర్యకుమార్ సేన ఈ పోరులో గెలిస్తే ఫైనల్లో చోటు ఖాయమే. అటు బంగ్లా కూడా శ్రీలంకపై విజయంతో ఆత్మవిశ్వాసంతోనే ఉంది. కానీ గణాంకాలను పరిశీలిస్తే టీమిండియాకు ఇది కూడా ఏకపక్ష మ్యాచ్‌గానే పరిగణించవచ్చు. ఎందుకంటే బంగ్లాతో ఆడిన 17 టీ20ల్లో కేవలం ఒక్కసారి మాత్రమే ఓడింది. అయితే 2015 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ వివాదాస్పద నాటౌట్ తర్వాత ఇరు జట్ల మధ్య అంతగా సత్సంబంధాలు లేవు. భారత్‌తో ఆడినప్పుడు పాక్ మాదిరే బంగ్లా ఆటగాళ్లలోనూ కసి కనిపిస్తుంటుంది. అక్కడి అభిమానులు కూడా భారత జట్టును పోటాపోటీ ప్రత్యర్థిగా భావిస్తుంటారు. దీనికి తోడు మాజీ ప్రధాని హసీనాకు ఆశ్రయం ఇవ్వడంతో దౌత్యపరంగానూ రెండు దేశాల మధ్య ఇబ్బందులున్నాయి. అందుకే ఆగస్టులో బంగ్లాతో జరగాల్సిన వన్డే సిరీస్‌ను కూడా బీసీసీఐ వాయిదా వేసుకుంది. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య పోరు కూడా ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. అయితే ఏ విభాగంలో చూసినా ప్రత్యర్థికన్నా భారత జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. ఓపెనర్లు అభిషేక్, గిల్ మెరుపు ఇన్నింగ్స్‌తో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నారు. కెప్టెన్ సూర్య క్రీజులో నిలదొక్కుకుంటే భారీ స్కోరు ఖాయమే. అటు శాంసన్, హార్దిక్, దూబే స్థాయికి తగ్గట్టు ఆడాల్సి ఉంది. అలాగే తిలక్.. స్పిన్‌ను ఎదుర్కోవడంలో కాస్త ఇబ్బందిపడుతున్నాడు. ఈ ఏడాది స్పిన్నర్ల ద్వారా ఎదుర్కొన్న 80 బంతుల్లో అతడు 92 పరుగులు మాత్రమే సాధించాడు. బౌలింగ్‌లో బుమ్రా బంతుల్లో పదును తగ్గడం ఆందోళనకరమే అయినా దూబే, హార్దిక్ అండగా ఉంటున్నారు. స్పిన్‌లో కుల్దీప్, వరుణ్, అక్షర్ మరోసారి కీలకం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

బంగ్లాదేశ్: సైఫ్ హసన్, తన్‌జీద్ హసన్, లిట్టన్ దాస్ (కెప్టెన్), తౌహీద్ హ్రిదయ్, షమీమ్, జకెర్ అలీ, మెహదీ హసన్, నసూమ్ అహ్మద్, టస్కిన్ అహ్మద్, తన్‌జీమ్ హసన్, ముస్తాఫిజుర్.

లిట్టన్, హ్రిదయ్‌పై ఆశలు


లిట్టన్

గత రికార్డులు ఎలా ఉన్నా భారత్‌ను ఓడించగల సత్తా తమ జట్టుకు ఉందని బంగ్లాదేశ్ కోచ్ సిమన్స్ అంటున్నాడు. అయితే ఈ జట్టు ఎక్కువగా కెప్టెన్ లిట్టన్ దాస్, తౌహీద్ హ్రిదయ్‌ల బ్యాటింగ్‌పై ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రిషాద్ హొస్సేన్, మెహదీ హసన్‌లతో పాటు డెత్ ఓవర్లలో పేసర్ ముస్తాఫిజుర్ ద్వారా కట్టడి చేయాలనుకుంటోంది. బంగ్లా *150-160* పరుగులను సులువుగానే ఛేదించగలుగుతోంది.

పాక్.. రేసులోనే

శ్రీలంకపై విజయం


తలత్ (32 నాటౌట్)

అబుధాబి: ఆసియాకప్ సూపర్-4లో పాకిస్థాన్ కీలక విజయం అందుకుంది. ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకపై కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లంక బౌలర్లు ఆఖరి వరకు కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. అయితే మహ్మద్ నవాజ్ (38 నాటౌట్), హుస్సేన్ తలత్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఈ ఓటమితో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక దాదాపుగా నిష్క్రమించినట్టే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేసింది. కమిందు మెండిస్ (50), అసలంక (20) మాత్రమే రాణించారు. షహీన్‌కు మూడు.. తలత్, రౌఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. పాక్ పేసర్ల జోరుకు పవర్ ప్లేలోనే టాప్-3 బ్యాటర్లు పెవిలియన్‌కు చేరారు. అయితే కమిందు ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపిగ్గా క్రీజులో నిలిచి అర్ధసెంచరీ సాధించాడు. ఏడో వికెట్‌కు కరుణరత్నె (17 నాటౌట్)తో కలిసి 43 పరుగులు జత చేశాడు. ఆ తర్వాత ఛేదనలో పాక్ 18 ఓవర్లలో 5 వికెట్లకు 138 పరుగులు చేసి గెలిచింది. తీక్షణ, హసరంగలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హుస్సేన్ తలత్ నిలిచాడు.

మధ్యలో తడబడినా..: ఓపెనర్లు ఫర్హాన్ (24), ఫఖర్ (17) ఇన్నింగ్స్‌ను దీటుగా ఆరంభించి తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. అయితే స్పిన్నర్ల ధాటికి ఆరో ఓవర్ నుంచి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన పాక్ 80/5 స్కోరుతో ఒత్తిడిలో పడింది. ఈ దశలో మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపినట్టయ్యింది. అయితే తలత్, నవాజ్ జోడీ పాక్‌ను ఆదుకుంది. దాదాపు సగం ఓవర్లు ఆడిన వీరు రిస్కీ షాట్లకు వెళ్లకుండా కేవలం సింగిల్స్‌పై దృష్టి సారించారు. ఇక 18 బంతుల్లో 14 రన్స్ కావాల్సిన వేళ నవాజ్ మూడు సిక్సర్లతో చెలరేగి మ్యాచ్‌ను ముగించాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జోడించడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 133/8 (మెండిస్ 50, అసలంక 20; షహీన్ 3/28, హుస్సేన్ తలత్ 2/18, రౌఫ్ 2/37).

పాకిస్థాన్: 18 ఓవర్లలో 138/5. (నవాజ్ 38 నాటౌట్, తలత్ 32 నాటౌట్; తీక్షణ 2/24, హసరంగ 2/27).

టాప్-5లో దీప్తి

● మహిళల వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది. మంగళవారం ప్రకటించిన బౌలర్ల తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి రెండు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంక్‌లో నిలిచింది. సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. బ్యాటర్లలో స్మృతీ మంధాన నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

హాంకాంగ్ సిక్సెస్‌లో భారత్ కెప్టెన్ దినేశ్

హాంకాంగ్: నవంబరు 7 నుంచి జరిగే హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్ టోర్నమెంట్‌లో టీమిండియా కెప్టెన్‌గా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఎంపికయ్యాడు. ఇన్నింగ్స్‌కు ఆరేసి ఓవర్ల మ్యాచ్‌లు సాగే హాంకాంగ్ సిక్సెస్ టోర్నీకి ఐసీసీ ఆమోదం ఉంది. 1992 నుంచి జరుగుతున్న ఈ టోర్నీలో ఈసారి మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా భారత జట్టులో ఆడుతున్నాడు.

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందు యువీ హాజరు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన కేసుకు సంబంధించి టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యాడు. తన లీగల్ టీమ్‌తో కలిసి ఈడీ కార్యాలయానికి వచ్చిన యువీని ప్రశ్నించిన అధికారులు.. అనంతరం అతని వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఇదే కేసుకు సంబంధించి ఇప్పటికే మాజీ క్రికెటర్లు రైనా, ధవన్, ఊతప్పలను ఈడీ అధికారులు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

కొరియా ఓపెన్ మెయిన్ డ్రాకు మేఘనా రెడ్డి

సువోన్ (కొరియా): భారత యువ షట్లర్ మేఘనా రెడ్డి కొరియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్లో మేఘన 21-19, 22-20తో రిరినా హిరమొటొ (జపాన్)పై గెలిచింది. బుధవారం మెయిన్ డ్రా తొలి రౌండ్లో టోన్‌రుగ్ సేహెంగ్ (థాయ్‌లాండ్)తో మేఘన తలపడనుంది.

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు ఇషా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చేనెల కైరోలో జరిగే ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు యువ షూటర్ ఇషా సింగ్ అర్హత సాధించింది. మంగళవారం భోపాల్‌లో జరిగిన ట్రయల్స్‌లో సత్తా చాటిన ఇషా.. 10 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగాల్లో మెగా టోర్నీకి ఎంపికైంది.

టైటాన్స్ ఉత్కంఠ విజయం

జైపూర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్‌లో ఐదో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 30-29తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 38-38 (6-4)తో యు ముంబాపై టైబ్రేకర్‌లో నెగ్గింది.

విశ్రాంతి కోరిన అయ్యర్

● భారత్-ఎ జట్టుకు దూరం



లఖ్‌నవూ: భారత్-ఎ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న శ్రేయాస్ అయ్యర్ హఠాత్తుగా జట్టును వీడాడు. మంగళవారం ఆస్ట్రేలియా-ఎతో రెండో అనధికార టెస్ట్‌కు కొద్ది గంటల ముందు అయ్యర్ సారథ్యాన్ని వీడాలన్న నిర్ణయం తీసుకొన్నాడు. దీంతో అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌ను కెప్టెన్‌గా మేనేజ్‌మెంట్ ప్రకటించింది. వెన్నునొప్పి ఇబ్బందిపెడుతున్నందున కొంత విశ్రాంతి అవసరమని.. ప్రస్తుతానికి రెడ్‌బాల్ క్రికెట్‌నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని సెలెక్టర్లకు అయ్యర్ లేఖ రాసినట్టు సమాచారం.

మానవ్‌కు 5 వికెట్లు..

రెండో అనధికార టెస్ట్‌లో భారత్-ఎ స్పిన్నర్ మానవ్ సుతార్ (5/93) తిప్పేయడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు చివరికి ఆస్ట్రేలియా-ఎ 350/9 స్కోరు చేసింది. టాడ్ మర్ఫీ (29), థోర్న్‌టన్ (10) క్రీజులో ఉన్నారు. జాక్ ఎడ్వర్డ్స్ (88), నాథన్ మెక్‌స్వీనీ (74) అర్ధ శతకాలతో రాణించారు.

దిగ్గజ అంపైర్ డికీ బర్డ్ మృతి



లండన్: అంతర్జాతీయ క్రికెట్‌లో దిగ్గజ అంపైర్‌గా పేరు తెచ్చుకున్న హెరాల్డ్ డికీ బర్డ్ (ఇంగ్లండ్) ఇక లేడు. వృద్ధాప్య సమస్యలతో 92 ఏళ్ల డికీ మంగళవారం మృతి చెందినట్టు యార్క్‌షైర్ క్రికెట్ క్లబ్ (వైసీసీ) పేర్కొంది. 1973 నుంచి రెండు దశాబ్దాల పాటు సాగిన డికీ కెరీర్ 1996లో ముగిసింది. రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీల అరంగేట్ర టెస్టే (లార్డ్స్) డికీకి చివరిది కావడం గమనార్హం. 66 టెస్టులు, 69 వన్డేల్లో బాధ్యతలు నిర్వర్తించిన తను మైదానంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటాడన్న పేరు తెచ్చుకున్నాడు. అలాగే పురుషుల తొలి మూడు వన్డే వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో డికీ బర్డ్ తన అంపైరింగ్‌తో వన్నె తెచ్చాడు. 'వరల్డ్ క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన అంపైర్‌గా తన పేరును చరిత్రలో లిఖించుకున్నాడు' అని వైసీసీ తెలిపింది. ఆటగాడిగా డికీ బర్డ్ 93 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 3314 పరుగులు సాధించాడు.

'బాలన్ డి వోర్' విజేత డెంబ్లీ

బోన్మటికి వరుసగా మూడోసారి

పారిస్: పారిస్ సెయింట్ జర్మెయిన్ (పీఎస్‌జీ)కు తొలి చాంపియన్స్ లీగ్ టైటిల్ అందించిన స్ట్రయికర్ ఉస్మానే డెంబ్లీ (ఫ్రాన్స్) ఈ ఏడాదికి ప్రతిష్ఠాత్మక 'బాలన్ డి వోర్' అవార్డును సొంతం చేసుకొన్నాడు. మహిళల అవార్డును స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ ఐటానా బోన్మటి వరుసగా మూడో ఏడాది దక్కించుకొంది. ఈ క్రమంలో ప్లాటిని (1983-85), మెస్సి (2009-12) తర్వాత హ్యాట్రిక్ 'బాలన్ డి వోర్' అందుకొన్న ఫుట్‌బాలర్‌గా, తొలి మహిళా ప్లేయర్‌గా బోన్మటి చరిత్ర సృష్టించింది.



బిజినెస్

ర్యాపిడోకు స్విగ్గీ గుడ్‌బై

కంపెనీలో వాటా రూ.2,400 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడో యాజమాన్య సంస్థ రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్‌లో తనకున్న వాటాను దాదాపు రూ.2,400 కోట్లకు విక్రయిస్తున్నట్లు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ మంగళవారం ప్రకటించింది. ఇందుకు తమ బోర్డు కూడా అంగీకరించిందని తెలిపింది. స్విగ్గీ నుంచి ఈ వాటాను ప్రోసస్ గ్రూప్‌నకు చెందిన ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీ, వెస్ట్‌బ్రిడ్జ్ కొనుగోలు చేశాయి. పోర్సస్ గ్రూప్ రూ.1,968 కోట్లు, వెస్ట్‌బ్రిడ్జ్ రూ.431.49 కోట్ల విలువైన వాటాలను దక్కించుకున్నాయి. ర్యాపిడో సైతం ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్న నేపథ్యంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఏర్పడవచ్చని ముందుజాగ్రత్త చర్యగా స్విగ్గీ ర్యాపిడోలో వాటాను పూర్తిగా ఉపసంహరించుకున్నట్లు తెలిసింది. 2020 ఏప్రిల్‌లో స్విగ్గీ ర్యాపిడోలో దాదాపు రూ.1,020 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా 12 శాతం వాటాను దక్కించుకుంది.

ప్రత్యేక సంస్థగా ఇన్‌స్టామార్ట్: స్విగ్గీ తన క్విక్-కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్‌ను విభజించి ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేయాలని భావిస్తోంది. స్లంప్ సేల్ ద్వారా ఈ ప్రక్రియ జరగనుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం సమాచారం అందించింది. అనంతరం ఇన్‌స్టా మార్ట్ స్విగ్గీకి పూర్తి అనుబంధ సంస్థగా కొనసాగనుంది.

మార్కెట్లోకి మ్యాటర్ ఎరా 5000 ప్లస్ ఎలక్ట్రిక్ బైక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ మ్యాటర్.. హైదరాబాద్ మార్కెట్లోకి తన ఫ్లాగ్‌షిప్ బైక్ 'ఎరా 5000 ప్లస్' తీసుకువచ్చింది. ఈ బైక్ ధర రూ.1,93,826 (హైదరాబాద్ ఎక్స్‌షోరూమ్). మంగళవారం నాడిక్కడ కంపెనీ వ్యవస్థాపకుడు, సీటీఓ కుమార్ ప్రసాద్ తెలికేపల్లి ఈ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా లైఫ్‌టైమ్ బ్యాటరీ వారంటీతో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. 4 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 5 కిలోవాట్ బ్యాటరీతో కూడిన ఈ బైక్ ఒకసారి చార్జింగ్‌తో 172 కిలోమీటర్ల ప్రయాణిస్తుంది. ప్రస్తుతం కంపెనీ ఈ బైక్స్‌ను గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తోందన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,14,330 ▲	1,04,800 ▲	1,49,000 ▲
విజయవాడ	1,17,900 ▲	1,11,000 ▲	1,39,000 ▲
విశాఖపట్నం	1,17,940 ▲	1,05,040 ▲	1,50,000 ▲
రాజమండ్రి	1,14,330 ▲	1,04,800 ▲	1,38,400 ▲
ప్రొద్దుటూరు	1,17,400 ▲	1,08,010 ▲	1,38,500 ▲
ముంబై	1,14,314 ▲	1,04,712 ▲	1,35,267 ▲

రూపీ.. కొత్త కనిష్ఠం

ఒక్కరోజులో 45 పైసలు క్షీణించిన రూపాయి

డాలర్ మారకంలో రూ. 88.73కు చేరిక



ముంబై: భారత కరెన్సీ సరికొత్త కనిష్ఠానికి పతనమైంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ మంగళవారం ఏకంగా 45 పైసలు క్షీణించి రూ.88.73 వద్ద ముగిసింది. హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంతో భారత ఐటీ సేవల ఎగుమతులకు భారీగా గండిపడవచ్చని, అమెరికా నుంచి రెమిటెన్స్‌లు తగ్గవచ్చన్న ఆందోళనలతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు మంగళవారం రూ.88.41 వద్ద ప్రారంభమైంది. ఒకదశలో ఆల్‌టైం ఇంట్రాడే కనిష్ఠం రూ.88.82 వద్దకు చేరింది. చివరికి 47 పైసల నష్టంతో రూ.88.75 వద్ద స్థిరపడింది. సోమవారం ట్రేడింగ్‌లోనూ రూపాయి 12 పైసలు కోల్పోయింది.

రూ.90 దిశగా పయనం..

హెచ్1బీ వీసా ఫీజు పెంపు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ అంశాలు మున్ముందు రూపాయిపై మరింత ఒత్తిడి పెంచవచ్చని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కరెన్సీ అండ్ కమోడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరీ అన్నారు. డాలర్-రూపీ మారకం రేటు రూ.88.45-89.20 శ్రేణిలో ట్రేడయ్యే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు.

ఎగుమతిదారులకు స్వల్ప ఊరట

ట్రంప్ సుంకాలతో సతమతం అవుతున్న ఎగుమతిదారులకు రూపాయి క్షీణత కొంత ఊరటనివ్వనుంది. రూపాయి విలువ తగ్గిన ఫలితంగా ఎగుమతులపై గతంలో కంటే అధిక ఆదాయం లభించనుంది. దిగుమతిదారులపైన మాత్రం భారం మరింత పెరగనుంది. ముఖ్యంగా ముడి చమురు, బంగారం దిగుమతులకు మరింత అధికంగా వెచ్చించాల్సి వస్తుంది. రూపాయి క్షీణత స్వల్పకాలంలో ఎగుమతిదారులకు ప్రయోజనకరమే అయినప్పటికీ, మారకం రేటులో స్థిరత్వమే దీర్ఘకాలంలో మేలు చేస్తుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈఓ) అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ అన్నారు.



సీఆర్‌పీఎఫ్‌కు సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిల్స్

ఐకామ్ టెలీకి భారీ ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అబుదాబీకి చెందిన చిన్న ఆయుధాల డిజైనింగ్, తయారీ కంపెనీ కారకాల్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ ఐకామ్ టెలీ లిమిటెడ్ సారథ్యంలోని జాయింట్ వెంచర్ కంపెనీకి కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) నుంచి రైఫిళ్ల సరఫరా ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద 200.. సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిళ్లు సీఆర్‌పీఎఫ్‌కి సరఫరా చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని ఐకామ్ కారకాల్ స్మాల్ ఆర్మ్స్ కాంప్లెక్స్‌లో ఈ స్నైపర్ రైఫిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు ఎంఈఐఎల్ వెల్లడించింది. ఎడ్జ్ గ్రూప్ కంపెనీ అయిన కారకాల్ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే భారత సాయుధ దళాలు, కేంద్ర ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ సహా ఇతర రక్షణ విభాగాలకు ఆధునిక ఆయుధాల తయారీ, సరఫరా కోసం ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించింది. ఐకామ్ కారకాల్ స్మాల్ ఆర్మ్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం ఐకామ్‌తో భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటున్నట్టు కారకాల్ సీఈఓ హమద్ అలామెరి చెప్పారు.

తమ ప్రయాణంలో ఇది ఒక మైలురాయి అని ఐకామ్ డైరెక్టర్ సుమంత్ పాటూరు అన్నారు. తాము సీఆర్‌పీఎఫ్‌కు అత్యంత ఆధునికమైన సీఎస్ఆర్-338 స్నైపర్ రైఫిళ్లు సరఫరా చేయడంతో పాటు ప్రపంచ శ్రేణి టెక్నాలజీని కూడా బదిలీ చేస్తున్నామని, తద్వారా హైదరాబాద్ తయారీ రంగంలో అత్యున్నత నాణ్యత గల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి తెస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో దేశంలో తయారైన తొలి హై పెర్ఫార్మెన్స్ బోల్ట్ యాక్షన్ సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిల్ డెలివరీ చేయనున్నట్టు సుమంత్ తెలిపారు.

ఈ ఏడాది 6.7 % వృద్ధి ఓఈసీడీ

ఈ ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా నమోదు కావచ్చని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనా వేసింది. గత అంచనాతో పోలిస్తే 0.40% పెంచింది. కాగా, ఎస్ అండ్ పీ గ్లోబల్ మాత్రం వృద్ధి రేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5%గా కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

మూడో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 58 పాయింట్లు డౌన్

ముంబై: హెచ్1బీ వీసా ఫీజు పెంపు ఆందోళనల నేపథ్యంలో ఐటీ షేర్లలో అమ్మకాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. మంగళవారం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సెన్సెక్స్.. చివరికి 57.87 పాయింట్ల నష్టంతో 82,102.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 594 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. కాగా, నిఫ్టీ 32.85 పాయింట్లు కోల్పోయి 25,169.50 వద్ద స్థిరపడింది. ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు సూచీల నష్టాలకు కొంత మేర అడ్డుకట్ట వేయగలిగాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. ట్రెంట్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా క్షీణించాయి.

హైదరాబాద్‌లో మోనిన్ సిరప్ తయారీ ప్లాంట్

రూ.350 కోట్ల పెట్టుబడి.. వచ్చే ఏడాది అందుబాటులోకి

హైదరాబాద్: ఫ్రాన్స్‌కు చెందిన సహజసిద్ధ సిరప్ తయారీ సంస్థ మోనిన్.. భారత్‌లోనే తొలి ప్లాంట్‌ను హైదరాబాద్ సమీపంలోని సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తోంది. రూ.350 కోట్ల పెట్టుబడితో 40 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మోనిన్ ఇండియా ఎండీ జెర్మైన్ ఔరద్ వెల్లడించారు. తొలి దశలో మొత్తం రెండు ఉత్పత్తి లైన్లతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో ఒకటి పూర్తిగా సిరప్ ఉత్పత్తి కోసం నెలకొల్పనుండగా మరొకటి క్రష్, బాట్లింగ్ కోసం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ ఫ్లేవర్స్‌ను తమ ఫ్రెంచ్ ఫ్లేవర్‌తో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావటం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 1912లో ఫ్రాన్స్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన మోనిన్.. 2019లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం 100కు పైగా డిస్ట్రిబ్యూషన్ చానల్స్‌తో నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. స్టార్‌బక్స్, టిహార్ట్స్ సహా పలు రెస్టారెంట్స్, కేఫ్స్.. మోనిన్ క్లయింట్లుగా ఉన్నాయి. కాగా మోనిన్.. ఢిల్లీ, బెంగళూరుల్లో రెండు ఎక్స్‌పీరియన్స్ స్టూడియోలను నిర్వహిస్తోందని, త్వరలోనే హైదరాబాద్, కోల్‌కతాలకు వీటిని విస్తరించనున్నట్లు ఔరద్ తెలిపారు. కంపెనీ పోర్టుఫోలియోలో సిరప్స్, ఫ్రూట్ మిక్సెస్, క్రష్, సాస్, కాన్సన్‌ట్రేట్స్ సహా 200కు పైగా ఫ్లేవర్స్ ఉన్నాయి.

విశాఖలో అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్

మరో నాలుగు నగరాల్లో కూడా ఏర్పాటు

ముంబై: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం సహా దేశంలోని తూర్పు, ఉత్తర, సెంట్రల్ ప్రాంతాలకు చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కొత్తగా ఐదు అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ప్రకటించింది. హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ ఇనిస్టిట్యూట్ ఉంది. వీటి ఏర్పాటు వల్ల ప్రధాన క్లినికల్ కేర్ విభాగంలోకి జినోమిక్స్‌ను మరింతగా అనుసంధానం చేయగలుగుతామని పేర్కొంది. విశాఖతో పాటు గువాహటి, భువనేశ్వర్, లఖ్‌నవూ, ఇండోర్‌లలో కూడా ఈ ఇనిస్టిట్యూట్లను ఏర్పాటు చేయనున్నట్టు అపోలో మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, హెపటాలజిస్ట్ అనుపమ్ సిబాల్ తెలిపారు. ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాల్లో 12 ఇనిస్టిట్యూట్స్ పనిచేస్తున్నాయి. వివిధ రోగాలు, వాటికి సంబంధించిన పరిస్థితుల అన్వేషణలో జెనెటిక్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అంతేకాకుండా ఇవి రోగికి వ్యక్తిగత చికిత్సా ప్రణాళికలు తయారు చేసి, మార్గదర్శకం చేయడంలో సహాయకారిగా ఉంటాయన్నారు. ప్రస్తుతం అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్స్ 11 వేల కన్సల్టేషన్ల మైలురాయిని చేరాయని వెల్లడించారు. జినోమిక్ సీక్వెన్సింగ్‌కు రూ.60,000, టార్గెటెడ్ సీక్వెన్సింగ్‌కు రూ.18,000 చార్జి చేస్తున్నట్టు తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ పండగ ఆఫర్లు

ఎస్1 ధర రూ.49,999కే

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా.. పండగ సీజన్‌లో కస్టమర్లను ఆకట్టుకునేందుకు బంపర్ ఆఫర్లను ప్రకటించింది. ఓలా ముహూర్త్ మహోత్సవ్ పేరుతో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక విక్రయాలను ప్రారంభించింది. ఈ ఆఫర్‌లో భాగంగా, వివిధ మోడళ్లపై ధరలను భారీగా తగ్గించింది. ఎస్1 ఎక్స్ 2 కేడబ్ల్యూహెచ్, రోడ్‌స్టర్ ఎక్స్ 2.5 కేడబ్ల్యూహెచ్ మోడళ్లు రూ.49,999కే అందిస్తోంది. అలాగే ఎస్1 ప్రో+ 5.2 కేడబ్ల్యూహెచ్, రోడ్‌స్టర్ ఎక్స్ 9.1కేడబ్ల్యూహెచ్ మోడళ్లను రూ.99,999కే అందిస్తున్నట్లు తెలిపింది. కాగా ఈ స్కూటర్లను 4680 భారత్ సెల్ బ్యాటరీ ప్యాక్‌లతో తీసుకువచ్చినట్లు ఓలా తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	120
వరంగల్	105	గుంటూరు	122
కరీంనగర్	105	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	105
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	129	అనంతపురం	110
గోదావరి	120		

ఘనంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం


దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో మోహన్‌లాల్



ఉత్తమ నటుడి అవార్డును సంయుక్తంగా అందుకుంటున్న షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే

'సినిమా అనేది కేవలం వినోదం అందించే సాధనం మాత్రమే కాదు. దేశాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి బాటలు వేసే మాధ్యమం' అని అన్నారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. దేశ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును మంగళవారం న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. మోహన్‌లాల్‌ను 'కంప్లీట్ యాక్టర్' అని కొనియాడారు. ఇదే వేదికపై 2023వ సంవత్సరానికి గాను కేంద్రం ప్రకటించిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను విజేతలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'భారతీయ చిత్ర పరిశ్రమ అన్ని విధాలా దూసుకుపోవడం హర్షించదగ్గ విషయం. కేవలం ప్రజాధరణ విషయంలోనే కాకుండా యువతరాన్ని ఆకట్టుకోవడంలోనూ సినిమా ముందుంటోంది. ఈ రోజు అవార్డులు అందుకొన్న చిత్రాల్లో పలు సందేశాత్మక చిత్రాలు ఉండడం ప్రశంసనీయం. మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమాలకు గుర్తింపు దక్కడం సంతోషాన్ని ఇస్తోంది' అని పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును షారుక్‌ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సే(ట్వల్త్ ఫెయిల్), జాతీయ ఉత్తమ నటి అవార్డును రాణీ ముఖర్జీ(మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)కి రాష్ట్రపతి ముర్ము అందజేశారు. జాతీయ ఉత్తమ చలనచిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' సినిమా అవార్డు దక్కించుకుంది. నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కాగా ఆ సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి అవార్డును అందుకున్నారు. బలగం సినిమాలో 'ఊరు పల్లెటూరు' పాటకు కాసర్ల శ్యామ్ ఉత్తమ గేయ రచయిత అవార్డును అందుకున్నారు. సాయి రాజేశ్ (ఉత్తమ స్ర్కీన్‌ప్లే- బేబీ సినిమా), పీవీఎన్ఎస్ రోహిత్(ఉత్తమ నేపథ్య గాయకుడు- బేబీ సినిమా), ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ కేటగిరీలో 'హను-మాన్' చిత్రానికి గానూ దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్‌రెడ్డి, యానిమేటర్, వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ వెంకట్‌కుమార్ జెట్టీ అవార్డు అందుకున్నారు. యా పృథ్వీ, కణ్ణన్ నందురాజ్(సంయుక్తంగా) (బెస్ట్ యాక్షన్ డైరక్షన్, హను-మాన్ సినిమా), దర్శకుడు సుకుమార్ తనయురాలు సుకృతి వేణి(ఉత్తమ బాలనటి- గాంధీతాత చెట్టు) అవార్డులను అందుకున్నారు.


ఉత్తమ నటి అవార్డుతో రాణీ ముఖర్జీ


ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాహు గారపాటి, సుకృతి వేణి

సొగసు చూడ తరమా...!



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రధారులుగా నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. దీపావళి పండగ సందర్భంగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవలె విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా 'సొగసు చూడతరమా...' అంటూ సాగే పాటను స్టార్ హీరోయిన్ నయనతార ఆవిష్కరించారు. కృష్ణకాంత్ రాసిన గీతానికి తమన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చగా, కార్తీక్ ఆలపించారు. అమ్మాయిల పట్ల కథానాయకుడి భావోద్వేగాలను ఈ పాట చక్కగా ప్రతిబింబిస్తోంది.

ఘనవిజయం సాధించాలి

- అల్లరి నరేశ్



రవిప్రకాశ్, శివకుమార్, చరిష్మా శేఖర్ ప్రధాన పాత్రధారులుగా వీఎస్‌వీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విద్రోహి'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను విజ్జన వెంకటసుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను అల్లరి నరేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. సినిమాపై అంచనాలు పెంచేసింది. చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ఇప్పటివరకూ రాని సరికొత్త అంశాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నాం' అని వీఎస్‌వీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉపేంద్ర, ఎంఎస్ఆర్, డీఓపీ: సతీశ్ ముత్యాల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



తల్లి కాబోతున్న కత్రినా



బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ జంట శుభవార్త చెప్పింది. తాము తల్లితండ్రులవ్వబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను ఈ సందర్భంగా ఆ దంపతులు తమ అభిమానులతో పంచుకున్నారు. మా జీవితంలో సరికొత్త, గొప్ప అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాము అని పేర్కొన్నారు. అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు కత్రినా, విక్కీ కౌశల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2021లో వీరిద్దరూ ప్రేమవివాహం చేసుకున్నారు.

కర్ణాటక టికెట్ ధరలపై హైకోర్టు స్టే

కర్నాటక రాష్ట్రంలోని అన్ని సినిమా హాల్స్‌లో టిక్కెట్ ధర ఫ్లాట్ రూ.200 ఉండేలా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. ప్రభుత్వం నిర్ణయించిన టిక్కెట్ ధర భారీ బడ్జెట్ సినిమాలకు గిట్టుబాటు కాదని మల్టీప్లెక్స్‌లు, హోంబళె ఫిలిమ్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రవి హొసమని నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించి, మధ్యంతరంగా స్టే విధించింది. రాష్ట్రంలో ఇతర భాషల సినిమాల ప్రభావం అధికమైందని, టిక్కెట్ ధర ఏకరూపంగా ఉండాలని దశాబ్దాలకాలంగా పోరాటం సాగుతోంది. ఈ సమస్యపై పలుమార్లు చర్చలు, సమావేశాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టిక్కెట్ ధరను రూ.200గా నిర్ణయించింది. దీన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుందని హైకోర్టు తెలిపింది.

బెంగళూరు, ఆంధ్రజ్యోతి

బ్యాంకాక్‌లో తొలి షెడ్యూల్



ఇమ్రాన్‌హష్మీ, శ్రియా శరణ్ జంటగా నటించిన 'ఆవారాపన్' చిత్రానికి కొనసాగింపుగా 18 ఏళ్ల తర్వాత రెండో భాగం తెరకెక్కుతోంది. 'ఆవారాపన్ 2' టైటిల్‌తో వస్తోన్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ కథానాయకుడిగా కనిపించనున్నారు. ఆయనకు జోడీగా దిశాపటానీ నటిస్తున్నారు. ఈ వారాంతంలో ఈ చిత్రం తొలి షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలవనుందని యూనిట్ తెలిపింది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో సాంగ్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఆ తర్వాత ముంబై షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఏప్రిల్ 3న 'ఆవారాపన్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది.

ప్రేమికుని భావోద్వేగం



ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'డ్యూడ్'. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. తాజాగా ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'బాగుండు పో' అనే పాటను విడుదల చేశారు మేకర్స్. ప్రేమించిన అమ్మాయి అభిప్రాయాన్ని గౌరవిస్తూ హీరో తన ప్రేమ తాలూకా భావాలను వ్యక్తపరిచేలా ఉన్న ఈ పాట ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను సంజిత్, సాయి అభ్యంకర్ పాడారు. సాయి అభ్యంకర్ సంగీతం అందించారు. అక్టోబరు 17న పాన్‌ఇండియా స్థాయిలో విడుదలవుతోంది చిత్రం.

డిసెంబరు 29, 30, 31 తేదీలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల విడుదల వాయిదా


తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల 29, 30, 31వ తేదీల(వైకుంఠ ఏకాదశి)కు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలను టీటీడీ వాయిదా వేసింది. పరిపాలనాపరమైన కారణాలతో ఈ మూడు రోజుల కోటాతో పాటు శ్రీవాణి టికెట్ల కోటా కూడా విడుదల చేయడం లేదని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ టికెట్ల విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడిగా ప్రకటించనుంది.

కాఫీ తోటల్లో 'బెర్రీ బోరర్' నియంత్రణకు కమిటీ

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయలోని కాఫీ తోటలకు సోకిన 'బెర్రీ బోరర్' తెగులు నియంత్రణకు రాష్ట్రస్థాయి ప్రతిస్పందన బృందాన్ని (రెస్పాన్స్ టీమ్) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా వ్యవసాయ, ఉద్యాన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైస్‌ఛైర్మన్‌గా గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, సభ్య కార్యదర్శిగా రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్, సభ్యులుగా ఉద్యాన శాఖ డైరెక్టర్, కాఫీ బోర్డు సీఈవో, సెర్ప్ సీఈవో, పీఆర్ అండ్ ఆర్డీ డైరెక్టర్, జీసీసీ ఎండీ, ఉద్యానవర్సిటీ వీసీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్, సీసీఆర్ఐ డైరెక్టర్‌ను నియమించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాఫీ పండించే ప్రాంతాల్లో 'బెర్రీ బోరర్'ను ముందే గుర్తించడం, తెగులు పునరావృతమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ప్రస్తుత కాఫీ తోటల్ని సర్వే చేసి, తెగులు నియంత్రణకు చర్యలు తీసుకునేలా స్థానిక, జిల్లాస్థాయి కమిటీలు వేయడం, తెగులు ప్రభావిత రైతులకు బీమా, ఆర్థిక సహాయ పథకాలు వర్తించేలా దీర్ఘకాలిక వ్యూహాలు సూచించాలని ప్రభుత్వం కమిటీకి నిర్దేశం చేసింది.

కాలుష్య పరిశ్రమలు వద్దు

» ఉప్పాడలో మత్స్యకారుల ధర్నా


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్లో బైఠాయించిన మత్స్యకారులు

కొత్తపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ జీవనోపాధికి ఆటంకం కలిగించే కాలుష్య పరిశ్రమలు వద్దంటూ కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు మంగళవారం ఉప్పాడ బీచ్ రోడ్డులో ధర్నా చేపట్టారు. ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మత్స్యకారులు బీచ్ రోడ్డు సెంటర్లో బైఠాయించి కాలుష్య పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. సముద్ర తీర గ్రామాల్లో కాలుష్య పరిశ్రమలు నెలకొల్పడం వల్ల సముద్రంలో మత్స్య సంపద అంతరించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేట నిషేధం అనంతరం ఇప్పటివరకు సముద్రంలో సరైన చేపల వేట లేకపోవడంతో పస్తులుంటున్నామని వాపోయారు.


బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కలపరుపు బుచ్చి రాంప్రసాద్, చిత్రంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతా

» బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బుచ్చి రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

గొల్లపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కలపరుపు బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో ఛైర్మన్‌గా మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఎవరూ బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకున్నవారు లేరని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాహ్మణుల సంక్షేమం కోసం దేశంలోనే మొదటిసారిగా మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. వెనుకబడిన తరగతుల కాలనీల్లో 1000 హిందూ దేవాలయాలు కట్టించాలని విద్యా శాఖ మంత్రి లోకేశ్ ఆదేశించారని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు దేవదాయ శాఖ కూడా తన వంతు సహాయ సహకారాలను అందిస్తుందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులకు చేయూత అందిస్తోందని తెలిపారు.

సాయి భాస్కర్‌లో రోబోటిక్ తుంటి మార్పిడి ఆపరేషన్లు

» ఈ మేరకు ప్రపంచ ప్రఖ్యాత స్ట్రైకర్ సంస్థతో ఒప్పందం

» జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ నరేంద్ర రెడ్డి వెల్లడి


స్ట్రైకర్ జీఎం అమన్‌రిషితో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న డాక్టర్ నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా తుంటి మార్పిడి ఆపరేషన్లలో మాకొ హిప్ అండ్ నీ రోబోటిక్ టెక్నాలజీని ప్రవేశపెడుతున్నట్టు సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి వెల్లడించారు. ఇప్పటి వరకు మోకీలు మార్పిడిలో మాత్రమే రోబోటిక్ టెక్నాలజీని వినియోగిస్తుండగా ఇకపై తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలను సైతం రోబోటిక్ ద్వారా నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ మేరకు ప్రపంచ ప్రఖ్యాత రోబోటిక్ సంస్థ స్ట్రైకర్‌తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ నరేంద్ర రెడ్డి విలేకరులకు ఈ వివరాలను వెల్లడించారు. గడిచిన రెండేళ్లుగా రాష్ట్రంలోనే అత్యధికంగా తాము రోబోటిక్ మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో స్ట్రైకర్ సంస్థ తమతో ఈ ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. రోబోటిక్‌ను, అందుకు తగిన సాంకేతిక సహకారాన్ని ఈ సంస్థ అందించనుందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలోని స్ట్రైకర్ ఇండియా హెడ్ క్వార్టర్స్‌లో సంస్థ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ అమన్‌రిషితో కలసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్టు ఆయన తెలిపారు. అక్టోబరు మొదటి వారం నుంచి సాయి భాస్కర్ హాస్పిటల్‌లో రోబోటిక్ తుంటి మార్పిడి ఆపరేషన్లు అందుబాటులోకి రానున్నాయని డాక్టర్ నరేంద్ర రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్ట్రైకర్ నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రశాంత్ మహేశ్వరి, రెండు తెలుగు రాష్ట్రాల మేనేజర్ పీటీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరింత సులభంగా రుణాలు

బ్యాంకర్లను కోరిన ఎంపీలు... బెజవాడలో లోక్‌సభ సబార్డినేట్ కమిటీ సమావేశాలు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు ముఖ్యంగా కౌలు రైతులకు రుణాల మంజూరు మరింత సరళతరం కావాలని లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ సమావేశంలో పలువురు ఎంపీలు అభిప్రాయపడ్డారు. విజయవాడలో లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ సమావేశాలు కమిటీ ఛైర్మన్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం కూడా కొనసాగుతాయి. రైతులకు సులభ రుణాలు అనే అంశంతోపాటు పెరిగిపోతున్న సైబర్ నేరాలు, క్లైయిం చేయని బ్యాంకు డిపాజిట్లు, చిన్నతరహా పరిశ్రమలకు రుణాల మంజూరు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, మహిళలకు స్వయం ఉపాధిపైన చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బ్యాంకు సేవలను అందించాలని, సామాజిక బాధ్యతల్లో బ్యాంకులు ముందుండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. కమిటీ సభ్యులు ప్రేమచంద్రన్, రఘునందన్‌రావు, మెయినా మల్హోత్రా, రాజీవ్ రాయ్, వివేక్ ఠాకూర్, రాజేశ్ వర్మ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పర్మిందర్ చోప్రా, ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ సీఎండీ కె.సత్యనారాయణరాజు, యూనియన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామసుబ్రమణ్యం, వివిధ బ్యాంకుల ఛైర్మన్లు, ఎండీలు, సీఈవోలు హాజరయ్యారు.



విజయవాడలో జరుగుతున్న లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో వివిధ బ్యాంకుల ఎండీలు, చైర్మన్లు

రాజధానిలో ప్రాంతీయ కార్యాలయాలు పెట్టండి

రాష్ట్ర ప్రాజెక్టుల్లో భాగస్వాములవ్వండి.. బ్యాంకుల ఛైర్మన్లు, ఎండీలను కోరిన సీఎం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రాంతీయ కార్యాలయాలను ప్రారంభించాలని, అలాగే రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని బ్యాంకుల ఛైర్మన్లు, ఎండీలను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో భాగంగా విజయవాడకు వచ్చిన పలు బ్యాంకుల ఛైర్మన్లు, ఎండీలకు సీఎం తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం హైటీ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులను వారికి వివరించారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నందున విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని బ్యాంకుల ఉన్నతాధికారులను సీఎం కోరారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు రాజధానిలో స్థలాలు కేటాయించామని, అక్కడ ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. 15 నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కేంద్ర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులను సీఎం వివరించారు. అన్ని రంగాల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, ఎంపీ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నుంచి కోలుకున్న గురుకుల విద్యార్థిని

» సాయం చేసిన మంత్రి డోలాకు తల్లీకూతుళ్ల ధన్యవాదాలు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల క్యాన్సర్ బారినపడిన ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థిని, ఆమె తల్లి.. మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రత్యేక చొరవతో అందిన వైద్యసాయంతో కోలుకున్నారు. దీంతో వాళ్లిద్దరూ అసెంబ్లీకి వచ్చి మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కాకినాడ ఎస్ఎం నగర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని మిడియం మంజుల ఈ ఏడాది జూలై 10న క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న మంత్రి డోలా, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్.. చొరవ తీసుకుని ఆమెను విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్పించి ప్రత్యేక వైద్యం అందేలా చూశారు. విద్యార్థిని తల్లి వాణికి కూడా క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించడంతో మంత్రి సూచన మేరకు ఆమెకు కూడా వైద్యం అందించారు. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్న విద్యార్థిని, ఆమె తల్లి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం అసెంబ్లీకి విచ్చేసిన తల్లీకూతుళ్లు.. శాసనసభ లాబీలో మంత్రి డోలాను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: సర్వే డైరెక్టర్

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు, లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్‌చేస్తూ అడ్డగోలు పనులు చేసే రెవెన్యూ, సర్వే సంబంధిత అధికారులపై కఠినమైన క్రమశిక్షణాచర్యలు తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది. ఐవీఆర్ఎస్ డేటా ఆధారంగా తప్పులు చేసిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే కలెక్టర్లను ఆదేశించినట్లు వివరించింది. కలెక్టర్ల సదస్సులో ఆర్ టీజీఎస్ ప్రజంటేషన్ ఆధారంగా 'సొమ్ములిస్తేనే సర్వే' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ వార్తపై సర్వే, సెటిల్‌మెంట్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ స్పందించారు. ఐవీఆర్ఎస్ డేటాను తెప్పించుకొని, తప్పులకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. ఆర్టీజీఎస్‌కు సర్వే, రెవెన్యూ సేవలపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్న అంశాన్నే ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా.. ఏకపక్షంగా, అతిశయోక్తితో వార్తలు రాశారని ఆయన తన వివరణలో పేర్కొన్నారు.

ఉపాధి జాబ్‌కార్డులకు ఈకేవైసీ

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికుల కుటుంబాలకు ఇచ్చిన జాబ్‌కార్డులను ఈకేవైసీ ద్వారా పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కో రాష్ట్రంలో 2జిల్లాలను నమూనాగా తీసుకుని పైలట్ ప్రాజెక్టుగా పూర్తి చేసి, తర్వాత మిగతా జిల్లాలన్నింటిలో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. మన రాష్ట్రంలో కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మొదట ఉద్యమరూపంలో ఈకేవైసీ సెప్టెంబరు 30లోపు పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాలిచ్చింది. దీనికనుగుణంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామ స్థాయిలో ఉండే అవసరాన్ని బట్టి ప్రోగ్రాం ఆఫీసర్, ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్, మేట్లను ఉపయోగించుకుని గ్రామాల్లో ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాలిచ్చారు.

సమస్యల పరిష్కారానికే రణభేరి: యూటీఎఫ్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికే గుంటూరులో ఈ నెల 25న రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటివరకు 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 4 డీఏలు, ఇతర బకాయిలు రూ.30వేల కోట్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డులు ఉండేలా సంస్కరణలు తీసుకొస్తామని చెబుతున్న విద్యామంత్రి లోకేశ్.. క్షేత్రస్థాయిలో సమస్యలు పట్టించుకోవడంలేదని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు.

3నెలల సెలవుపై ఐఏఎస్ శ్యామలరావు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు మూడు నెలలపాటు సెలవుపై వెళ్తున్నారు. అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స కోసం సెలవు తీసుకున్నారు. బుధవారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు ఆయన సెలవులో ఉంటారు. అప్పటి వరకు ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం జీవో ఇచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్యామలరావును టీటీడీ ఈవోగా నియమించారు. ఇటీవల ఆయన్ను జీఏడీ ముఖ్యకార్యదర్శిగా బదిలీచేశారు. ఈ బదిలీపై శ్యామలరావు అసంతృప్తిగా ఉన్నారు.

క్రీడా కోటా సర్టిఫికెట్‌కు కాలపరిమితి తొలగింపు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడా కోటా ఉద్యోగాల విషయంలో స్పోర్ట్స్ సర్టిఫికెట్‌కు కాలపరిమితిని ఏపీపీఎస్సీ తొలగించింది. ఈ అంశంపై న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో అందరికీ అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2023 గ్రూప్-2 నోటిఫికేషన్‌లో క్రీడా కోటా కింద దరఖాస్తు చేసుకున్న వారిలో పదేళ్లు, అంతకంటే ముందు క్రీడా సర్టిఫికెట్లు పొందిన వారుంటే.. ఆ వివరాలను ఏపీపీఎస్సీకి బుధవారం రాత్రి 11 గంటలలోపు మెయిల్ చేయాలని సూచించింది. వాటిని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు పంపి, అనంతరం తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. కాగా, ఇకపై అన్ని నోటిఫికేషన్లకు ఇదే విధానం వర్తించనుంది. ఇప్పటి వరకూ కేవలం పదేళ్ల లోపు కాలపరిమితి ఉన్న క్రీడా సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

26 నుంచి రెండో విడత డిగ్రీ కౌన్సెలింగ్

డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 26 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ఉన్నత విద్యామండలి మంగళవారం తెలిపింది. మొదటి విడతలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు బుధవారం సాయంత్రంలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. లేకుంటే అడ్మిషన్ రద్దవుతుందని.. రద్దు చేసిన అడ్మిషన్లను ఖాళీలుగా చూపుతారని పేర్కొంది.

'పీసీబీ గ్రేడ్-2 అనలిస్ట్' ఫలితాలు విడుదల

పీసీబీలో గ్రేడ్-2 అనలిస్ట్ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాలను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. 18 మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపింది. వివరాలను వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచింది.

డిగ్రీ కళాశాలల బంద్ వెనుక వైసీపీ కుట్ర: బ్రహ్మం

కడప నగరంతోపాటు రాష్ట్రంలోని పలుచోట్ల సోమవారం జరిగిన ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్ వెనుక వైసీపీ కుట్ర ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

స్వామి సొమ్మును గద్దల్లా తిన్న వైసీపీ నేతలు: వర్ల

జగన్ అరాచక పాలనలో టీటీడీ పెద్దలు గద్దల్లా స్వామివారి సొమ్మును దోచుకున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. 'రవికుమార్ అనే వ్యక్తి పరకామణిలో 15 ఏళ్లుగా సొమ్ము దొంగలిస్తూ వచ్చాడు. స్వామి సొమ్మును దొంగిలించిన వ్యక్తితో లోక్‌అదాలత్‌లో రాజీ పడ్డారు. తప్పు ఎవరు చేశారో విచారణ చేసి ప్రభుత్వం నిగ్గు తేల్చాలి' అని కోరారు.

మండలిలో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని వంద సార్లు చెప్పాం. ప్రభుత్వం తరఫున అంత స్పష్టంగా చెప్పినా మీకు (వైసీపీ) అర్థం కావడం లేదా? ప్రైవేటీకరణ జరగాలని మీరే కోరుకుంటున్నట్లుగా ఉంది. అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారు' అని వైసీపీ ఎమ్మెల్సీలపై లోకేశ్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడుల కల్పన, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిపై లఘు చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని మీరే చెప్పి, మళ్లీ సభను తప్పుదారి పట్టిస్తున్నారని, ఎందుకు రభస చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో తమ సభ్యురాలిపై ఆయన అసభ్య పదజాలం వాడారని, వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై లోకేశ్ మండిపడ్డారు. 'వైసీపీ ప్రభుత్వంలో నిండు సభలో నా తల్లిని అవమానించారు. అప్పుడు మంత్రిగా ఉన్న బొత్స సభలోనే ఉండి ఏం చేశారు? ఓ తల్లిని అవమానిస్తే ఎంత బాధ ఉంటుందో కొడుకుగా నాకు తెలుసు. మా అమ్మ ఎంత కుమిలిపోయిందో నాకు తెలుసు. ఆమె కోలుకోవడానికి మూడు నెలలు పట్టింది.. ఆనాడు మీవాళ్లు ఏమన్నారో వీడియో చూపించాలా? నేను సభ్యురాలిని వరుదు కల్యాణి గారు అనే గౌరవించా. కావాలంటే రికార్డులు పరిశీలించండి.. మహిళలంటే నాకు అపార గౌరవం. మహిళలను తిడితే ఆనందపడే వ్యక్తులం మేం కాదు. మా నాయకుడు అలాంటి సంస్కారం మాకు నేర్పలేదు' అని స్పష్టంచేశారు. బొత్స స్పందిస్తూ.. అప్పుడు, ఇప్పుడు తాను ఖండిస్తున్నానని.. మహిళను ఎవరు కించపరిచేలా మాట్లాడినా తప్పేనని అన్నారు. అయితే ఆ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను బొత్స ఉపసంహరించుకోవాలని హోం మంత్రి అనిత డిమాండ్ చేశారు.



ప్రధానికి ధన్యవాదాలు..

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదని లోకేశ్ ప్రకటించినా తమకు అనుమానాలు ఉన్నాయంటూ వైసీపీ సభ్యులు పదే పదే ప్రస్తావించడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమయంలోనే లోకేశ్ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం ప్రతిపాదించారు. 'విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామికి ధన్యవాదాలు. రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం చిరస్మరణీయంగా ఉంటుంది. మూడో ఫర్నేస్ కూడా వినియోగంలోకి వచ్చింది. విద్యుత్ చార్జీల కింద కర్మాగారం చెల్లించాల్సిన రూ.3 వేల కోట్లను ఈక్విటీ కింద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదం తెలిపి కుమారస్వామి గారికి పంపాలని కోరుతున్నాను. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో నేను కూడా పాల్గొన్నాను. ప్రైవేటీకరణ జరగదని.. ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ఆనాడు హామీ ఇచ్చాం.. ఆ హామీకి మా మూడు పార్టీలు కట్టుబడి ఉన్నాయి' అని పేర్కొన్నారు. వైసీపీ దీనికి మద్దతిస్తుందో లేదో చెప్పాలని సూటిగా నిలదీయడంతో ఆ పార్టీ సభ్యులు సంపూర్ణంగా మద్దతిచ్చారు. అనంతరం తీర్మానాన్ని మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే పోటీగా వైసీపీ మరో తీర్మానం ప్రతిపాదించింది. 'ప్రజల సెంటిమెంటును దృష్టిలో ఉంచుకుని విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడుల ఉపసంహరణకు అవకాశం లేకుండా పూర్తి వాటా ప్రభుత్వానికే ఉంచుకుని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి. క్యాప్టివ్ గనులు కేటాయించాలి. విశాఖ ఉక్కు కర్మాగాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరాలి' అని అందులో పేర్కొన్నారు. ఈ తీర్మానంలో కొన్ని పదాలపై తమకు అభ్యంతరం ఉందని.. వాటిని సవరిస్తే ఆమోదం తెలపడానికి తమకు అభ్యంతరం లేదని అధికార పక్షం స్పష్టం చేసింది. లోకేశ్ జోక్యం చేసుకుని.. 'అసలు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ఎక్కడ? దానిని ఇప్పటికే పునరుద్ధరించాం. వైసీపీ తీర్మానం అసందర్భంగా ఉంది. ఆరు నెలల ముందు పెట్టి ఉంటే సందర్భోచితంగా ఉండేది. అప్పుడు తయారుచేసిన ప్రతిని ఇప్పుడు తీసుకొచ్చారు' అని వ్యాఖ్యానించారు. తమ తీర్మానాన్ని సవరణలు లేకుండా ఆమోదించాల్సిందేనని.. లేకుంటే ఓటింగ్‌కు వెళ్తామని బొత్స ప్రకటించారు. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏం చేస్తున్నామో లోకేశ్ ఇప్పటికే స్పష్టంగా చెప్పారని.. తమ తీర్మానాన్ని ఉపసంహరించుకుంటారా లేదా అనేది వైసీపీ విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. తర్వాత ఆ తీర్మానాన్ని మండలి ఛైర్మన్ తీసుకుని టేబుల్‌పై ఉంచారు. ఓటింగ్‌కు పెట్టలేదు. మొత్తానికి విశాఖ ఉక్కుపై వైసీపీ అస్పష్ట వైఖరితో సెల్ఫ్ గోల్ వేసుకుందన్న వ్యాఖ్యలు వినవచ్చాయి. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైన లఘు చర్చ సాయంత్రం 4.22 గంటల వరకు సుదీర్ఘంగా సాగడం గమనార్హం.

అప్పుడు, ఇప్పుడు కాపాడింది ఎన్‌డీఏనే..

'గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడింది టీడీపీ, బీజేపీయే. 1998లోనే రూ.1350 కోట్లు కేటాయించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా కాపాడుకున్నాం. ఆ ట్రాక్ రికార్డ్ మాకు ఉంది. కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. అందరితో చర్చించాం. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకే ఏపీకి మినహాయింపు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి రూ.11,500 కోట్లు కేటాయించింది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని కలిశారు. నిర్మలా సీతారామన్‌తో రాత్రి 12.38 గంటలకు భేటీ అయ్యారు. మా దగ్గర ఫొటో ఉంది. కావాలంటే మీకు పంపిస్తా.. ఆ మీటింగ్‌లో ప్రైవేటీకరణ జరగకూడదని రివైవల్ ప్యాకేజీ ప్రకటించారు. కుమారస్వామి, నిర్మలా సీతారామన్, ప్రధాని మోదీ ముగ్గురు కలిసి విశాఖ ఉక్కుకు పెద్దఎత్తున నిధులు కేటాయించి ఆదుకున్నారు. ఇదీ మా ప్రభుత్వ చిత్తశుద్ధి. మేమెప్పుడూ కేసుల మాఫీ కోసం ఢిల్లీ గడప తొక్కలేదు. ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రం గురించే అడిగామే గానీ.. సొంత ప్రయోజనాల కోసం అడగలేదు. రూ.11,500 కోట్లలో ఇప్పటికి రూ.9,800 కోట్లు ప్లాంటు ఖాతాలో డిపాజిట్ చేసిన ఘనత కూడా ఎన్‌డీఏ ప్రభుత్వానిదే. వైసీపీ హయాంలో ఒకే ఫర్నిస్ నడిచేది. ఉత్పాదన సామర్థ్యం ఆనాడు కేవలం 48 శాతం. సుమారు రూ.25 వేల కోట్లు అప్పు ఉండేది. ఇప్పుడు మేం మూడు ఫర్నిస్‌లను యాక్టివేట్ చేశాం. దాదాపు 80 శాతం కెపాసిటీ యుటిలైజేషన్‌కు తీసుకొచ్చాం' అని లోకేశ్ చర్చ సందర్భంగా స్పష్టం చేశారు.


ఉర్సాకు రూపాయికే ఎకరం ఇచ్చారన్న బొత్స

నిరూపిస్తే రాజీనామా చేస్తానని లోకేశ్ సవాల్

పరిశ్రమలకు విలువైన భూములు దారాదత్తం చేస్తున్నారని.. ఉర్సా కంపెనీకి రూపాయికే ఎకరం భూమి కట్టబెట్టారని బొత్స ఆరోపించారు.



దీనిని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని లోకేశ్ సవాల్ చేశారు. 'టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీలకు మాత్రమే రూపాయికి భూములు ఇచ్చాం. ఇక ఏ కంపెనీలకూ ఇవ్వలేదు. ఈ రెండు కంపెనీలకు భూములు ఇవ్వొచ్చో లేదో బొత్స సత్యనారాయణ క్లారిటీ ఇవ్వాలి. మళ్లీ అధికారంలోకి వస్తే కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించిన భూములను రద్దు చేస్తామని వైసీపీ బెదిరిస్తోంది. టీసీఎస్ దీని గురించి అడుగుతోంది. దీనిపై బొత్స స్పష్టత ఇవ్వాలి' అని నిలదీశారు. టీసీఎస్, కాగ్నిజెంట్ 25 వేల చొప్పున ఉద్యోగాలు కల్పిస్తాయని.. రూ.15 వేల కోట్ల విలువైన ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయని చెప్పారు.



వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం లోపలి భాగంలో జరుగుతున్న లైనింగ్ పనులు

వెలిగొండ పనుల్లో వేగం

రెండో సొరంగం లైనింగ్‌కు ఏర్పాట్లు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం జీవనాడి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సొరంగం అంతర్భాగంలో చేపట్టిన లైనింగ్ పనుల్లో అక్కడక్కడా సమస్యలు ఎదురవుతున్నాయి. సొరంగం లోపలి దరి(లూజ్‌సాయిల్) పటిష్టంగా లేకపోవడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎంతవరకు లూజ్ సాయిల్ ఉందో జియాలజిస్టులను రప్పించి పరిశీలించగా.. 125 మీటర్ల వరకు పటిష్ఠంగా లేనట్లు గుర్తించారు. ఈ పరిస్థితుల్లో నిర్మాణ పనులు ఏ విధంగా చేయాలో మార్గనిర్దేశం చేయాలని ఇంజనీరింగ్ అధికారులు.. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. 300 మీటర్ల వరకు నిలిపివేసి.. లైనింగ్ పనులు ప్రారంభించారు. మరోవైపు.. రెండో సొరంగంలో పై పెచ్చులూడి పనులకు ఆటంకం ఏర్పడిందని, కార్మికులు ఆందోళనకు గురై పరుగులు తీశారని సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ అయింది. దీనిపై వెలిగొండ ఈఈ కృష్ణారెడ్డి స్పందించారు. గత నెలలో సొరంగం అంతర్భాగంలో లైనింగ్ పనులు చేస్తుండగా 15.595 కిలోమీటరు వద్ద లూజ్ సాయిల్ ఉండడంతో పెచ్చులు ఊడిపడ్డాయని.. అది పనుల్లో భాగంగా జరిగిందని తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదన్నారు.

నేడు సమన్వయకర్తలతో జగన్ భేటీ

» ప్రభుత్వంపై సోషల్ మీడియా ప్రయోగంపై నిర్దేశం!

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ సమన్వయకర్తలతో బుధవారం సమావేశం కానున్నారు. భేటీలో 175 అసెంబ్లీ.. 25 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలు పాల్గొంటారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాను బలంగా వినియోగించుకోవడం.. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడం లక్ష్యంగా జగన్ దిశానిర్దేశం చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా రావాలని ఆదేశాలు వెళ్లాయి. అయితే బుధవారం శాసన మండలిలో మెడికల్ కాలేజీలపై చర్చ జరుగనుంది. దీంతో ఈ భేటీకి ఎమ్మెల్సీలకు మినహాయింపు ఇచ్చారు.

ప్రతిపక్ష నేత హోదా ఇప్పించండి!

(మొదటి పేజీ తరువాయి)

అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ చట్టంలోని సెక్షన్ 12-బీకి విరుద్ధమని ప్రకటించాలని కోరారు. ప్రతిపక్షనేత హోదా కల్పించేలా ఏపీ శాసన వ్యవహారాల కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని విన్నవించారు. ఇందులో శాసన సభ కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, స్పీకర్ కార్యదర్శి, వ్యక్తిగత హోదాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా చేర్చారు. నిజానికి... తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేలా ఆదేశించాలంటూ గత ఏడాది జూలైలో జగన్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పీకర్ రూలింగ్ ఇచ్చారు. ఇప్పుడు స్పీకర్ రూలింగ్‌ను రద్దు చేసి, తనను ప్రతిపక్షనేతగా గుర్తించాలంటూ జగన్ మంగళవారం మరో పిటిషన్ వేశారు. "నాది అసమంజసమైన కోరికగా స్పీకర్ రూలింగ్‌లో పేర్కొన్నారు. అందులోని భాషను పరిశీలిస్తే నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయానికి వచ్చినట్లుగా ఉంది. న్యాయ నిష్పాక్షికత, పార్లమెంటరీ బాధ్యత, సమర్థ ప్రతిపక్షమనే మూలసూత్రాన్ని స్పీకర్ విస్మరించారు. ఏపీ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 12-బిలో ప్రతిపక్ష నేతను నిర్వచించారు. దీని ప్రకారం ఆ హోదా పొందేందుకు నేను అర్హుడిని" అని అన్నారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రానుంది.

వైసీపీ ఎమ్మెల్యేలపై ఎథిక్స్ కమిటీ దృష్టి

» సభకు రాకుండా సంతకాలు పెట్టడం.. జీతభత్యాలు తీసుకోవడంపై చర్చ

» తదుపరి భేటీలో చర్చించి నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేసి, జీతభత్యాలు తీసుకోవడంపై శాసనసభ ఎథిక్స్ కమిటీ దృష్టి సారించింది. ఎథిక్స్ కమిటీ తొలి సమావేశం మంగళవారం కమిటీ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా రిజిస్టర్‌లో సంతకాలు పెట్టడం, జీతభత్యాలు తీసుకోవడం, అలాగే ఎమ్మెల్యేలు బహిరంగ వేదికలు, సామాజిక మాధ్యమాల్లో అసభ్యపదజాలం వాడటంపైనా చర్చ జరిగింది. ఈ రెండు అంశాలు ఆమోదయోగ్యమేనా అనేదానిపై ఎథిక్స్ కమిటీ తదుపరి సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. వచ్చే సమావేశం నాటికి ఎమ్మెల్యేల హాజరుపట్టీని తమ ముందు ఉంచాలని శాసనసభ సెక్రటేరియట్‌ను కమిటీ ఆదేశించింది. ఎథిక్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, బత్తుల బలరామకృష్ణతో పాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంపై రెండు ఏరోస్పేస్ సంస్థల ఆసక్తి

» చిన్న విమానాల తయారీ యూనిట్ స్థాపనకు మనో ఎయిర్‌క్రాఫ్ట్ సంసిద్ధత

» విమానాల కంట్రోల్ సిస్టమ్స్, హార్డ్‌వేర్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు డలాఫ్ట్ సిద్ధం

» మంత్రి బీసీ జనార్దనరెడ్డితో భేటీ



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో భేటీ అయిన మనో ఎయిర్ క్రాఫ్ట్ సర్వీసెస్ ప్రతినిధులు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్ రంగంలో ఉన్న అవకాశాలను మన రాష్ట్రం అందిపుచ్చుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, పాలసీలతో ఆ రంగంలో పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చిన్న తరహా విమానాల తయారీ యూనిట్‌ను స్థాపించేందుకు మనో ఎయిర్‌క్రాఫ్ట్ సంసిద్ధత వ్యక్తం చేసింది. రెండు, మూడు సీట్ల సామర్థ్యం ఉన్న విమానాలను తయారు చేయడంలో కోయంబత్తూరుకు చెందిన ఆ సంస్థకు అనుభవం ఉంది. మంగళవారం సచివాలయంలో రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని మనో ఎయిర్‌క్రాఫ్ట్ సర్వీసెస్ ప్రతినిధి విఘ్నేష్ కలిశారు. టూ సీటర్, త్రీసీటర్ సామర్థ్యంతో చిన్న విమానాలను తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. డీపీఆర్‌ను సమర్పిస్తే పరిశీలించి ఆమోదం తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

మంత్రిని కలిసిన డలాఫ్ట్ ప్రతినిధులు

రాష్ట్రంలో సంస్థను స్థాపించేందుకు చెన్నై కేంద్రంగా పనిచేసే డలాఫ్ట్ ఏరోస్పేస్ కూడా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈమేరకు ఆ సంస్థ ప్రతినిధులు దినేశ్, నరేశ్ సచివాలయంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కలిసి చర్చించారు. ఫ్లైట్ డైనమిక్స్, కంట్రోల్ సిస్టమ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో తమకు అనుభవం ఉందని మంత్రికి సంస్థ ప్రతినిధులు వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం, ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయని ఈ సందర్భంగా మంత్రి జనార్దనరెడ్డి చెప్పారు. సుస్థిర ప్రభుత్వం, బలమైన నాయకత్వం కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం పూర్తి బాసటగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రం ఏరోస్పేస్ హబ్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏవియేషన్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తిని చూపడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.


మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం

» వర్గీకరణ బిల్లు ప్రతిపాదించిన మంత్రి డోలా

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం మూడు బిల్లులు ఆమోదం పొందాయి. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లు-2025ను సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రతిపాదించారు. గ్రామాల్లో వసూలు చేసే నాలా రుసుములను ఆయా పంచాయతీల్లో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించుకునేందుకు చట్టంలో సవరణలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2025ను పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ తరఫున పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. వీటితోపాటు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రతిపాదించిన భారతీయ నాగరిక సురక్ష సంహిత (ఏపీ సవరణ) బిల్లు-2025ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మరోవైపు మాన్యువల్ స్కావెంజర్స్ నియామకాల రద్దు కోసం మంత్రి డోలా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

దివంగత మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం

ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపం ప్రకటించింది. ఆలూరు మాజీ ఎమ్మెల్యే గుడ్లన్నగారి లోకనాథ్, రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండరాయుడు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం, విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు, అనంతపురం జిల్లాకు చెందిన కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు జిల్లాకు చెందిన తాటిపర్తి చెంచురెడ్డిల మృతికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.



ప్రభుత్వ జీతం.. ఫోనూ తీసుకోని చాగంటి



విద్యార్థుల్లో నైతిక విలువల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని, చాగంటి కోటేశ్వరరావును నైతిక విలువ అంశానికి సలహాదారుగా నియమించామని, ఆయన రూపొందించిన పుస్తకాలనే విద్యార్థులకు ఇస్తున్నామని మంత్రి లోకేశ్ మండలిలో చెప్పారు. ఆయన ఒక్క రూపాయి జీతం కానీ, ప్రభుత్వ సొమ్ముతో ఫోన్ కానీ, వాటర్ బాటిల్ కూడా తీసుకోవట్లేదన్నారు. చాగంటిని అందరూ అభినందించాలన్నారు. వైసీపీ సభ్యుడు సూర్యనారాయణ మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను విడిగా కూర్చోబెడుతూ వివక్ష చూపుతున్నారని చెప్పారు. దీనిపై లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు తమ దృష్టికి రాలేదని, ప్రభుత్వం దృష్టి తెస్తే.. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ప్రగతికి మార్గం పీపీపీలే!

(మొదటి పేజీ తరువాయి)

కాలేజీల నిర్మాణంపై తలెత్తుతున్న అనుమానాలను ఈ సందర్భంగా నివృత్తి చేశారు. ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు. సిజేరియన్లు అధికంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని, ఈ విధానాన్ని ప్రభుత్వం సమర్థించబోదని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

'పులివెందుల'కు మాత్రమే మెడికల్ కళ

"గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలు కట్టినట్లు కడితే మరో 23 ఏళ్లు పడుతుంది. అంతకాలం మనుషులు బతికి ఉండాలి... అప్పుడుగానీ కాలేజీలు సిద్ధం కావు. కానీ, మేం అలా కాదు. పీపీపీ విధానంలో పూర్తి చేస్తాం. 17 మెడికల్ కాలేజీలు కట్టేశామని గొప్పలు చెప్పుకొని, ఫేక్ మాట్లాడి ప్రజల్ని గత వైసీపీ ప్రభుత్వం మభ్య పెట్టాలని చూసింది. ఇది సరికాదు. వాస్తవాలను వాస్తవాలుగానే చూడాలి. 17 మెడికల్ కాలేజీలు పెడతామని ఆనాడు ప్రకటించి, వీళ్ల (వైసీపీ) ఖర్చు చేసింది కేవలం రూ.1550 కోట్లు. అవన్నీ పూర్తి కావాలంటే మొత్తం రూ. 8480 కోట్లు ఖర్చు చేయాలి. అంటే వీళ్ల ఐదేళ్లలో వ్యయం చేసింది 17శాతమే. మేం రాగానే రూ.783 కోట్లు (తొమ్మిది శాతం) విడుదల చేశాం. రాజమండ్రి మెడికల్ కాలేజీకి రూ.487 కోట్లకుగాను నాడు కేవలం రూ.81 కోట్లు ఖర్చు చేశారు. మేం 82 కోట్లు ఇచ్చాం. జగన్ ఊరు కాబట్టి పులివెందుల మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లగాను రూ.396 కోట్లు ఖర్చు పెట్టారు. పార్వతీపురానికి రూ.600 కోట్లు కావాల్సి వస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వాస్తవం ఇది కాగా, 'కాలేజీ కట్టేశాం.. మీరు దానిని ప్రైవేటుకు ఇస్తున్నారు' అని ఆరోపిస్తున్నారు. వీళ్లను ఏమనాలో తెలియడం లేదు. మనం ఆనాడు విజయనగరంలో ట్రైబల్ యూనివర్సిటీ పెట్టాలని నిర్ణయించాం. ఎయిర్‌పోర్టు దగ్గర మంచి వర్సిటీ వస్తుందని భావించాం. కానీ దాన్ని గత పాలకులు సాలూరికి తీసుకువెళ్లారని చెప్పారు. సాలూరుకు తీసుకువెళ్లారని దానిని అడ్డుకోను. సాలూరులో ట్రైబర్ వర్సిటీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాను. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలూ చెల్లించాం."

ఆరోగ్యం మెరుగు.. పేద విద్యార్థులకు సీట్లు

"ఆనాడు అన్ని విభాగాలను ధ్వంసంచేశారు. వాటిని సరిచేయడానికి చాలా సమయం పడుతుంది. అనుభవం ఉంది కాబట్టి చేయగలుగుతున్నాం. లేదంటే పిచ్చి బట్టి పారిపోయే పరిస్థితి. స్వభావరీత్యా నేను విధ్వంసాలకు దూరం. ఆనాడు వైద్యరంగాన్ని అభివృద్ధి చేయకపోగా.. మేం ఆ పని చేస్తుంటే వీళ్లు అబద్ధాలు చెబుతున్నారు. పీపీపీ కొత్తగా మనం తెచ్చింది కాదు. యూపీ, ఒడిశా, జార్ఖండ్‌లో పీపీపీకి ఇస్తున్నారు. ఐఐటీ చెన్నై, ఉదయపూర్ ఐఐఎం, నాగపూర్ ఐఐటీలో మౌలిక సదుపాయాల కల్పనను ప్రైవేటుకు అప్పగించారు. పీపీపీ విధానంలో ప్రతి పేదవాడి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. పేద విద్యార్థులకు ఎక్కువ సీట్లు వస్తాయి. ఎమ్మెల్యేలు ఈ విధానం గురించి తెలుసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్రంలో 1995-96 నాటికి ఆరు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. 2004నాటికి, అంటే పదేళ్లలో నా హయాంలో ఎనిమిది కాలేజీలు తెచ్చాను. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో 18, ప్రైవేటురంగంలో 18, ఎయిమ్స్ 1, గీతం 1 మొత్తం కలిసి 38 కాలేజీలున్నాయి. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పేదఇంటికి ప్రపంచంలో ఉండే ఆధునిక విజ్ఞానం చేరవేయడమే సంజీవని కార్యక్రమం లక్ష్యం. దీనిని కచ్చితంగా అమలు చేస్తే నా జీవతంలో ఇంతకంటే మంచి కార్యక్రమం మరొకటి ఉండదు. క్వాలిటీ చెకప్‌లో 70.7 శాతం సంతృప్తి ఉంది. బెంచ్‌మార్కులో 80 శాతం కచ్చితంగా ఉండాలి. 90 ప్లస్‌కు చేరాలి."

అన్నీ అసత్యాలే..

"కాలేజీలు, సీట్ల గురించి మొత్తం అసత్యాలే చెబుతున్నారు. పాత మెడికల్ కాలేజీల్లో 15 శాతం ఆల్ ఇండియా కోటా, 85 శాతం సీట్లు ప్రభుత్వానికి వస్తాయి. కొత్త కాలేజీల్లో ఆల్ ఇండియా కోటా 22 సీట్లు (15శాతం) వెళ్లగా, కన్వీనర్ కోటా 64 సీట్లు (42.5శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ (మేనేజ్‌మెంట్ కోటా) 45 సీట్లు (29.75శాతం), ఎన్ఆర్ఐ కోటా 19 సీట్లు (12.75) ఉండేలా గత ప్రభుత్వంలో కేటాయింపులు చేశారు. మా ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీలో ఆలిండియా కోటా సున్నా, కన్వీనర్ కోటా 75 సీట్లు (50శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ 53 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు ఇస్తున్నాం. 11 సీట్లు (కన్వీనర్ కోటా) అదనంగా ప్రతి కాలేజీలో ఇస్తున్నాం. ఇంకెక్కడ మేం పేదలకు అన్యాయం చేశామో చెప్పాలి. నోరుంది. ఏదైనా మాట్లాడతా.. ఫేక్ న్యూస్ పెడతాం... మీరు ఏదైనా చేయండని అంటున్నారు. అసలు మనం ఎక్కడికి పోతున్నాం? మీరు కడితే 23 ఏళ్లు పడుతుంది. మేం రెండేళ్లలో పూర్తిచేసి చూపిస్తాం. ప్రైవేటుకు ఇవ్వడం కాదు.. పీపీపీ విధానంలో నిర్మాణాలకు ఇస్తున్నాం. పీపీపీ కింద తయారైన మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తాం. మందులు ఉచితం. ఎన్టీఆర్ వైద్య సేవ అమలు చేస్తాం. వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తాం. పేద వాళ్లకు అన్యాయం జరగకుండా చికిత్స, సీట్లలో వారికి అండగా నిలుస్తాం."

ఆరోగ్యాంధ్రే లక్ష్యం...

"అందరికీ ఆరోగ్యం మన లక్ష్యం. రాష్ట్ర జనాభా 5.37 కోట్లు. 2047 నాటికి 5.41 కోట్లకు చేరతాం. 2047 నాటికి భారతదేశ జనాభా 162 కోట్లకు చేరుతుంది. దేశంలో యువకుల సమస్య పొంచి ఉంది. రాష్ట్రంలో 1.54 శాతం జననాల రేటు ఉంది. అది 2.1 శాతం కంటే తగ్గితే రాబోయే రోజుల్లో జనాభా తగ్గుతుంది. 2047నాటికి 1.35 శాతం మాత్రమే ఉంటుంది. మన ప్రయత్నం 2.1 శాతం చేరుకోవాలని.. భారతీయ ప్రభుత్వ వైద్య ప్రమాణాల ప్రకారం ఆరోగ్య పరంగా మనం మెరుగ్గా ఉన్నాం. డబ్ల్యూహెచ్‌వో నిబంధనల ప్రకారం వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది విషయంలోను మనం ఫరవాలేదు. ఆరోగ్యాంధ్రే లక్ష్యం."

పది టాస్క్‌ఫోర్స్‌లు వేస్తాం..

"రాష్ట్రంలో ప్రధానంగా గుర్తించిన పది వ్యాధుల నివారణపై దృష్టిపెట్టాం. దీనికోసం మన దగ్గర ఉన్న ఉత్తమ వైద్యులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య నిపుణులను తెచ్చి 10 టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేస్తాం. ఆయా వ్యాధులు ఏ జిల్లాలో ఉన్నాయో గుర్తించి ముందుకెళతాం. టాటా, బిల్‌గ్రేట్స్‌తో కలిసి ఆరోగ్య సంరక్షణ కోసం పని చేస్తున్నాం. 'రియల్ టైమ్ మోనిటరింగ్ - పర్సనలైజ్ హెల్త్ కేర్ ఫర్ ఆల్ రెసిడెన్స్'.. లక్ష్యంతో ముందుకెళుతున్నాం. పేదవాళ్లందరికీ రూ.25 లక్షల బీమా సదుపాయం కల్పిస్తున్నాం."

డిప్యూటీ స్పీకర్‌కూ వర్తిస్తుంది..

"ప్రధాని మంత్రి నరేంద్రమోదీకి 75 ఏళ్లు. నా కంటే ఆరు నెలలు చిన్న. దేశం కోసం ఈ వయసులో ఆయన అద్భుతంగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆయన లీవ్ తీసుకులేదు. నేను కూడా లీవ్ తీసుకోలేదు. ఆరోగ్యమే ఔషధం.. వంటిల్లే వైద్యశాల.. అనేది నేను ఎప్పుడూ చెబుతుంటాను. దానిని అనుసరిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుంది. రామ్‌దేవ్ బాబాను కలిసినప్పుడు.. 120 ఏళ్ల పాటు తినాల్సిన ఆహారం 40 ఏళ్లలోనే తినేస్తున్నారని ఆయన తెలిపారు. ఇది డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు కూడా వర్తిస్తుంది. (సరదాగా. సభలో నవ్వులు..) గతంలో మా ట్రస్ట్ ద్వారా న్యూట్రి ఫుడ్స్ ప్రారంభించాం. ఇప్పుడు ఏడు లక్షల మంది సభ్యులు ఉన్నారు. న్యూట్రి ఫుడ్స్ విధానం కింద పరీక్షలుచేసి.. సలహాలు ఇస్తున్నాం. మూడు నెలలకు ఒకసారి 41 రకాల పరీక్షలు చేసుకుని చాలామంది ఆహారనియంత్రణ పాటిస్తున్నారు."

సిజేరియన్ తగ్గాలి...

'రాష్ట్రంలో 52 నుంచి 62 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. ఇందులో 90 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య కింద జరిగే ఆపరేషన్లలో సిజేరియన్ల కోసం 4.12 శాతం ఖర్చుపెడుతున్నాం. డెలివరీ డేట్ నెల ముందే చెబుతున్నారు. ముహూర్తం పెడుతున్నారు.. ఇది చాలా తప్పు. ప్రమాదకర ధోరణి. డాక్టర్లు డబ్బుల కోసం సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్నారు. దీంతో సిజేరియన్లు మన రాష్ట్రంలోనే అధికంగా ఉంటున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి వారితో మాట్లాడాలి. దేవుడిచ్చిన సహజసిద్ధ శరీరాన్ని కోయడం సరికాదు. వేరే ఆరోగ్య సమస్యలు ఉంటే తప్ప, సాధారణ డెలివరీలనే ప్రోత్సహించాలి."

ఎమ్మెల్యేలు పాజిటివ్ కర్మ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

హార్డ్ వర్క్ చేయడం లేదు. టెక్నాలజీ వల్ల అన్ని సులువుగా తెలిసిపోతున్నాయి.. పాజిటివ్ కర్మ చేస్తే మళ్లీ ఎమ్మెల్యేలుగా మీరే వస్తారు." అని సూచించారు. కాగా, తాను, మంత్రి అచ్చెన్న సీఎం సూచించిన పాజిటివ్ కర్మ చేసేందుకు ప్రయత్నిస్తామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. సీఎం ప్రసంగంలో మంచి నిద్ర ప్రస్తావన వచ్చినప్పుడు.. 'మీరు సరిగా నిద్రపోవడం లేదు' అని అంటున్నారని రఘురామ సరదాగా అన్నారు. ఎమ్మెల్యే కామినేని ఆరోగ్యంగా కనిపిస్తున్నారని మరో సందర్భంలో.. సీఎం అన్నారు. కాగా, రాష్ట్రంలో ఆరోగ్యశాఖ పనితీరు దేశంలోనే అద్భుతంగా ఉందని మంత్రి సత్యకుమార్ అన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం

66,57,509 మంది విద్యార్థులకు లబ్ధి

» వాట్సాప్‌లో ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం: లోకేశ్

» పారిశుధ్య కార్మికుల పిల్లలకు పథకం అందట్లేదు: చైర్మన్



అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని మంత్రి లోకేశ్ మంగళవారం శాసనమండలిలో చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు అడిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. '66,57,509 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చాం. విద్యార్థుల నుంచి మినహాయించిన రూ.2వేలు పాఠశాల నిర్వహణ, మౌలిక వసతులకు వినియోగిస్తాం' అని చెప్పారు. వైసీపీ సభ్యులు రమేశ్‌యాదవ్, ఇజ్రాయేల్ మాట్లాడుతూ 'అధికారంలోకి రాగానే అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. తొలి ఏడాది ఇవ్వలేదు. రెండో ఏడాది కూడా అర్హులందరికీ ఇవ్వలేదు. ఆప్కోస్ సిబ్బందితోపాటు రేషన్ కార్డు లేకపోయినా, 300 యూనిట్లు వాడినా పథకం వర్తింపజేయలేదు. కేవలం 57లక్షల మందికే ఇచ్చారు' అని విమర్శించారు. దీనికి లోకేశ్ బదులిస్తూ.. 'వైసీపీ హయాంలో రూ.13వేలే ఇచ్చి, చివరలో ఇంకో రూ.500 తగ్గించారు. గత ప్రభుత్వం పెట్టిన రూల్స్‌నే మేం ఫాలో అవుతున్నాం. ఒకటో తరగతి విద్యార్థులకు అపార్ ఐడీ మంజూరయ్యాక, ఇంటర్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులకు తర్వాత నిధులు విడుదల చేస్తాం. తప్పులపై మనమిత్ర వాట్సాప్‌లో మెసేజ్ పెట్టినా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. పారిశుధ్య కార్మికుల పిల్లలకూ పథకం రావట్లేదని మండలి చైర్మన్ ప్రస్తావించగా, అర్బన్ ప్రాంతాల్లో నెలకు రూ.12వేలు ఆదాయం ఉంటే పథకాన్ని ఇవ్వట్లేదని లోకేశ్ చెప్పారు.

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీకి అనుమతులున్నాయా?: టీడీపీ

కడప జిల్లాలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ సైన్స్ ఆర్ట్స్ యూనివర్సిటీకి అనుమతులున్నాయా? అని టీడీపీ సభ్యులు రాంగోపాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రవిచంద్ర ప్రశ్నించగా.. మంత్రి లోకేశ్ జవాబిస్తూ.. '2020-21లో అనుమతులు లేకుండా అడ్మిషన్లు ప్రారంభించారు. మొదటి రెండు బ్యాచ్‌ల విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఆ విద్యార్థులు మాజీ సీఎంను కలిసినప్పుడు మాపై దాడి చేశారు. మేమేదో అన్యాయం చేశామని మాట్లాడారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఎలా ప్రారంభించారో అర్థం కావట్లేదు. బాధిత విద్యార్థులు నన్ను కలిసి, బాధలు చెప్పుకొంటే కేంద్రంతో మాట్లాడి, సమస్యను పరిష్కరించాం. గత ఆగస్టు నాటికి అనుమతులు తీసుకున్నారు. రెండు బ్యాచ్‌లకు అనుమతి తెచ్చాం. ప్రొఫెసర్ల నియామకంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నోటిఫికేషన్ ఆలస్యమై, విషయం కోర్టు పరిధిలోకి వెళ్లింది. న్యాయ వివాదాలు పరిష్కరించి, 4,300 పోస్టులు భర్తీ చేయడానికి, వర్సిటీ భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు.

రోడ్ల అభివృద్ధికి కార్పొరేషన్: మంత్రి జనార్దనరెడ్డి



అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి త్వరలోనే ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఒక్క ఆర్అండ్‌బీ రోడ్డునూ అభివృద్ధి చేయలేదని, రోడ్లు, వంతెనల నిర్వహణను పట్టించుకోలేదని చెప్పారు. రాష్ట్రంలోని రోడ్లు, వంతెనల దుస్థితిపై మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బోడే ప్రసాద్, బండారు సత్యానందరావు, రామాంజనేయులు, కామినేని శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రంలోని రహదారులు, వంతెనలు అధ్వాన్నస్థితికి చేరుకున్న మాట వాస్తవమేనని చెప్పారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1080 కోట్లతో రోడ్లపై పడిన పెద్ద పెద్ద గుంతలను పూడ్చాం. వర్షాకాలం పూర్తయ్యాక మిగిలిన రోడ్లను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలోని 352 వంతెనల పునర్నిర్మాణానికి రూ.1430 కోట్లు అవసరం. 16వ ఆర్థిక సంఘం నిధులతో వాటిని పునర్నిర్మిస్తాం. త్వరలో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని రహదారులను అభివృద్ధి చేస్తాం' అని మంత్రి చెప్పారు.

నో అంకుల్.. ఓన్లీ బాలయ్య

కావలి గ్రీష్మతో బాలకృష్ణ సరదా సంభాషణ

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'నో అంకుల్... ఓన్లీ బాలయ్య' అంటూ టీడీఎల్పీ కార్యాలయంలో సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ సందడి చేశారు. మంగళవారం అసెంబ్లి సమావేశాలకు హాజరైన ఆయన విరామ సమయంలో టీడీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి ఆయనతో ఫొటోలు దిగారు. 'నేను తొలిసారి అసెంబ్లీకి వచ్చాను. నన్ను ఆశీర్వదించండి అంకుల్' అని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ... అడిగారు. బాలకృష్ణ నవ్వుతూ... 'నో అంకుల్.. ఓన్లీ బాలయ్య' అనడంతో నవ్వులు విరిశాయి. అఖండ-2 విడుదల ఎప్పుడని వారు ప్రశ్నించగా.. 'ఈ నెల 25న తమ్ముడు పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోంది. అది బాగా ఆడాలని కోరుకుంటున్నా. ఆ తర్వాత మా సినిమా డిసెంబరు 5న విడుదలవుతుంది.' అని అన్నారు. అరకు కాఫీకి ప్రచారం కల్పించాలని మంత్రి సంధ్యారాణి కోరగా బాలకృష్ణ సానుకూలంగా స్పందించారు.




శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో భేటీ అయిన ఎమ్మెల్యే బాలకృష్ణ

అయోమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు: లోకేశ్

టీడీఎల్పీలో ఉన్న బాలకృష్ణను మంత్రి లోకేశ్ వచ్చి పలుకరించారు. అనంతరం అక్కడే ఉన్న మీడియాతో ఆయన మాట్లాడారు. 'శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. జీఎస్టీ అంశంపై వారి పార్టీ అధినేతకు, నాయకులకు మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది' అని లోకేశ్ అన్నారు.

పవన్ కల్యాణ్‌కు వైరల్ జ్వరం

» అలాగే అసెంబ్లీకి, శాఖల సమీక్షలకు..



అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత రెండు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆయన అలాగే శాసనసభ సమావేశాలు, శాఖల సమీక్షలకు హాజరవుతున్నారు. కాగా, మంగళవారం వైద్య పరీక్షలు చేసిన వైద్యులు రెండు రోజుల విశ్రాంతి అవసరమని సూచించారు. దీంతో ఆయన తన శాఖల సమీక్షలను టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య పోస్టుల భర్తీ: సత్యకుమార్



గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి, స్టాఫ్ నర్సుల నియామకాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతపై ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బి.ఎన్.విజయ్‌కుమార్, వేమిరెడ్డి ప్రశాంతి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జయనాగేశ్వరరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. 'గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు వాక్-ఇన్-ఇంటర్వ్యూలు చేపడుతున్నాం. గిరిజన ప్రాంతాల్లోని 153 పీహెచ్‌సీలకు 306 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో 131 పోస్టులు భర్తీ చేశాం. ప్రస్తుతం 31 పోస్టులే ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి వివరించారు. స్టాఫ్ నర్సుల నియామకాల్లో సీహెచ్‌వోలకు వెయిటేజీ ఇస్తామన్నారు. సీహెచ్‌వోలకు రూ.25 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నామని, పనితీరు ఆధారంగా మరో రూ.15 వేల వరకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని చెప్పారు.

పూర్తయిన ఇళ్లకూ బిల్లులివ్వని వైసీపీ: పార్థసారథి



ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకూ గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపివేసిందని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. 2014-19 మధ్య కాలంలోని బకాయిలు మొత్తం రూ.900 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోందన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకున్నవారికి ప్రభుత్వం ఆర్థిక సాయం ఇవ్వడం లేదని ఎమ్మెల్యేలు బత్తుల రామకృష్ణ, బి.రామాంజనేయులు, బుచ్చయ్యచౌదరి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణంలో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పీఎంఏవై 2.0 పథకం కింద 46 వేల ఇళ్లు మంజూరు చేసిందన్నారు.

ఆర్డీటీ రెన్యువల్ సాధిస్తాం: మంత్రి సవిత



అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమ అభివృద్ధిలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) కీలకపాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్య, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేస్తోంది' అని మంత్రి సవిత అన్నారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడారు. 'వందేళ్ల నుంచి అనంతపురం జిల్లా అభివృద్ధికి ఆర్డీటీ దోహదపడుతోంది. ఆసంస్థను ఫారెన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్ఏ) కింద రెన్యువల్ చేసేందుకు కృషి చేస్తాం. ఈ అంశంపై సీఎం చంద్రబాబు సూచన మేరకు కేంద్ర మంత్రి అమిత్‌షా, ఇతర నేతలను కలిశాం. ప్రధానితో మాట్లాడి, రెన్యువల్ చేయిస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ సానా సతీశ్‌కు అప్పగించినట్లు లోకేశ్ తెలిపారు. ఆర్డీటీపై వైసీపీ హడావుడి చేస్తోంది' అని మండిపడ్డారు. మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ... ఆర్డీటీ రెన్యువల్ సాధిస్తామని, దీనిపై రాయలసీమ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇదే అంశంపై ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, దగ్గుపాటి ప్రసాదరావు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ, ఆర్డీటీ అందించిన సేవలను వివరించారు.

వైసీపీ పాలనలో ఆర్థిక ఉగ్రవాదం

కంపెనీలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారు

» పీపీఏలు ఏకపక్షంగా రద్దు చేశారు


» వెనకబడ్డ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం

» మండలిలో స్వల్పకాలిక చర్చలో లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన కాలంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని మంత్రి లోకేశ్ అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. నాటి పాలకుల కారణంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెట్టుబడుల ఆకర్షణకు మెరుగైన పాలసీలు తీసుకొచ్చామని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోటీపడే స్థాయికి రాష్ట్రాన్ని తెచ్చామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిపై శాసనమండలిలో మంగళవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "2019లో ప్రభుత్వం మారాక ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. దీనివల్ల ఆర్థిక అనిశ్చితి ఏర్పడింది. ఏపీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని, టెర్రరిజం అని జగన్‌ను ఉద్దేశించి ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్ దాస్‌పాయ్ అన్నారు. పెట్టుబడిదారుల సెంటిమెంట్ ఎలా వీక్ అయ్యిందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. అప్పట్లో అమర్‌రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, రిలయన్స్ ఎలక్ట్రానిక్స్, కాండ్యూయెంట్, జాకీ లాంటి సంస్థలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. ఏకపక్షంగా పీపీఏల రద్దు వల్ల విద్యుత్‌శాఖపై రూ.10వేల కోట్ల భారంపడింది. సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడకుండా ఏకపక్షంగా ఒప్పందాలు రద్దు చేయడం వల్ల దేశం నష్టపోయింది. అంతే కాదు మన పరువూ పోయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కివెళ్లిపోయింది.

రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభించాం

గత ప్రభుత్వ ఆర్థిక ఉగ్రవాదంవల్లే రాష్ట్ర ప్రజలు 94శాతం సీట్లు ఇచ్చి గెలిపించారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించాం. 25 ప్రపంచ స్థాయి పాలసీలు తీసుకువచ్చాం. ఇప్పటికి రూ. 10.4 లక్షల కోట్ల పెట్టుబడుల కోసం 340 ఎంవోయూలు కుదుర్చుకున్నాం. మరో 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలో జూమ్ కాల్ ద్వారా ఆదిత్య మిట్టల్‌ను సంప్రదించి పెట్టుబడులు పెట్టాలని కోరా. ఆ ఫైల్ సీఎం స్వయంగా ప్రధాని వద్దకు తీసుకెళ్లి మూడుసార్లు మాట్లాడారు. నవంబరులో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తాం. 2029 నాటికి మొదటి వాణిజ్య ఉత్పత్తి కూడా జరగబోతోంది. బీపీసీఎల్, ఎన్టీపీసీ వంటి భారీ సంస్థలు వస్తున్నాయి. ప్రకాశంలో రిలయన్స్ సీబీజీ ప్రాజెక్టు తీసుకొచ్చాం. ఐటీ ఎలక్ట్రానిక్స్‌లో టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఐబీఎం క్వాంటమ్ వ్యాలీ వంటివి వస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనంలో రెన్యూ, టాటా పవర్, ప్రీమియర్ ఎనర్జీ, వారీ వస్తున్నాయి.ఐటీ కంపెనీలకు రూపాయికే భూములు ఎందుకు ఇవ్వాలని జగన్ అడుగుతున్నారు. ప్రిజనరీకి, విజనరీకి తేడా ఉంటుంది. టీసీఎస్ విశాఖలో ప్రత్యక్షంగా 25 వేల ఉద్యోగాలు కల్పిస్తుంది. ఇంకోనెల ఆగితే మరో కంపెనీ వస్తుంది. మా లక్ష్యం విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పన. మేం సింగపూర్ వెళ్తే.. ఏపీలో త్వరలో ప్రభుత్వం మారిపోతోందని పెట్టుబడులు పెట్టవద్దని వైసీపీ నేతలు ఈ మెయిల్స్ పెట్టే పరిస్థితికి దిగజారారు. గత 4నెలల్లో ఏపీ జీడీపీ భారీగా పెరిగింది. 2.4ట్రిలియన్ డాలర్ ఎకానమీ మా లక్ష్యం. ఇందుకు 15% వృద్ధిరేటు రావాలి. దీనికోసం అహర్నిశలు కష్టపడుతున్నాం" అని అన్నారు.



ఫీజు బకాయిలపై చర్చకు సిద్ధమా?

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మంగళవారం శాసనమండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సభ ప్రారంభం కాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. అయినా వైసీపీ సభ్యులు చర్చకు పట్టుబట్టడంపై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 'ఇంత సీరియస్ విషయమైతే బీఏసీలో పెట్టాలి. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.4వేల కోట్ల బకాయిలు పెట్టారు. మళ్లీ వాళ్లే బకాయిల గురించి మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1,200కోట్లు విడుదల చేశాం. పెండింగ్‌లో ఉన్న రూ.1,400కోట్లు వచ్చే 3నెలల్లో విడుదల చేస్తాం. రూ.4వేల కోట్లు బకాయి పెట్టిపోయిన మీరు.. ఇప్పుడు బకాయిల గురించి మాట్లాడితే ఎలా?' అంటూ మండిపడ్డారు. వాయిదా తీర్మానాన్ని తిరస్కరించాక వాదులాట ఏమిటంటూ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. 'మీ హయాంలో బకాయిలు పెట్టినందునే ఎజెండాలోకి తేలేదు. చర్చ జరగాలనుకుంటే.. చైర్మన్‌తో మాట్లాడి ఎజెండాలో పెట్టి ఉంటే.. సమాధానం చెప్పడానికి మేం సిద్ధంగా ఉన్నాం. గత సమావేశాల్లో విద్యా రంగంపై చర్చ పెడితే బహిష్కరించారు. ఇప్పుడైనా సరైనా ఫార్మాట్‌లో వస్తే.. చర్చకు నేను సిద్ధంగా ఉన్నా' అని లోకేశ్ స్పష్టం చేశారు.

అప్పులపై చర్చకు సిద్ధం

» 15 నెలల్లో 35,305 కోట్ల

అప్పులు తెచ్చాం: కేశవ్



అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో మంగళవారం ప్రభుత్వం తీసుకున్న రుణాలపై వైసీపీ సభ్యులు మాట్లాడుతూ.. 15నెలల్లో రూ.2.09లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. దీనికి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం చెబుతూ.. వాళ్ల పత్రికలో రాసిన లెక్కలకు సమాధానం చెప్పమంటే కుదరదన్నారు. 15 నెలల్లో 79,226కోట్ల రుణాలకు ప్రతిపాదించగా, 35,305కోట్లు మాత్రమే తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రుణాలపై చర్చించడానికి తాము సిద్ధమని, గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపైనా చర్చించాలని అన్నారు. కాగా, రాజకీయ నేతల ప్రోత్సాహం, అధికార పార్టీ ఒత్తిళ్లతో పెట్టే అక్రమ కేసుల వల్ల చాలామంది అన్యాయంగా జైళ్లలో మగ్గిపోతున్నారని, అలాంటివారి కేసుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో న్యాయం చేయాలని జనసేన సభ్యుడు కొణిదెల నాగేంద్రరావు(నాగబాబు) సభలో కోరారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి హోంమంత్రి అనిత అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ.. వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు.

అబ్కారీ సవరణ బిల్లుకు ఆమోదం

మంత్రి కొల్లు రవీంద్ర ప్రవేశపెట్టిన అబ్కారీ శాఖ సవరణ బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. ముస్లింయువతకు ఆర్థిక సహాయంపై వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానం ఇస్తూ, 2024-25, 2025-26 సంవత్సరాలకు రూ.173.5కోట్ల చొప్పున కేటాయించామని, నిధులు విడుదల కాగానే 19,790మందికి ప్రయోజనం కల్పిస్తామని చెప్పారు.

నల్లమలలో 87 పెద్దపులులు



- ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించాం
- ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ వెల్లడి

మార్కాపురం, సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): నల్లమల అడవిలో ప్రస్తుతం 87 పెద్దపులులు ఉన్నాయని ప్రాజెక్టు టైగర్-మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురం అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. ఇక్కడ ఉన్న పులులను నాలుగేళ్లకోసారి లెక్కిస్తున్నామని తెలిపారు. 2022లో జాతీయ పులుల గణన సమయంలో 74 ఉన్నాయని, వాటి సంఖ్య ప్రస్తుతం 87కు చేరిందని చెప్పారు. మళ్లీ 2026లో ట్రాప్ కెమెరాల ద్వారా పులుల గణన చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో ఎన్ఎస్‌టీఆర్(నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్) పరిధి విస్తరించనుందన్నారు. నల్లమలలో ఉన్న పులులు ఇప్పటికే కడప, అన్నమయ్య, రాయచోటి జిల్లాలు దాటి శేషాచలం అడవుల వరకు సంచరిస్తున్నాయని చెప్పారు. పులులను ట్రాప్ చేసేందుకు అడవిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, నల్లమలలో ఎకో టూరిజానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, వన్యప్రాణుల సంరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తుమ్మలబైలు, బైర్లూటి, పచ్చర్ల, రోళ్లపాడు ప్రాంతాల్లో రాత్రిపూట సందర్శనకు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వన్యప్రాణుల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పిచ్చిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

లొంగుబాటు యత్నాల్లో మల్లోజుల వేణుగోపాల్!

- పోలీసులకు కోవర్టుగా మారిన మావోయిస్టు అగ్రనేత
- కోవర్టు కుట్ర ద్వారానే కదారి, కట్టా ఎన్‌కౌంటర్.. ప్రజాసంఘాల ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయే యత్నాల్లో ఉన్నారని, ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రజా సంఘాల ప్రతినిధులు, మాజీ మావోయిస్టులు అనుమానిస్తున్నారు. అయితే దీంట్లో వాస్తవం లేదని, మల్లోజుల లొంగుబాటు అనేది ప్రచారం మాత్రమేనని పోలీసు అధికారులు చెబుతున్నారు. లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడానికి ఏ స్థాయి మావోయిస్టులు వచ్చినా వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితో వ్యవహరిస్తామని స్పష్టం చేస్తున్నారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, అభయ్, సోనూను విప్లవ ద్రోహిగా ప్రకటించిన మావోయిస్టు పార్టీ.. తన వద్ద ఉన్న ఆయుధాలను తక్షణం పార్టీకి అప్పగించాలని ఆయనను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయుధాలు అప్పగించకుంటే పీఎల్‌జీఏ (ప్రజా విముక్త గెరిల్లా సైన్యం) వాటిని స్వాధీనం చేసుకుంటుందని కూడా హెచ్చరించింది.

లొంగుబాటు లాంఛనమే!

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి హోదాలో అభయ్ పేరిట ఇటీవల మల్లోజుల వేణుగోపాల్ విడుదల చేసిన లేఖ సంచలనం సృష్టించింది. సాయుధపోరును తాత్కాలికంగా విరమిస్తామని, దీనిపై సహచరులతో చర్చల కోసం నెల రోజుల సమయం ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ప్రస్థానంలోని తప్పొప్పులనూ మరో లేఖలో విశ్లేషించారు. అంతేకాదు, ఓ లేఖ మీద తన ప్రస్తుత ఫోటోనూ జతపరిచారు. ఈ లేఖ వచ్చినపుడే ఆయనపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పోలీసులకు కోవర్టుగా మారిన క్రమంలోనే వేణుగోపాల్ ఇలాంటి లేఖను విడుదల చేశారని విమర్శలు వచ్చాయి. ఆపై మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ తరఫున జగన్ పేరిట విడుదలైన లేఖ ద్వారా.. వేణుగోపాల్ లేవనెత్తిన అంశాలు ఆయన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని, పార్టీకి సంబంధం లేదని వివరణ వచ్చింది. జగన్ లేఖ విడుదలై 48 గంటలు దాటకముందే.. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైన కడారి సత్యనారాయణ రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్‌లో మరణించారని పోలీసులు ప్రకటించారు. వాస్తవానికి అభయ్ లేఖ తర్వాత పార్టీ అభిప్రాయాన్ని తెలియచేయడానికి వీరిద్దరు ఒక లేఖను రూపొందించారని, అది మీడియాకు విడుదల కాకముందే ఎన్‌కౌంటర్‌లో మరణించారని తెలుస్తోంది. కోవర్టు ఆపరేషన్ ద్వారానే పోలీసులు వీరిద్దరినీ పట్టుకొని కాల్చి చంపారని పౌరహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. సాయుధ పోరాటం విరమణ అంటూ అభయ్ పేరిట లేఖ విడుదలైతే.. మావోయిస్టు పార్టీ నాయకత్వం స్పందిస్తుందనే అంచనాతోనే పోలీసులు ఎత్తుగడ వేశారని అంటున్నారు. పార్టీ అగ్రనాయకత్వాన్ని బయటకు రప్పించడంలో భాగంగానే అభయ్ నుంచి లేఖ వచ్చి ఉంటుందని మాజీ మావోయిస్టులు అభిప్రాయపడుతున్నారు. వేణుగోపాల్ లొంగుబాటు ప్రకటన లాంఛనమేనని వారు చెబుతున్నారు.

విశాఖకు 'యాక్సెంచర్'

(మొదటి పేజీ తరువాయి)

భూమి కోసం దరఖాస్తు చేశామని, ఈ వివరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడిస్తుందని యాక్సెంచర్ తెలిపినట్టు పేర్కొంది. యాక్సెంచర్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ దేశాల్లో ఆ సంస్థకు 7.9 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో మూడు లక్షల మంది భారతీయులే కావడం విశేషం. అటువంటి సంస్థ విశాఖపట్నం వస్తే.. ఉద్యోగ అవకాశాలతో పాటు ఇక్కడ ఇతర అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఐటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

విశాఖకు ఐటీ దిగ్గజాలు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కంపెనీ విశాఖలో దశల వారీగా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చింది. ఇందుకోసం రూ.1,370 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. ఆ సంస్థకు ఐటీ హిల్ నంబరు-3పై 21.6 ఎకరాలు కేటాయించారు. క్యాంపస్ నిర్మించుకునే వరకు కార్యకలాపాల నిర్వహణకు మిలీనియం టవర్స్‌లో 2.08 లక్షల చ.అ. విస్తీర్ణం కలిగిన భవనం ఇచ్చారు. మరో పెద్ద ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ విశాఖలో కార్యకలాపాల నిర్వహణకు ముందుకువచ్చింది. కాపులుప్పాడలో 21.31 ఎకరాలు కోరగా వీఎంఆర్‌డీఏ ద్వారా సమకూరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇక్కడ రూ.1,582.98 కోట్లు పెట్టుబడి పెడతామని చెప్పడంతో వారికి కూడా ఎకరా 99 పైసలకే లీజుకు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ సంస్థ ద్వారా దశల వారీగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభిస్తుంది. 2029 మార్చి నాటికి కమర్షియల్ ఆపరేషన్లు ప్రారంభిస్తుంది.

ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టి

కొవిడ్ తరువాత ఐటీ సంస్థలన్నీ ద్వితీయ శ్రేణి నగరాలపై ఆసక్తి చూపుతున్నాయి. భూమి తక్కువ ధరకు లభించడం, తక్కువ జీతాలకు నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉండడం, ట్రాఫిక్ సమస్యలు లేకపోవడంతో పెద్ద కంపెనీలు విశాఖ వంటి నగరాలవైపు మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఐటీ పాలసీ కూడా బలంగా పనిచేస్తోంది. ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తే ఎకరా భూమిని కేవలం 99 పైసలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ ప్రకటించడం, ఇచ్చిన మాట ప్రకారం టీసీఎస్‌కు భూమిని కేటాయించడంతో మిగిలిన కంపెనీలు కూడా ఇదే బాట పడుతున్నాయి.

33 కోట్లు కొట్టేయాలి..

గోవాలో సెటిలవ్వాలి..!

నెలకో లగ్జరీ కారు.. 2 లక్షల అద్దెతో విల్లా

- కోటీశ్వరుడిలా బిల్డప్.. చేసేది దొంగతనాలు
- ఇదీ బత్తుల ప్రభాకరరావు నేర చరిత్ర
- రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీ
- విజయవాడ కోర్టులో హాజరుపర్చి తీసుకెళ్తుండగా పరారీ
- అతడి నేర చరిత్ర తెలిసినా పోలీసుల నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆడి, బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్లను నెలకొకటి మారుస్తాడు..! నెలకు రూ.2లక్షలు అద్దె చెల్లిస్తూ విలాసవంతమైన విల్లాలో ఉంటాడు.. కోటీశ్వరుడిలా బిల్డప్ ఇస్తాడు.. కానీ, అతనో దొంగ..! మామూలు దొంగ కాదు.. రూ.3వేలతో మొదలుపెట్టి రూ.3 కోట్ల వరకూ దోచిన ఘరానా దొంగ..! పేరు బత్తుల ప్రభాకరరావు అలియాస్ బోతా ప్రభాకర్, అలియాస్ రాహుల్ రెడ్డి ఇలా.. రకరకాల పేర్లతో తిరుగుతుంటాడు. చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికిపెంటకు చెందిన 35 ఏళ్ల ప్రభాకరరావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో ఉంటున్నాడు. కేవలం పది చోరీల్లోనే రూ.3 కోట్లు కొల్లగొట్టిన ప్రభాకర్.. దోచుకున్న సొమ్మును విలాసాలకు ఖర్చు చేస్తాడు. పలు రాష్ట్రాల్లో అతనిపై సుమారు 90కిపైగా కేసులున్నాయి. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ప్రభాకర్‌తోపాటు ముగ్గురు నిందితులను ఒక కేసు నిమిత్తం విజయవాడలోని 4వ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచేందుకు ఐదుగురు పోలీసులు సోమవారం జీపులో తీసుకెళ్లారు. కోర్టు రిమాండు పొడిగించడంతో వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 7.30 గంటల సమయంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుద్దుకూరు శివారులో టిఫిన్ చేసేందుకు ఆగిన సమయంలో.. టీ గ్లాసు పడేస్తున్నట్టు నటించిన ప్రభాకర్ ఒక్క ఉదుటున పొలాల్లోకి దూకి పారిపోయాడు. రోజూ జిమ్ చేసే ప్రభా



కర్ రన్నింగ్ బాగా చేస్తాడు. రన్నింగ్‌లో ఉన్న లారీ వెంట పరుగెత్తి అలవోకగా ఎక్కేస్తాడు. దీంతో అతడు దుద్దుకూరు చిట్యాల జాతీయ రహదారిలో ఏదైనా వాహనం ఎక్కి పరారై ఉంటాడని అనుమానిస్తున్నారు. పట్టుకోవడానికి 15 మంది చొప్పున మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. ఈ గజ దొంగ ఆచూకీ తెలియజేసినా, పట్టుకున్నా రూ.50 వేలు నగదు బహుమతి అందజేస్తామని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ మంగళవారం ప్రకటించారు. 2022లో కూడా విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి పరారయ్యాడు. నిందితుడి చరిత్ర తెలిసినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చోరీల ద్వారా రూ.33 కోట్లు సంపాదించి ఆ తర్వాత గోవాలో సెటిలవ్వాలని అనుకున్నాడు. నేరం చేయదలచుకున్న చోటును 1 నుంచి 3 నెలల పాటు పరిశీలిస్తాడు. పక్కా లెక్కలతో దొంగతనం చేస్తాడు.

కృష్ణా జలాల్లో మాకు 64.75 టీఎంసీలు దక్కాల్సిందే!

- కొత్త పేచీ లేవనెత్తిన కర్ణాటక సర్కారు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం రాయలసీమకు గేమ్ చేంజర్‌గా భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై కర్ణాటక ప్రభుత్వం కొత్త వివాదాన్ని లేవనెత్తింది. ఈ పథకం అమలైతే.. కృష్ణాజలాల్లో తమకు 64.75 టీఎంసీలు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేస్తూ కర్ణాటక అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా కేంద్ర జలశక్తి శాఖ అదనపు కార్యదర్శికి ఈ నెల 17న లేఖ రాశారు. పట్టిసీమ ద్వారా ఇప్పటికే తమకు అన్యాయం జరుగుతోందన్నారు.

లేఖలో ఏముంది?

"ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పట్టిసీమ నుంచి 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా నదిలోకి ఎత్తిపోస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఏపీకి 45 టీఎంసీలు, కర్ణాటకకు 21 టీఎంసీలు, మహారాష్ట్రకు 14 టీఎంసీల వాటా దక్కాలి. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి సంబంధించిన 'ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టు'ని గత ఏడాది నవంబరు 11న కేంద్ర జలశక్తి మాకు పంపింది. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంతో 243 టీఎంసీలను తరలించే అవకాశం ఉంది. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా 243 టీఎంసీలు.. పట్టిసీమ ద్వారా 80 టీఎంసీలు తరలిస్తున్నందున.. మాకు 64.75 టీఎంసీల మేరకు కృష్ణా జలాల్లో వాటా ఇవ్వాల్సిందే." అని లేఖలో పేర్కొన్నారు.

ఏపీ వాదన ఇదీ..

పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం పరిధిలోకి రాదని.. అందువల్ల గోదావరి ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. కర్ణాటక వాదనలో పసలేదన్నారు. వాస్తవానికి.. నాగార్జున సాగర్‌కు ముందు అక్విడెక్టును కట్టి, కృష్ణానదిలోకి గోదావరి జలాలను కలువకుండానే.. బనకచర్లవైపు మళ్లిద్దామని అనుకున్నామన్నారు. అయితే, అక్విడెక్టు నిర్మాణానికి దాదాపు రూ.1000 కోట్ల మేర వ్యయం అవుతున్నందున.. కృష్ణా నదిలోకి గోదావరి జలాలను ఎత్తిపోసి.. వాటిని వెంటనే తోడేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఫలితంగా కృష్ణాజలాల వాడకం అనే వాదనకే అర్థం ఉండదన్నారు.

గజల్ శ్రీనివాస్‌కు మాతృ వియోగం



కేశిరాజు రత్నావళి

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ కేశిరాజు (గజల్) శ్రీనివాస్ తల్లి రత్నావళి(87) పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. రత్నావళికి భర్త, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుల్లో రెండో కుమారుడు గజల్ గాయకుడిగా దేశ విదేశాల్లో ప్రఖ్యాతి గడించి, గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. రత్నావళి మృతి పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య తదితరులు సంతాపం తెలిపారు.

ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు..

హైకోర్టులో మాత్రమే ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలి!

- ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదు: హైకోర్టు ధర్మాసనం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదైనప్పుడు.. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు విషయంలో హైకోర్టు ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. పోలీసులు నమోదు చేసిన కేసులో ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ల వర్తింపునకు ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు సీఆర్‌పీసీ సెక్షన్ 438 కింద హైకోర్టులో మాత్రమే ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవాలని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు వెళ్లనవసరం లేదని తేల్చిచెప్పింది. ప్రాథమిక ఆధారాలు ఉంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని సెక్షన్లు 18, 18ఏ కింద ముందస్తు బెయిల్ దాఖలుపై నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. సీఆర్‌పీసీ సెక్షన్ 438 కింద ముందస్తు బెయిల్ పిటిషన్లను విచారించే పరిధి, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్ 14ఏ కింద అప్పిలేట్ పరిధి.. రెండూ హైకోర్టు కలిగి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో పాటు ముందస్తు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లను విచారణ నిమిత్తం తగిన బెంచ్‌కు నివేదించడానికి వీలుగా ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈమేరకు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ వి.సుజాతతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ కోసం ముందుగా సంబంధిత ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. అనంతరం అక్రమ మైనింగ్ వ్యవహారంలో నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ చిలకలూరిపేట సోషల్ మీడియా ఇన్‌చార్జి పిల్లి కోటి ఫిర్యాదు మేరకు మరో మాజీ మంత్రి విడదల రజనిపై చిలకలూరిపేట పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు పెట్టారు. మరికొందరు నిందితులు కూడా హైకోర్టులోని మరో సింగిల్ జడ్జి ముందు ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ విచారణ పరిధిని తేల్చే వ్యవహారాన్ని ద్విసభ్య ధర్మాసనానికి నివేదించాలని ప్రధాన న్యాయమూర్తిని సింగిల్ జడ్జి కోరారు.

నేరాల్లో నాకు సహకరించింది వీరే!

- పోలీసు అధికారులు, ప్రముఖుల పేర్లు బయటపెట్టిన కి'లేడీ' అరుణ?

కోవూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'అవును.. పలు నేరాల్లో పోలీసు ఉన్నతాధికారులే నాకు సహకరించారు' అని నెల్లూరు కి'లేడీ' నిడిగుంట అరుణ గుట్టు విప్పినట్లు సమాచారం. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్న ఆమెను మంగళవారం రెండో రోజు కూడా కోవూరు పోలీసు స్టేషనులో సీఐలు సుధాకర రెడ్డి, నాగేశ్వరమ్మ విచారించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు కేసుల్లో బాధితులు తనపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు అధికారుల వివరాలను అరుణ తెలియజేసింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా రౌడీషీటర్ శ్రీకాంత్‌కు, తనకు సహకరించిన పోలీసు అధికారుల జాబితాను కూడా ఇచ్చినట్లు తెలిసింది. అంతేగాక పలు నేరాలతో సంబంధమున్న ప్రముఖుల వివరాలనూ తెలియజేసినట్లు చెబుతున్నారు. పోలీసు కస్టడీ బుధవారం మధ్యాహ్నం వరకూ ఉంది. ఈలోపు మరిన్ని వివరాలు తెలుసుకోవాలని భావిస్తున్నారు.

పరకామణి బాధ్యులకు శిక్ష తప్పదు: మాధవ్

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ పరకామణి అవకతవకలపై వైసీపీ సమాధానం చెప్పాలి. బాధ్యులు ఎంతటివారైనా, ఎవ్వరైనా శిక్ష తప్పదు. కూటమి ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంటుంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అన్ని జిల్లాల ప్రతినిధులతో సంకల్ప్ అభియాన్ కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ 'ఆత్మనిర్భర్ భారత్‌ను ముందుకు తీసుకెళ్దాం. 'ప్రతి ఇంటికీ స్వదేశీ.. ప్రతి ఇంటా స్వదేశీ' కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రతి ఇంటికీ తీసుకెళ్దాం. మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరిలోనూ స్వదేశీ వినియోగం, జీఎస్టీపై అవగాహన రావాలి. ఆ బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్త తీసుకుని దేశ సేవ కోసం పాటు పడాలి' అని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడిలో స్వదేశీ భావన కలిగితే ట్రంప్ పన్నుల ప్రభావం గోరంత కూడా ఉండదని జాతీయ కో కన్వీనర్ హెచ్.రాజా చెప్పారు.

కసిరెడ్డి ఆరోగ్యంపై వైద్య బృందం ఏర్పాటు

- పరీక్షల నివేదికను 6లోగా సీల్డ్ కవర్‌లో ఇవ్వాలి
- ఏసీబీ కోర్టు ఆదేశాలు



విజయవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన మధ్యంతర బెయిల్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఒక వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించి న్యాయాధికారి పి.భాస్కరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి... అనారోగ్య కారణాల రీత్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కొద్దిరోజుల క్రితం పిటిషన్ దాఖలు చేశారు. తాను బోన్‌మ్యారో సమస్యతో బాధపడుతున్నానని, దీనికి వైద్యం చేయించుకోకపోతే క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి తీర్పును వెలువరించడానికి ముందుకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాజశేఖర్‌రెడ్డికి ఆ సమస్య ఉందో లేదో నిర్ధారించడానికి వైద్యనిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజశేఖర్‌రెడ్డికి ఏరోజు పరీక్షలు చేస్తారో ఆ తేదీని జైలు సూపరింటెండెంట్‌కు తెలియజేయాలని పేర్కొన్నారు. అప్పుడు ఎస్కార్ట్ ద్వారా నిందితుడ్ని ప్రభుత్వాసుపత్రికి జైలు అధికారులు పంపుతారని తెలిపారు. అన్ని పరీక్షలు చేసిన తర్వాత నివేదికను వచ్చే నెల ఆరో తేదీలోగా కోర్టుకు సీల్డు కవర్‌లో సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

అమరావతిపై వ్యతిరేక పోస్టులు..

జీఎస్‌టీ అధికారిపై సస్పెన్షన్ వేటు

- ఆయన వివరణను తిరస్కరించిన ప్రభుత్వం



అమరావతి, తిరుపతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఫేక్ ప్రచారం చేసిన తిరుపతి జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సుభాష్ చంద్రబోస్‌పై సస్పెన్షన్ వేటుపడింది. రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ గత నెల 19న ఆయన తన ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడమే కాకుండా.. 'అమరావతినే ఒక రిజర్వాయర్‌గా కడితే పోలా?' 'ఒకే ఒక్క వర్షం అమరావతి జలమయం'.. అంటూ వ్యంగ్య వ్యాఖ్యానాలు జోడించారు. ఈ పోస్టులు పెద్దఎత్తున సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఆగస్టు 21న వివరణ కోరుతూ ప్రభుత్వం ఆయనకు మెమో జారీ చేసింది.

నా ఫేస్‌బుక్.. నా ఇష్టం..

ఈ నెల 3న బోస్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. 'నా ఫేస్‌బుక్ ఖాతా నా వ్యక్తిగతం. నేను ప్రభుత్వ ఉద్యోగినని ఆ ఖాతాలో ఎక్కడా పేర్కొనలేదు. అది నాది కాదని చెప్పొచ్చు. కానీ అలా చెప్పను. నేను ప్రభుత్వంపై ఒక్క వ్యాఖ్య కూడా చేయలేదు. ప్రభుత్వ విధానాలను తప్పు పట్టలేదు. పొరుగు రాష్ట్రాల రాజధానులైన హైదరాబాద్, చెన్నై, నగరాలు వర్షాలకు తరచూ మునిగిపోతున్నాయి. అలాగే, ఏపీ రాజధాని అమరావతి కూడా ముంపునకు గురైందన్నాను' అని సమర్థించుకున్నారు. 'ప్రధాని మోదీ కూడా తన ప్రభుత్వంపై విమర్శలు స్వాగతిస్తున్నారు. విమర్శలతో ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఇదే విషయం సుప్రీంకోర్టు కూడా పేర్కొంది' అని వాదించారు. ఆయన వివరణను ప్రభుత్వం తిరస్కరించింది. 'ఆ అధికారి ఆ వ్యంగ్య పోస్టులు తానే పెట్టినట్లు చెప్పారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసినప్పుడు వాటిని వ్యక్తిగతమైనవిగా పరిగణించలేం. ఎందుకంటే ప్రజలందరికీ వాటిని చూసే అవకాశం ఉంటుంది. ఉన్నత స్థాయిలో ఉన్న అధికారిగా ఆయన వ్యాఖ్యలు ప్రజలను ప్రభావితం చేయగలవు' అని పేర్కొంది. నిర్మాణాత్మక విమర్శలకు, కువిమర్శలకు తేడా ఉంటుందంటూ ఆయన వివరణను తోసిపుచ్చింది. ఏపీసీఎస్, సీసీఏ 1991, ఏపీ సివిల్ సర్వీసెస్(కండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సోషల్ మీడియాలో పోస్టులపై బోస్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని.. ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ.. తదుపరి విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. వాస్తవానికి సామాజిక స్పృహతో సామాజిక చైతన్యం కోసం సోషల్ మీడియాలో ఆలోచన రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం బోస్‌కు అలవాటని సమాచారం. అయితే అది హద్దులు దాటి తాను అధికారినన్న సంగతి మరచిపోయి ప్రభుత్వంపైనే వ్యతిరేక పోస్టులు పెట్టి సస్పెన్షన్‌కు గురయ్యారు.



వైఎస్ జగన్‌తో సవీంద్రరెడ్డి(ఫైల్)

'కిడ్నాప్' ఫిర్యాదు

జనరల్ డైరీలో రాస్తారా?

- ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు
- 'సవీంద్రరెడ్డి' హెబియస్ కార్పస్ పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు సూటి ప్రశ్న
- ఆలస్యంగా అరెస్టు చూపిన ప్రత్తిపాడు పోలీసులు
- గంజాయి కేసులో అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడి

అమరావతి/గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తన భర్తను కిడ్నాప్ చేశారని భార్య ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా జీడీ(జనరల్ డైరీ)లో ఎంట్రీ చేయడం ఏంటని పోలీసులను హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. కాగ్నిజబుల్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించకపోవడాన్ని ఆక్షేపించింది. గుంటూరు జిల్లా, తాడేపల్లికి చెందిన కుంచాల సవీంద్రరెడ్డి ఆచూకీ తెలుసుకొని బుధవారం తమ ముందు హాజరుపర్చాలని ఆదేశించింది. సవీంద్రరెడ్డి తమ ఆధీనంలో లేరని తాడేపల్లి పోలీసులు చెబుతున్న నేపథ్యంలో అతడిని ఇతర స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేసి ఉంటే హైకోర్టు ముందు హాజరుపర్చాలని.. ఏ ఇతర మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చవద్దని స్పష్టం చేసింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. తన భర్త, గుంటూరు జిల్లా, వైసీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల సవీంద్రరెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆయన భార్య లక్ష్మీప్రసన్న హెబియస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను ధర్మాసనం లంచ్‌మోషన్‌గా స్వీకరించింది. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) తిరుమాను విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. 'సవీంద్రరెడ్డి తాడేపల్లి పోలీసుల అదుపులో లేరు. అతడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఆయన భార్య ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. జనరల్ డైరీలో రాశారు. సవీంద్రరెడ్డి ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు' అని వివరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు.

సమాచార లోపం!

సవీంద్రరెడ్డిని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పోలీసులు సోమవారం సాయంత్రమే అరెస్టు చేశారు. గంజాయి విక్రయాలకు సంబంధించి అందిన సమాచారం మేరకు ఆయనను అరెస్టు చేసి, కిలోన్నర గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. సవీంద్రరెడ్డిని అరెస్టు చేసినట్టు మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడు పోలీసులు వెల్లడించారు. అయితే, సమాచార లోపం కారణంగా ఈ విషయాన్ని హైకోర్టుకు వివరించలేకపోయినట్టు తెలిసింది.

మహిళలు, అట్టడుగు వర్గాలకు ఈ-సేవలు

- రవాణా, రక్షణ, పౌర సేవలకు సైబర్ సెక్యూరిటీ
- ఈ-గవర్నెన్స్ సదస్సులో 'విశాఖ డిక్లరేషన్'
- కేంద్ర జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్ ప్రకటన



విశాఖపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, యువత, అట్టడుగు వర్గాలకు ఈ-సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉందని ప్రజా ఫిర్యాదుల విభాగం జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్ అన్నారు. రవాణా, రక్షణ, సేవా రంగాల్లో ఉపయోగించే డిజిటల్ ప్లాట్‌ఫాంలకు విశ్వాసం ముఖ్యమని, వాటికి సైబర్ సెక్యూరిటీ కల్పించాలని కోరారు. విశాఖపట్నంలో జరుగుతున్న ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో మంగళవారం 'విశాఖ డిక్లరేషన్' ప్రకటించారు. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఢిల్లీ నుంచి గల్లీ వరకు అమలు చేయాలని సరితా చౌహాన్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, ప్రజా సంఘాల మధ్య సహకారం పెంపొందించడానికి కృషి చేస్తామని చెప్పారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్యాలకు అనుగుణంగా 'కనీస ప్రభుత్వం...గరిష్ఠ పరిపాలన' సాధించాలనే లక్ష్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రాజెక్టులను, మోడళ్లను అమలు చేస్తున్నాయని, వాటిని మిగిలినవారూ అందిపుచ్చుకోవాలన్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు, జిల్లాలు, పంచాయతీల మధ్య స్ఫూర్తిదాయకమైన పోటీ ఉండాలన్నారు. విమానాశ్రయాల్లో ఉపయోగిస్తున్న డిజి యాత్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉపయోగిస్తున్న సంపద 2.0, బెంగళూరులో ఏకథా, మహారాష్ట్ర పంచాయతీలు వినియోగిస్తున్న రోహిణి, హైవేస్ సంస్థ వినియోగిస్తున్న డామ్స్ వంటివి ఇతరులూ అమలు చేయవచ్చన్నారు. ఐఐపీఏ డీజీ త్రిపాఠి, కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్, ఏపీ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పాల్గొన్నారు.

ఐదు రోజులు భారీ వర్షాలు

- స్థిరంగా అల్పపీడనం, రేపు మరో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. వచ్చే 24 గంటల్లో ఇది బలహీనపడనుంది. అయితే, ఒడిశా మీదుగా తెలంగాణ వరకూ, వాయవ్య బంగాళాఖాతం, ఒడిశా, విదర్భ మీదుగా కర్ణాటక వరకూ వేర్వేరుగా అల్పపీడన ద్రోణులు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. శ్రీకాకుళం జిల్లా గరికపాలెంలో 8.9, ఎచ్చెర్లలో 8.3, అనకాపల్లి జిల్లా చీడికాడలో 7, వేచలంలో 6.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బుధవారమూ రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం తూర్పు మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి వాయుగుండంగా బలపడి, 27న తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఈ నెల 25 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.